# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి: 8 సంచిక: 12 హైదరాబాద్ 94 నవంబర్ 2019 పేజీలు : 52 వెల: 20/-







- అసమ్మతిని బతకనివ్వండి
- చీకటి కాలం
- ఆర్టీసీ సమ్మె: ప్రభుత్వ వైఖరి
- ఆ గుండె ఆగిపోదు
- ఎమ్మార్వో సజీవ దహనానికి బాధ్యులెవరు?





తెలంగాణ ఆర్‌టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా
నవంబర్ 9న తలపెట్టిన ఛలో ట్యాంక్‌బండ్
కార్యక్రమంపై పోలీసుల దమనకాండ



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

నవంబర్ 2019

సంచిక : 11

సంపుటి : 9



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి

**అల్లం నారాయణ**

చైర్మన్-ప్రెస్ అకాడమి

**చిక్కుడు ప్రభాకర్**

అడ్వకేట్-న్యాయ సలహాదారు

ప్రధాన సంపాదకుడు

**డా॥చింతకింది కాశీం**

సంపాదకురాలు

**స్నేహలత ఎం.**

**సంపాదకవర్గం**

**డా॥ఎ.సిల్మానాయక్**, అసోసియేట్ ప్రొఫెసర్

**క్రాంతి**, జర్నలిస్టు

**శివరాత్రి సుధాకర్**, పరిశోధక విద్యార్థి

**ప్రతాప్ గోపగళ్ల**, పరిశోధక విద్యార్థి

**డిటిపి, లే ఔట్ :** స్నేహ

**కవర్ డిజైన్ :** క్రాంతి



రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

క్వార్టర్ నెం. R-9, O.U క్వార్టర్స్,

ఉస్మానియా యూనివర్శిటి, హైదరాబాద్-500 007.

ఇ.మెయిల్: nadusthunnatelangana@gmail.com

**ఫోన్ నెం.: 9290745490**



**నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్: 62254225854**

ఎస్‌బిహెచ్, రాంకోఠి బ్రాంచ్(20350), హైద్రాబాద్.

IFSC: SBIN0020350


## సంపాదకుని ఉత్తరం

ఈ సమయంలో
ఇలా ఉండొచ్చు
క్షణం మారితే
ఏమవుతుందో
ఉన్నట్టుండి
నీకు ఏమీ కాని దేశంలో
రాజద్రోహివవుతావు

ఒక కేసు ముగిసి
ఊపిరి పీల్చుకునేలోపు
న్యాయవాది నల్లకోటు జేబులో
మాసిపోయిన కర్చీఫ్‌లా
మరో కుట్ర కేసు
తల మీద వేలాడుతుంది

కోర్టు మెట్లెక్కిన ప్రతిసారి
ఎత్తుకుపోయిన పుస్తకంలో
దాచుకున్న
ప్రియురాలి ఉత్తరం గుర్తొస్తుంది

25 నవంబర్ 2019


నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| నిషిద్ధ మానవుడు ప్రొఫెసర్ కాశీంపై మరో కుట్రకేసు | **స్నేహలత ఎం.** | 5 |

**నడుస్తున్న కాలం**

| | | |
|---|---|---|
| అసమ్మతిని బతకనివ్వండి | **చింతకింది కాశీం** | 6 |
| చీకటి కాలం | **సంఘర్ష్** | 8 |
| ఆర్టీసీ సమ్మె; ప్రభుత్వ వైఖరి | **చిక్కుడు ప్రభాకర్** | 12 |
| లేతమెదళ్లలో మతబీజాలు!? | **ఎనిశెట్టి శంకర్** | 19 |
| ఎమ్మార్వో సజీవ దహనానికి బాధ్యులెవరు? | **అరవింద్** | 21 |

**స్మరణ**

| | | |
|---|---|---|
| ఆ గుండె ఆగిపోదు | **బల్లా రవీంద్రనాథ్** | 24 |

**జాతీయం**

| | | |
|---|---|---|
| హ్యూస్టన్‌లో 'మోడి-హౌడి' హంగామా | **ఎ.నర్సింహ్మారెడ్డి** | 28 |

**సాహిత్యం**

| | | |
|---|---|---|
| వినాషాయచ దుష్కృతం      కథ | **సమీర** | 34 |

**పరిశోధన**

| | | |
|---|---|---|
| ప్రజా కళారూపాలు-సామాజిక అధ్యయనం-పరిరక్షణ | **ఇమ్మిడి మహేందర్** | 40 |

**నివేదిక**

| | | |
|---|---|---|
| నిర్బంధం నీడలో పోడు భూముల పోరాటం | **మెంచు రమేష్** | 45 |

**కరపత్ర సాహిత్యం**

| | | |
|---|---|---|
| డా॥వినోదినికి మా మద్దతు | | 47 |
| అసమ్మతిని వినిపిస్తున్నందుకే అణచివేత | **విరసం** | 48 |
| ప్రజా ఉద్యమాలపై, ఆర్టీసీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధం | **టీపీఎఫ్** | 49 |

# నిషిద్ధ మానవుడు కాశీంపై మరో కుట్ర కేసు

**స్నేహలత ఎం.**

*నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక ప్రధాన సంపాదకుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతకింది కాశీంపై మరో కుట్ర కేసు బనాయించిందీ తెలంగాణ ప్రభుత్వం. వెలివాడలో ఉదయిస్తున్న సూర్యునిపై చిర్రా చిటికతో నిషిద్ధ మానవుని ఘోషను రాష్ట్రమంతా వినిపిస్తున్న కాశీంపై మరో ఊపా కేసు నమోదైంది. అంబేద్కర్, పూలే, మార్క్స్ సిద్ధాంతాలను, ప్రజల, విద్యార్థుల సమస్యలను, నిరుద్యోగుల జీవితాలను, దళితులు, ఆదివాసీలు, మహిళలు ఎదుర్కొంటున్న అసమానతలను ఎన్నో వేదికలపై వినిపిస్తున్నందుకే మరోసారి కాశీంపై తెలంగాణ ప్రభుత్వం కుట్రకేసును మోపింది. ప్రొఫెసర్ కాశీం ఏడు సంవత్సరాలుగా అంటే తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా విడిపోకముందు నుంచే కుట్ర కేసులను మోస్తున్నాడని చెప్పాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ  ఆయనను కేసుల్లో ఇరికించడం ఆగలేదు సరికదా మరింతగా ఎక్కువయింది. ఈ కుట్ర కేసులు ఎప్పుడు మొదలయ్యాయో చూద్దాం.*

*జూన్ 9, 2012న ఆంధ్ర ప్రభుత్వం రాజ్యమేలుతున్న రోజులు. వరంగల్ జిల్లా ఖానాపూర్‌లో ఈ కుట్రకేసుల మోపడం మొదలైందని చెప్పాలి. కొంతమంది మావోయిస్టులు, మరికొంతమంది సానుభూతిపరుల మీద మోపిన ఖానాపూర్ కుట్ర కేసులో చింతకింది కాశీంతో పాటు అమరులు ఆకుల భూమయ్య, గంటి ప్రసాదంలను చేర్చారు.* సెక్షన్ 120 of IPC మరియు 16,17, 18, 18(B), 19, 20, 38, 39, 40 of UAPA 1967 *కింద కేసు మోపారు. ఈ కేసులో 10వ నిందితుడుగా కాశీం పేరును చేర్చడమే కాకుండా పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అలా మొదలైన కేసుల పర్వం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. భద్రాచలం, కూసుమంచి, ములుగు, ఖమ్మం కేసులతో పాటు తాజాగా నవంబర్ 12న బి.అనురాధ, ఎన్.రవిశర్మలను అరెస్ట్ చేసిన ఎల్‌బీనగర్ కుట్ర కేసులో కాశీం పేరును పోలీసులు ఎ-8గా చేర్చారు. కేసు రిమాండ్ డైరీలో ఎక్కడా కాశీం ప్రస్తావన లేదు. కానీ నిందితుల లిస్టులో మాత్రం కాశీం పేరు ఉంది. కాశీంతో పాటు ఈ కేసులో వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్, తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణ(ఈయన గద్వాల కుట్ర కేసులో అరెస్టయి ప్రస్తుతం వరంగల్ జైలులో ఉన్నాడు), టీపీఎఫ్ ప్రధాన కార్యదర్శి మెంచు రమేష్‌ల పేర్లు ఉన్నాయి.*

*కవిగా, వక్తగా, రచయితగా, 2009 డిసెంబర్‌లో ప్రారంభమైన నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక సంపాదకుడిగా, వృత్తి రీత్యా అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కాశీం సుపరిచితుడు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుకు ముందు అంటే 1998లో ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్, తెలంగాణ జనసభలలో కాశీం ప్రముఖ పాత్ర పోషించాడు. తెలంగాణలో రైతులకు సాగునీరు, తాగునీరు కావాలని, ఉచిత విద్యుత్‌ను అందించాలని, తెలంగాణలో విద్యా ఉద్యోగావకాశాలు తెలంగాణవారికే దక్కాలని డిమాండ్ చేస్తూ ఆనాడు నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రల్లో పాల్గొని ప్రసంగించాడు. వివిధ సందర్భాల్లో సంఘ్ శక్తుల దాడుల్లో గాయపడి మరణం అంచువరకు వెళ్లివచ్చినవాడు. కోస్తాంధ్ర పాలకుల నిర్బంధం, కేసులు చవిచూసినవాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన కాశీంను రాజద్రోహిని, కుట్రదారుడిని చేస్తున్నదీ ప్రభుత్వం.*

*అక్టోబర్ 4, 2019న గద్వాల జిల్లా టీవీవీ నాయకుడు నాగరాజు అరెస్టుతో గద్వాల కుట్ర కేసు మొదలైంది. అదే కేసులో టీవీవీ బలరాం, స్టూడెంట్ మార్చ్ సంపాదకుడు డా.కె.జగన్, టీపీఎఫ్ ఉపాధ్యక్షుడు నలమాసకృష్ణ, టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటిలను అరెస్టు చేసారు. అదే కేసులో టీపీఎఫ్ ప్రధాన కార్యదర్శి మెంచు రమేష్, చైతన్య మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి శిల్ప, రేణుకలను నిందితులుగా చేర్చి వారు ముగ్గురూ పరారీలో ఉన్నారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ వెంటనే చర్ల కేసులో అరెస్టయిన న్యాయవాది ఐతె అనీల్‌కుమార్, దాసారపు సురేష్‌ల కేసులో ప్రజా సంఘాలలో పనిచేస్తున్న 45 మందిని మరో కుట్ర కేసులో ఇరికించి వీరందరూ కూడా పరారీలో ఉన్నారని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. గద్వాల కేసులో ముగ్గురు, చర్ల కేసులో 45 మంది కూడా ప్రజాసంఘాలలో పనిచేయడమే కాకుండా జీవిక కోసం న్యాయవాద, ఇతర వృత్తుల్లో ఉన్నవారు, ఉద్యోగాలు చేసుకునేవారు, కాలేజీల్లో చదువుకునే విద్యార్థులు. నిత్యం కళ్లముందు కనిపించి, మీడియా ముందు మాట్లాడే ప్రజాసంఘాల నాయకులను పరారీలో ఉన్నారని పేర్కొనడం మరో కుట్రకు దారులు వేయడమేనేమో!?*

*తెలంగాణ వ్యాప్తంగా నెలకొన్న వివిధ సమస్యలపై గొంతెత్తుతున్న ప్రజాస్వామికవాదులు, మేధావులు, ఉద్యమకారులపై కేసులు బనాయించి వారిని మౌనంగా ఉండాలని నిర్దేశిస్తోంది ఈ ప్రభుత్వం. ప్రతిపక్షం అనేది లేకుండా చేసి 'సబ్ ఠీక్ హై' అనాలని చూస్తున్నారు పాలకులు. కానీ ప్రతిపక్ష గొంతు వినిపించే ఉద్యమకారులపై నల్లచట్టాల ప్రయోగం కొత్తదేమీ కాదు. ఈ కుట్రకేసులు ఎన్నో వందల సార్లు నిరూపితం కాక కొట్టుడుపోయాయనేది గతంలో రుజువయ్యింది. ఒకవేళ ప్రొఫెసర్ సాయిబాబ కేసులో వలె సాక్ష్యాలు లేకున్నా, రాజకీయ విశ్వాసాల ఆధారంగా శిక్షలు వేసినా జైళ్లే నిండిపోతాయి. కానీ, మాట్లాడే గొంతులు మూగబోవనేది చారిత్రక వాస్తవం. కాబట్టి నడుస్తున్న తెలంగాణ ప్రధాన సంపాదకుడు కాశీం, ఇతరులపై పెట్టిన ఉపా కేసులను ఉపసంహరించుకోవాలని నడుస్తున్న తెలంగాణ సంపాదకవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.*

***24 నవంబర్, 2019***

# అసమ్మతిని బతకనివ్వండి

చింతకింది కాశీం

మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని భావించిన శివసేన, ఎన్‌సీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రయత్నాన్ని తెల్లవారకముందే తలకిందులు చేసిన పరిస్థితిని దేశ ప్రజలందరూ గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో వున్నవాళ్లు ఏమైనా చేయగలరని మరోసారి నిరూపించారు. ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ విలువలపై భ్రమలున్నవాళ్లకు ఇదొక విషాద సందర్భం. తక్కెటలోని కప్పలవలె ఎన్నికైన ప్రతినిధులు కూడా ఇష్టానుసారంగా దూకగలరని ఈ తరానికి కూడా అర్థం కావడం మంచిదే. కాకపోతే అధికారంలో వున్న వాళ్లు చట్టబద్ధంగా వ్యవహరించాలనే రాజ్యాంగ విలువకు తూట్లు పొడవటమంటే చీకటి అధ్యాయానికి ద్వారాలు తెరవటమే. ఈ ప్రమాద సంకేతాలు రానున్న కాలాన్ని భయపెడుతున్నాయి. భవిష్యత్‌పై భరోసా ఇవ్వాల్సిన ఏలిక 'రెండు రెండ్లు నాలుగంటే' జైళ్ల నోళ్లు తెరిపిస్తున్నారు. మహారాష్ట్ర పరిణామాల వంటి విషాద ప్రహసనం ఎక్కడైనా మొదలవ్వవచ్చు. తెలంగాణ దీనికి మినహాయింపేమీ కాదు.

ఒకవేళ తెలంగాణ అధికార వర్గాలకు, కేంద్ర పాలకులకు మధ్యన వైరుధ్యం ఏర్పడితే, అది వైషమ్య స్థాయికి చేరుకుంటే తెలంగాణలో రాజకీయ పరిణామాలు ఏ మలుపయినా తీసుకోవచ్చు. కేంద్ర ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఇక్కడి పాలకులు నిలబడవల్సి వస్తే ప్రజా మద్దతు లేకుండా సాధ్యమవుతుందా? 'బలమైన కేంద్రం' ఎవ్వరినైనా ఆక్రమించవచ్చు కదా! అప్పుడు బలహీనులందరూ వినిపించ వలసిన పాట ఒకటే ఉంటుంది. కాకతీయ రాజు ప్రతాప రుద్రుడు మొదలు మొన్నటి తెలంగాణ ఉద్యమం వరకు ఢిల్లీ పాలకులకు అసమ్మతిని ప్రకటించడం తెలంగాణ నేల స్వభావంలోనే ఉంది.

అయితే గత ఐదేళ్ల నుంచి తెలంగాణలో ధిక్కార, అసమ్మతి స్వభావాన్ని, లక్షణాన్ని పూర్వపక్షం చేయడమో లేదా తగ్గించడమో చేస్తున్నారు. సామూహిక స్వరంగా నిర్మాణమైన శక్తిని బలహీనపర్చే విధానాలను స్వయంగా పాలకులే చేపట్టారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన అన్నిరకాల పోరాట రూపాలలో వారు ఉద్యమ నాయకత్వంగా ఆనాడు భాగమయ్యారు. ప్రజలలో వెల్లివిరిసిన చైతన్యాన్ని, ఆధిపత్యం మీద వ్యక్తమైన ధిక్కారాన్ని ప్రత్యక్షంగా చూసారు. అందుకే అధికారంలోకి వచ్చాక ప్రత్యామ్నాయ ఆలోచనలను ఆహ్వానించకపోగా నియంత్రించటం మొదలుపెట్టారు. ఈ అదుపు ఎంతవరకు పోయిందంటే మౌలిక మార్పు కోరుకునే వారే కాకుండా ఉదారవాద ప్రజాస్వామిక వాదులు, అస్తిత్వ ఉద్యమాల నాయకత్వాన్ని కూడా బందీలను చేసే వరకు వెళ్లింది.

తెలంగాణలో విప్లవ రాజకీయాలకు యాభై ఏళ్ల చరిత్ర ఉంది. నిజాం వ్యతిరేక పోరాటంలో రైతులు సాయుధంగా తిరుగుబాటు చేసారు. ఈ చరిత్రను మనవే కాదు, ప్రపంచమంతా గుర్తించింది. పార్లమెంటరీ పార్టీల నాయకులు కూడా ఈ ఉజ్వల చరిత్రను కీర్తించారు. మన ఇష్టాలు, ఆసక్తులతో సంబంధం లేకుండా ఒక చరిత్ర గడిచిపోయింది. ఆనాడు చరిత్ర ఆ రూపం తీసుకున్నది. తిరిగి అదే రూపం సాధ్యం అవుతుందా లేదా అనేది వర్తమానమే నిర్ణయించు కుంటుంది. ఈ విధంగా అరవయో దశకంలో మొదలైన విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామ్య భావనలు తెలంగాణ సమాజాన్ని, చరిత్రను సుసంపన్నం చేసాయి. ఆధిపత్య, వెట్టిచాకిరి విలువల స్థానంలో పాక్షికంగానైనా ప్రజాస్వామ్యం అమలయింది. ఈ భావాలు తెలంగాణ గ్రామీణ జీవితంలో పెనుమార్పులు తెచ్చాయి. రాజకీయార్థిక చరిత్రను, సాంస్కృతిక, సాహిత్య నిర్మాణాన్ని విశేషంగా ప్రభావితం చేసాయి. ఈ క్రమంలో జరిగిన పెనుగులాటలో విలువైన యువత, మేధో సంపదను కూడా తెలంగాణ సమాజం కోల్పోయింది.

విలువయిన సంపదత్వంతో కూడిన ఈ అనుభవాలు ఈ సామాజిక చలనంలో అంతర్భాగంగా ప్రవహిస్తున్నాయి. వాటిని కొనసాగించే సమూహం పట్ల ఎవరికైనా భిన్నా భిప్రాయాలు ఉండవచ్చు, తప్పేం కాదు. కొందరు నడిచే మార్గం రాజ్యాంగబద్ధం కానప్పుడు, పౌరులు అలా సామూహికం కావటాన్ని అర్థం చేసుకోవచ్చు, కానీ రాజ్య యంత్రాంగమే చట్టాతీతంగా ఆలోచించడం, వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి

మంచిది కాదు. సమాజంలో మనుషులందరూ సంతోషంగా ఉండాలనీ, అన్నిరకాల అసమానతలు పోవాలని కోరుకునే వారి శాతం కూడా మన తెలంగాణలో గణనీయంగా ఉంది. అలాంటి వ్యక్తులు ఉండటం వలననే తెలంగాణ ఏర్పాటు కూడా సులువయింది. కానీ అలాంటి భావాలు కలిగి ఉండటమే నేరమని రాజ్య యంత్రాంగం భావించడం సరైనది కాదు. సమాజ మార్పుకు ఏ మార్గాన్ని అనుసరిస్తున్నారనే విషయంలో అంగీకారం ఉండకపోవచ్చు. అంత మాత్రాన ఆలోచనలే కల్గి ఉండకూడదని ఆదేశించటం, నియంత్రించటం ప్రజాస్వామ్య భావనకు విరుద్ధం.

నిజాంకు వ్యతిరేకంగా ఆనాడు సాయుధ పోరాటం నడిచింది. దానిని కాదన్న ఆర్య సమాజికులు, కాంగ్రెస్‌వాదులు, సంప్రదాయ వాదులు మౌనంగా ఉండలేకపోయారు. ప్రజా ఆందోళనలో తమకు తోచిన విధంగా పాల్గొన్నారు. గస్తీ నిషాన్‌కు వ్యతిరేకంగా ఎంతో నిరసన పెల్లుబికింది. దేవాలయాలలో భజనలు కూడా చేసుకోకూడదని హుకుం జారీచేస్తే సంప్రదాయవాదులు తమ అసమ్మతిని ప్రకటించారు. గ్రామాలలోకి దినపత్రికలను రానివ్వకపోతే, పత్రికను చదవటమే నేరంగా పరిగణిస్తే సమాజమేమీ మౌనంగా లేదు. నిజాం పీడనకు వ్యతిరేకంగా జరిగిన సామూహిక ప్రదర్శనలో సత్యాగ్రహవాదులు కూడా ప్రముఖపాత్ర పోషించారు. ఇన్ని రూపాలలో ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయటం వలన నిజాం ఫ్యూడల్ పాలన చరిత్రలో కలిసిపోయింది. ఈ భిన్నత్వం తెలంగాణ సమాజపు అపురూప లక్షణం. దీనిని గుర్తించటం, అసమ్మతికి అవకాశాన్ని కల్పించటం పాలకులు విజ్ఞతతో చేయవల్సిన పని.

అలా కాకుండా భావాలను, అభిప్రాయాలను కూడా శాంతి భద్రతలలో భాగంగా చూస్తే అధికార యంత్రాంగం ఆలోచనలను కాదన్న వారందరూ ఉపా కేసుకు గురై చట్ట వ్యతిరేకులు, కుట్రదారులు, దేశద్రోహుల జాబితాలో చేరిపోతారు. 1998లో ఏర్పడిన తెలంగాణ జనసభ, తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్‌తో ప్రారంభమై తెలంగాణ ప్రజాఫ్రంట్, తెలంగాణ విద్యార్థి వేదిక వరకు కార్యాచరణలో ఉంటూ, తెలంగాణ సాధనకు కావల్సిన క్రియాశీలతను పెంచుతూ భావజాల రంగంలోనూ, నిర్మాణాత్మకంగానూ పనిచేసి తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగమైనవారు ఉపా కేసు కింద నేరస్తులు కావటం ఇవాల్టి విషాదం. వీళ్లంతా, తెలంగాణ సమాజం సృజనాత్మకంగా వ్యక్తీకరించబడాలనే ప్రగతి భావనకు పునాదిగా ఉండాలని కోరుకునేవాళ్లే తప్ప, ఈ సమాజం తిరోగమనంలోకి వెళ్లాలని ఆశించేవాళ్లు కాదు. తమ తమ కార్యక్షేత్రంలో చిత్తశుద్ధితో పనిచేస్తూ నిబద్ధతను ప్రదర్శిస్తున్నవారే. ఆంక్షలు, నియంత్రణ సమాజ గమనానికి అడ్డంకులనే నిర్దిష్ట అభిప్రాయం కల్గి ఉండటం నేరంగా భావించే స్థితి ఏ పౌరునికి రాకూడదనే భావధారలో వీళ్లు పనిచేస్తున్నారు. ఇలా ఆలోచించడమే నేరమయితే, రాజ్యాంగ మౌలికతకే ప్రమాదమనే ఆందోళన సమాజంలో వ్యాపిస్తుంది.

భిన్నంగా ఆలోచించడం తెలంగాణ సమాజానికి ఉండే ప్రత్యేక లక్షణమే తప్ప అది నేరం కాదు. అధికార వర్గం సహజంగానే ప్రజా వ్యతిరేక స్వభావాన్ని కల్గి ఉంటుంది. భారత సంవిధానం ప్రకారం నడుచుకోవటం దానికి నచ్చదు. కార్పోరేట్ శక్తుల ప్రయోజానాలకు ఆధిపత్య, అధికార వర్గాల అవసరాల మేరకు రాజ్యాంగ యంత్రాంగం పనిచేస్తుందని భావించినప్పుడు ఎన్ని ఆంక్షలు విధించినా భిన్నస్వరాలు విన్పిస్తాయి. కొన్ని స్వరాలు మంద్రస్థాయిలో ఉండవచ్చు, మరికొన్ని గొంతులు గట్టిగా విన్పించవచ్చు. కానీ అసమ్మతి అనేది తప్పుదు. సమాజం ఎంతగా ప్రజాస్వామీకరించబడితే సామాజిక అభివృద్ధి త్వరితం అవుతుంది. రాజ్యాంగ యంత్రాంగం ప్రజలను చేరుకోవడం సులభమవుతుంది. బ్యూరోక్రసీకి, ప్రజలకు సంబంధాలు ప్రజాస్వామీకరించబడుతాయి. లేదంటే బావిలో నిల్వపడిన నీళ్లవలె ప్రజాస్వామ్యం ఘనీభవిస్తే బ్యూరోక్రసీ మీద, రాజకీయ నాయకత్వం మీద ప్రజలు హింసాయుతంగా వ్యక్తమవుతారు. అప్రజాస్వామిక వాతావరణంలో గొంతు పెకలని స్థితిలో ఉక్కపోతను అనుభవించే సమాజం గిడసబారిపోతుంది.

అసమ్మతి లేని సమ్మతికి సమాజాన్ని సిద్ధం చేస్తే మహారాష్ట్ర పాలకవర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణ లాంటిది తెలంగాణలో సంభవిస్తే వర్తమాన ఆంక్షలకు కారణమైన పాలకులకు వ్యతిరేకంగానే ప్రజలు నిలబడుతారు. ఒక్కోసారి అది చైతన్యలేమి నుంచి కూడా జరగవచ్చు. అంతిమంగా భవిష్యత్‌లో ఇలాంటి స్థితికి తెలంగాణ పాలకవర్గమే కారణమవుతుంది. ఒక తల కంటే పదితలలు ఆలోచించడం ప్రగతిశీలం, ఒక గొంతు కంటే వంద గొంతులు మాట్లాడటం మార్పు. ఈ పరిణామంలో అందరం భాగం కావటం చలనశీలత.

***25 నవంబర్, 2019***

# చీకటి కాలం

సంఘర్ష్

**తెల్లవాడు నిన్ను నాడు "భగత్ సింగ్" అన్నాడు.**
**నల్లవాడు నిన్ను నేడు "నక్సలైట్" అన్నాడు.**
**ఎల్లవారు నిన్ను రేపు "వేగుచుక్క" అంటారు.**

– శ్రీశ్రీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ దోపిడీ, పీడన, అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజ నినదించిందో, నేటికీ అదే దోపిడీ, పీడన, అణచివేత ప్రత్యేక రాష్ట్రంలోనూ అమలవుతోంది. ఏ పౌర, ప్రజాస్వామిక హక్కుల కోసం తెలంగాణ ఉద్యమించిందో నేటికీ ఆ పౌర, ప్రజాస్వామిక హక్కుల అణచివేత కొనసాగుతూనే ఉంది. ఏ ప్రజలైతే నియంతృత్వాన్ని నిలదీసి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముందు నిలిచారో ఆ ప్రజలే ఇవాళ నేరస్థులుగా జైళ్లలో మగ్గుతున్నారు.

తెలంగాణలో ఇప్పుడు చీకటి రాజ్యమేలుతోంది. అధికార బలంతో విర్రవీగుతున్న కేసీఆర్ ప్రభుత్వం నియంతృత్వ విధానాలను అమలు చేస్తోంది. కేంద్రంలో హిందుత్వ బీజేపీ అమలు చేస్తున్న దళిత, మైనార్టీ, ఆదివాసీ, విద్యార్థి, రైతాంగ వ్యతిరేక విధానాలనే టీఆర్ఎస్ ప్రభుత్వమూ అనుసరిస్తోంది. కార్పోరేట్లకు ఊడిగం చేస్తూ, కష్టజీవుల శ్రమను దోచు కుంటోంది. ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి పెట్టుబడి ప్రయోజనాలను ఈడేర్చుతోంది. ఈ పాలక విధానాలను ప్రశ్నించిన వారిపై అసాంఘీక శక్తులు, అర్బన్ మావోయిస్టులనే ముద్ర వేస్తోంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందు నిలిచి పోరాడిన విద్యార్థులు మొదలు ఉద్యమకారులందరిపైనా అక్రమ కేసులు బనాయించి జైళ్లలో బంధిస్తోంది తెరాస ప్రభుత్వం. నిరాహారదీక్ష అంటూ నిమ్మరసం తాగి కాడి మధ్యనే ఎత్తేసిన కేసీఆర్‌ను రోడ్డుకు ఈడ్చిన తెలంగాణ విద్యార్థులే, తెలంగాణ రాష్ట్రం విడివడే వరకూ అలుపెరగని పోరాటం చేశారు. రాష్ట్రసాధన తరువాత కూడా తెలంగాణ ప్రజల పక్షాన తమ గొంతును వినిపిస్తూనే ఉన్నారు. కానీ ఉద్యమ కాలంలో ప్రగల్బాలు పలికిన కేసీఆర్ తీరు మాత్రం రేవు దాటే వరకు ఓడ మల్లన్న, రేవు దాటాక బోడమల్లన్న అన్నట్లుగా మారింది.

ఉద్యమ కాలంలో తెలంగాణలో పౌర, ప్రజాస్వామిక హక్కులు నిలబెడతానన్న కేసీఆర్, ముఖ్యమంత్రి పదవి కంటే పౌర హక్కుల సంఘానికి అధ్యక్షుడిగా ఉండడమే గౌరవంగా భావిస్తానన్న కేసీఆర్, మావోయిస్టు ఎజెండానే మా ఎజెండా అన్న కేసీఆర్, ముఖ్యమంత్రి అయ్యాక మరో వెంగళరావులా, మరో చంద్రబాబులా మారాడు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగితే నక్సలైట్లు అంటున్నాడు. లక్ష ఉద్యోగాలు ఏమయ్యాయంటే లాఠీలు ఝులిపిస్తున్నాడు. కేజీ టూ పీజీ ఉచిత విద్య ఏమైందంటే అసాంఘీక శక్తులంటున్నాడు. నేను చంద్రబాబుకు, రాజశేఖర్‌రెడ్డికి తీసిపోనని నిరూపించు కుంటున్నాడు. ప్రస్తుతం తెలంగాణలో ఉద్యమకారులపై అమలవుతున్న నిర్బంధమే అందుకు నిదర్శనం.

రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులు కూడా ఇక్కడ అమలు కావడం లేదు. నలుగురు కూడి మాట్లాడుకోవడానికి వీల్లేదు. సభ పెట్టుకోవడం నేరం, సమ్మె చేయడం నేరం, సాహితీ సృజన నేరం. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నేరస్థులను చేస్తోంది కేసీఆర్ ప్రభుత్వం. స్వపక్షం తప్ప, ప్రతి పక్షం ఉండకూడదనుకుంటున్న ప్రభుత్వం అసమ్మతిపై అణచివేతను ప్రయోగిస్తోంది. అందులో భాగంగానే ప్రజల గొంతుకగా మారిన ప్రజా సంఘాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. తెలంగాణలో వరుసగా జరుగుతున్న అరెస్టులు అందులో భాగమే.

### అక్రమ కేసులు

అక్టోబర్ 4న ఓ ధర్నాలో పాల్గొని వస్తున్న తెలంగాణ విద్యార్థి వేదిక గద్వాల జిల్లా కన్వీనర్ నాగరాజును పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, అతడికి మావోయిస్టులతో సంబంధాలు న్నాయంటూ ఉపా(చట్ట వ్యతరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కింద తప్పుడు కేసులను నమోదు చేశారు. ఆ వెంటనే 7వ



తేదీ మధ్యాహ్నం టీవీవీ రాష్ట్ర నాయకుడు బలరాంను మహబూబ్‌నగర్‌లో అరెస్టు చేసిన పోలీసులు అతడినీ తప్పుడు కేసులో ఇరికించారు. నాగరాజు, బలరాంల ఎఫ్ఐఆర్‌లో టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, చైతన్యమహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి శిల్ప, విరసం నాయకుడు జగన్, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణ, కార్యదర్శి మెంచు రమేష్, గద్వాల జిల్లా సీఎంఎస్ సభ్యురాలు రేణుకల పేర్లు చేర్చారు. వీరిపై ఐపీసీ 120(బి) నేరపూరిత కుట్ర, 8(1)(2) దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించడం, ఉపా(చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం), 18బి తీవ్రవాద చర్యలను ప్రోత్సహించడం, సహకరించడం, సెక్షన్ 20 నిషేధిత తీవ్రవాద సంస్థల్లో సభ్యులుగా ఉండటం తదితర ఆరోపణలు చేశారు. ఒక తప్పుడు కేసును సృష్టించి, అందులో వివిధ ప్రజా సంఘాల నాయకుల పేర్లను చేర్చడం ద్వారా ఆయా సంఘాల కార్యకలాపాలను అడ్డుకోవడమనేది ప్రభుత్వ కుట్రగా స్పష్టమవుతోంది. ఈ కుట్రలో భాగంగానే పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించి మరీ ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై దాడులకు పాల్పడుతున్నారు. ప్రజా ఉద్యమకారులను అక్రమంగా అరెస్టు చేసి జైళ్లపాలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ సర్కారు కొనసాగిస్తున్న పద్ధతినే తెలంగాణ పోలీసులు అనుసరిస్తున్నా రనడానికి జగన్, మద్దిలేటి, నలమాల కృష్ణల అరెస్టే నిదర్శనం.

అక్టోబర్ 8వ తేదీ ఉదయం హైదరాబాదులోని అడిక్‌మెట్‌లో టీవీవీ అధ్యక్షుడు మద్దిలేటి ఇంట్లో ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా సుమారు 45 మంది మఫ్టీ పోలీసులు సోదాలు నిర్వహించారు. మద్దిలేటి ఇంటి నుంచి పుస్తకాలు, ల్యాప్‌టాప్‌తో పాటు, మద్దిలేటి సహచరి ఫోన్ తీసుకెళ్లారు. సరిగ్గా రెండు రోజుల తరువాత అక్టోబర్ 10వ తేదీన బైక్‌పై వెళ్తున్న విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగన్‌ను వెంబడించి విద్యానగర్‌లో పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి తార్నాకలోని అతడి ఇంటిపై దాడి చేసి సాయంత్రం వరకు సోదాలు నిర్వహించారు. పుస్తకాలతో పాటు, జగన్ తమ్ముడి నుంచి ల్యాప్‌ట్యాప్‌ను తీసుకెళ్లారు. అక్టోబర్ 15న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ ప్రజా ఫ్రంట్ కార్యాలయంలోకి చొరబడి టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణ, తెలంగాణ విద్యార్థి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. వీరు మావోయిస్టు పార్టీకి సహకరిస్తున్నారంటూ కోర్టు ముందు తప్పుడు ఆరోపణలు చేసి జైలుకు పంపారు.

### తప్పుడు ప్రచారం

అక్టోబర్ 4 నుంచి 15వ తేదీ వరకు సాగిన ఈ అరెస్టుల పరంపరలో భాగంగా ప్రభుత్వం ప్రజా సంఘాలపై తప్పుడు ప్రచారాన్ని లంఘించింది. అరెస్టుల నేపథ్యంలో అక్టోబర్11వ తేదీన మీడియా సమావేశం నిర్వహించిన హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ ప్రజా సంఘాలు మావోయిస్టు

పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నాయంటూ ప్రకటించాడు. ప్రజా సంఘాల సభ్యులు పార్టీలోకి విద్యార్థులు, యువతను రిక్రూట్ చేస్తున్నాయని ఆరోపించడంతో పాటు, వీటిని నిషేధిత సంస్థలుగా పేర్కొన్నాడు.

పోలీసు కమిషనర్ నిషేధిత సంస్థలుగా ప్రకటించిన మానవ హక్కుల వేదిక, పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం, కులనిర్మూలన పోరాట సమితి, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక, తెలంగాణ ప్రజా ఫ్రంట్, చైతన్య మహిళా సంఘం, ప్రజా కళా మండలి, అమరుల బంధుమిత్రుల సంఘం, తెలంగాణ విద్యార్థి వేదిక, డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్, తెలంగాణ విద్యార్థి సంఘం, ఆదివాసీ విద్యార్థి సంఘం, తెలంగాణ యువజన సంఘం, తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య, గిరిజన ఐక్యవేదిక, దేశ భక్త ప్రజాతంత్ర ఉద్యమం, తెలంగాణ రైతాంగ సమితి, తుడుం దెబ్బ, భూ నిర్వాసిత వ్యతిరేక పోరాట కమిటీ, పీపుల్స్ ఆగనేస్ట్ పోలవరం ప్రాజెక్ట్, విస్తాపన విరోధి జన వికాస్ ఆందోళన్ తదితర సంస్థలకు సుదీర్ఘకాలంగా ప్రజా సమస్యలపై పనిచేస్తున్నచరిత్ర ఉంది. ఈ సంస్థలను ప్రజల నుంచి దూరం చేసేందుకే ప్రజా సంఘాల కార్యకర్తలపై తప్పుడు ఆరోపణలతో అక్రమ కేసులు మోపుతున్నారని పోలీస్ కమిషనర్ వాదన వింటే అర్థమవుతుంది.

ప్రభుత్వం, పోలీసులు నిషేధిత సంస్థలుగా ప్రచారం చేస్తున్న ఈ సంఘాలన్నీ దశాబ్దాలుగా తెలుగు నేలపై పౌర, ప్రజాస్వామిక విలువల కోసం కొట్లాడుతున్నాయి. టీఆర్ఎస్ ఆవిర్భావానికి ముందు నుంచే ప్రత్యేక తెలంగాణ కోసం పనిచేస్తున్నాయి. తెలంగాణ వాదాన్ని పలెపల్లెకు విస్తరించడంలో ఈ సంస్థల కృషి ఘననీయమైనది. సామ్రాజ్యవాద అనుకూల విధానాలతో తెలంగాణను వల్లకాడుగా మార్చిన సమైక్య పాలకుల కుటిలనీతిని ఎండగట్టడంలో ముందు నిలిచిన సంస్థలివి. ఈ ఉద్యమ సంస్థల కృషి ఫలితంగానే తెలంగాణ వాదం క్షేత్రస్థాయిలో వేళ్లూనుకుంది. మలిదశ తెలంగాణ ఉద్యమానికీ ఈ ఉద్యమ సంస్థలు చేసిన భావజాల వ్యాప్తే మూలం.

మలిదశ ఉద్యమంలోనూ ఈ సంఘాలు క్రియాశీల పాత్ర పోషించాయి. లాఠీలు, తూటాలకు వెరవకుండా ప్రత్యేక రాష్ట్రం కోసం నిలబడ్డాయి. జైలు నిర్బంధాలను చవిచూశాయి. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తరువాత కూడా తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. విద్యా వ్యాపారం, నిరుద్యోగం, దళితులు, మహిళలపై దాడులకు వ్యతిరేకంగా, ఆదివాసులు, అణగారిన ప్రజల పక్షాన తమ గళం వినిపిస్తున్నాయి. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి ఇది కంటగింపుగా మారింది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేసీఆర్ ప్రశ్నించే గొంతులను అణచివేసి ప్రశ్నను తొక్కిపెట్టాలనుకుంటున్నాడు. ప్రతి పక్షాన్ని లేకుండా చేసేందుకు ఎమ్మెల్యేలను, మీడియాను కొనుగోలు చేసి తమ ఆస్థానంలో కట్టిపడేసుకున్న కేసీఆర్, ప్రజల పక్షాన పోరాడుతూ నిజమైన ప్రతిపక్షంగా నిలిచిన ప్రజా సంఘాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాడు.

ప్రశ్నించడాన్నే నేరంగా పరిగణిస్తున్న ప్రభుత్వం ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై మావోయిస్టు ముద్ర వేస్తోంది. మహబూబ్‌నగర్ కేసులో వివిధ ప్రజా సంఘాలకు చెందిన ఎనిమిది మందిపై తప్పుడు ఆరోపణలు చేసిన పోలీసులు, అక్టోబర్ 20న చర్లలో మరో అబద్ధపు కేసును సృష్టించారు. వరంగల్‌కి చెందిన న్యాయవాది, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నాయకుడు ఐత అనిల్, దాసారపు సురేష్‌లను అక్రమంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై యూఏపీఏ కేసు నమోదు చేశారు. అదే కేసులో వివిధ ప్రజా సంఘాలకు చెందిన 45 మందిని నిందితులుగా పేర్కొన్నారు. వీరంతా మావోయిస్టు పార్టీ కోసం పనిచేస్తున్నారనే తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆయా ప్రజా సంఘాలను మావోయిస్టు పార్టీ అనుబంధ సంఘాలుగా పేర్కొన్నారు. 15 రోజుల వ్యవధిలో 53మందిపై ఊపా కేసులు నమోదు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుంది. వీరిలో తొమ్మిది మంది చైతన్య మహిళా సంఘం సభ్యులున్నారు. 25 ఏళ్లుగా తెలుగు నేలపై మహిళా సమస్యలపై పోరాడుతున్న సంస్థను మావోయిస్టు అనబంధ సంస్థ అంటూ రెండు తెలుగు ప్రభుత్వాలు కొంత కాలంగా ప్రచారం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకంగా చైతన్య మహిళా సంఘం సభ్యుల ఫొటోలతో పోస్టర్లు వేసి మరీ వీరంతా మావోయిస్టులంటూ దుష్ప్రచారం చేసింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వమూ అదే వైఖరిని అనుసరిస్తూ ప్రజా సంఘాలపై తప్పుడు ఆరోపణలు చేస్తోంది.

ప్రజా సమస్యలపై నిలదీయడమే మావోయిజం అయితే... ప్రశ్నించే ప్రతి ఒక్కరూ మావోయిస్టే అవుతారు.

అయినా మావోయిస్టు కావడమే నేరం కాదని ఉన్నత న్యాయస్థానాలు చెబుతుంటే... పోలీసులు మాత్రం మావోయిస్టు అనే పదాన్ని అత్యంత ప్రమాదకరమైనదిగా ప్రచారం చేస్తున్నారు. నిషేధిత సంస్థలుగా పోలీసులు ప్రకటించిన జాబితాలోని సంస్థల కార్యక్రమాల్ని పరిశీలిస్తే... అవి ఎంత ప్రమాదకరమైనవో అర్థమవుతుంది. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల కోసం పనిచేసే సంఘాలు, కార్యకర్తలపై తప్పుడు ఆరోపణలు చేసినంత మాత్రాన అబద్ధం నిజమైపోదు.

## ప్రశ్నే నేరమైనప్పుడు

మద్దిలేటి, బలరాం, నాగరాజులు పనిచేస్తున్న తెలంగాణ విద్యార్థి వేదిక గత 13 ఏళ్లుగా అందరికీ సమాన విద్య అందాలని కొట్లాడుతోంది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటడంతో పాటు, ప్రత్యేక రాష్ట్ర సాధన ఆవశ్యకతను విస్తృతంగా ప్రచారం చేసిన సంస్థ టీవీవీ. 2009 మలి దశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీ ఏర్పాటులో, అది నిర్వహించిన కార్యక్రమాల్లో టీవీవీ కీలక పాత్ర పోషించింది. ఛలో అసెంబ్లీ, గాంధీ భవన్ ముట్టడి, రాజ్ భవన్ ముట్టడి వంటి కార్యక్రమాల్లో టీవీవీ పాత్ర ఘననీయమైంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత కూడా కేజీ టూ పీజీ ఉచిత విద్య కోసం పల్లె పల్లెనా ప్రచారం నిర్వహించింది. నల్లమలలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా కదంతొక్కింది. విద్యను వ్యాపారంగా మార్చి రాంక్యుల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న శ్రీచైతన్య, నారాయణ కాలేజీలకు వ్యతిరేకంగా విస్తృత పోరాటాన్ని నిర్వహించింది. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పోరేట్ కాలేజీలను రద్దు చేయాలంటూ టీవీవీ చేసిన పోరాటం చారిత్రాత్మకమైనది. లక్షలాది మంది విద్యార్థుల్లో శ్రీచైతన్య, నారాయణ కళాశాలల దోపిడీని గురించి అవగాహన కల్పించింది. టీవీవీ చేస్తున్న ఈ పోరాటమే ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది. కార్పోరేట్ విద్యా సంస్థలతో కుమ్మక్కై ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న తెలంగాణ సర్కారు టీవీవీ గొంతు నొక్కాలనుకుంది. అందుకే.... టీవీవీ నాయకత్వంపై తప్పుడు కేసులు బనాయించి జైళ్లలో నిర్బంధించేందుకు సిద్ధమైంది. టీవీవీని మావోయిస్టు అనుబంధ సంస్థగా ప్రచారం చేయడం ద్వారా విద్యార్థుల నుంచి టీవీవీని దూరం చేయాలనుకుంటోంది.

అది మాత్రమే కాదు.. విద్యార్థుల పోరాటాలకు సంఘీభావంగా వెలువడుతున్న స్టూడెంట్ మార్చ్ పత్రికపైనా ప్రభుత్వం కక్షసాధింపుకు పూనుకుంది. అందులో భాగంగానే స్టూడెంట్ మార్చ్ సంపాదకుడు జగన్‌పై అక్రమ కేసును బనాయించింది.

ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ సికింద్రాబాద్ పీజీ కాలేజ్‌లో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న జగన్ విరసం సభ్యుడు. విద్యార్థి దశ నుంచే తెలంగాణ వాదాన్ని వినిపించిన ఉద్యమకారుడు. తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ సభ్యుడిగా టీఆర్ఎస్ పుట్టక ముందు నుంచే తెలంగాణ కోసం విద్యార్థి రంగంలో పనిచేసినవాడు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం కూడా రచయితగా, వక్తగా, అధ్యాపకుడిగా, పత్రికా సంపాదకుడిగా ప్రజల పక్షాన మాట్లాడుతున్న, రాస్తున్న వ్యక్తి. ఇలాంటి ఉద్యమ గొంతును అణచివేయడం కోసమే జగన్‌పై అక్రమ కేసును మోపింది ప్రభుత్వం.

భౌగోళిక తెలంగాణతో ప్రజా సమస్యలు పరిష్కారం కావని, ప్రజాస్వామిక తెలంగాణలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని నమ్మి అందుకోసమే పనిచేస్తున్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ తెలంగాణలో అసలు సిసలైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. ఆదివాసులు, గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడుభూముల పట్టాల కోసం ఉద్యమించిన సంస్థ టీపీఎఫ్. నల్లమలలో యురేనియం తవ్వకాలను వ్యతిరేకించింది. ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా పోరాడింది. భూ నిర్వాసితుల్ని ప్రశ్నించింది. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ముంపు ప్రజలకు అండగా నిలిచింది. మూసేసిన ప్రభుత్వ రంగ సంస్థలను పునరుద్ధరించాలని నినదించింది. తెలంగాణలో ప్రతి పల్లెను చైతన్య వంతం చేసింది. ప్రశ్నను వెంటేసుకు తిరిగింది. ఈ ప్రశ్నే పాలకులకు కంటగింపుగా మారింది. అందుకే టీపీఎఫ్ నాయకులు నలమాస కృష్ణ, మెంచు రమేష్‌పై అక్రమ కేసులకు సిద్ధమైంది ప్రభుత్వం.

ఈ అక్రమ కేసులు, అరెస్టులు ఇక్కడితో ఆగేవి కావు. మనం మౌనం వహిస్తున్నంత కాలం మరింత అణచివేతకు, దోపిడీకి గురిచేస్తూనే ఉంటాయి పాలకవర్గాలు. అందుకే ఈ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా, నియంతృత్వానికి వ్యతిరేకంగా గళమెత్తాల్సిన సందర్భం ఇది. తెలంగాణలో పౌర, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సందర్భం ఇది.

★ **రచయిత: జర్నలిస్ట్** T

నడుస్తున్న కాలం

# ఆర్టీసీ సమ్మె: ప్రభుత్వ వైఖరి

● చిక్కుడు ప్రభాకర్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని 49,190 (శ్రామిక్, గ్యారేజీ ఉద్యోగులు, మెకానిక్‌లు కండక్టర్లు, డ్రైవర్లు) ఉద్యోగులందరూ దాదాపు 26 డిమాండ్లతో అక్టోబర్ నెల 4వ తేదీ అర్థరాత్రి నుంచి సమ్మెకు దిగారు. రవాణా సంస్థలోని గుర్తింపు పొందిన యూనియన్‌లైన తెలంగాణ మజ్దూర్ యూనియన్, తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌లు కలిసి ఆర్టీసీ జేఏసీగా ఏర్పడ్డాయి. తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్, బహుజన కార్మిక సంఘం, బహుజన యూనియన్, సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్, కార్మిక సంఘ్ సభ్యులు కలిసి ఆర్టీసి జేఏసీ-1గా ఏర్పడి తమ సమస్యల పరిష్కారం కొరకు ఆగస్టు 31, 2019న సమ్మె నోటీసు ఇచ్చారు. ఎంప్లాయిస్ యూనియన్ సెప్టెంబర్ 3, 2019 నాడు సమ్మె నోటీసిచ్చింది. సెప్టెంబర్ 11, 2019న టీఎంసీ నోటీసిచ్చింది. యాజమాన్యానికి ఈ నోటీసు ఇచ్చిన రోజునే కార్మిక శాఖ అధికారికి, ప్రభుత్వానికి కూడా ఈ యూనియన్‌లు సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం, కార్మికశాఖ అధికారులు, సంస్థ యాజమాన్యం కలిసి ఉద్దేశ పూర్వకంగానే కార్మిక యూనియన్‌లతో చేయవల్సిన చర్చలను నెలరోజులు తాత్సారం చేశారు. భారత పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం 1947 ప్రకారం కార్మిక యూనియన్ నోటీసులను అందుకున్న తరువాత రోజు నుంచి సమస్యల మీద యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చించి పరిష్కారం కనుగొనాలి. కానీ అలా చేయలేదు. సమస్యలు పరిష్కారం కాకుంటే అదే విషయాన్ని 14 రోజులలో సంబంధిత ప్రభుత్వ శాఖకు పంపాలి. సంబంధిత ప్రభుత్వం కార్మిక న్యాయస్థానానికి పంపాలి. కార్మిక న్యాయస్థానం దానిని విచారించవలసి ఉంటుంది. కానీ సమ్మె నోటీసులు అందుకున్న కార్మిక శాఖ అధికారులు అలా చేయలేదు.

**కార్మికుల డిమాండ్లు:**

1. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి.

2. ఆర్టీసీ పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఆర్టీసికి ఇవ్వవలసిన రాయితీ బిల్లు వెంటనే చెల్లించాలి. ఇక మీదట క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాలి.

3. వివిధ చట్టాలకు అనుగుణంగా జీహెచ్ఎంసీ నుండి రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలి.

4. డీజిల్‌పై పెరుగుతున్న భారాన్ని ప్రభుత్వమే భరించాలి. సామాజిక బాధ్యతతో నడుస్తున్న ఆర్టీసికి ఎం.వి. టాక్స్‌ను రద్దుచేస్తూ అన్నిరకాల పన్నులపై మినహాయింపు ఇవ్వాలి.

5. కండక్టర్, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

6. 1 ఏప్రిల్ 2017 నుండి రావలసిన జీతభత్యాల సవరణ వెంటనే చేయాలి.

7. అన్ని కేటగిరీలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలి.

8. ఎస్.పి.ఎస్., ఎస్.ఆర్.బి.ఎస్.ఎస్.బి.టి బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలి.

9. చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలిస్తూ అర్హతలను బట్టి సూపర్ వైజర్ పోస్టులను కూడా ఇవ్వాలి.

10. రిటైర్ అయిన ఉద్యోగులకు సెటిల్‌మెంటుతో పాటు, సకలజనుల సమ్మె వేతనాన్ని చెల్లించాలి.

11. వన్ టైమ్ మేజర్ క్రింద ఇంటర్ స్టేట్ జోన్/ రీజియన్ ట్రాన్స్‌ఫర్లు చేయాలి.

12. రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగా సంస్థలోని మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వాలి.

13. మెడికల్ అన్‌ఫిట్, కలర్ బ్లైండ్ అయిన ఉద్యోగులకు వెంటనే ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రభుత్వం నుండి తీసుకున్న మినహాయింపు సర్క్యులర్‌లను రద్దు చేయాలి.

14. రిటైర్ అయిన కార్మికులకు తెల్లరేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఆసరా పెన్షన్ ఇవ్వాలి.

15. కాలం చెల్లిన బస్సులను తీసివేయాలి. అద్దె బస్సులను రద్దు చేయాలి. కొత్త బస్సులను కొనుగోలు చేయాలి.

16. విద్యుత్ బస్సుల ఫేమ్ 2 పథకంలో మార్పులు



చేసి వాటిని ఆర్టీసీ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకొని, అలవెన్సులపై ఇస్తున్న రాయితీలు ఆర్టీసికి ఇవ్వాలి.

17. తార్నాకలో ఉన్న ఆర్టీసీ హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అభివృద్ధి చేయాలి. వైద్య సదుపాయాలతో పాటు మందులను కూడా సరఫరా చేయాలి. తల్లితండ్రులకు సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సౌకర్యం కల్పించాలి.

18. ఎం.టి.డబ్ల్యూ యాక్ట్ ప్రకారం డ్యూటీలు ఉండాలి. డబుల్ డ్యూటీకి డబుల్ వేజెస్ ఇవ్వాలి.

19. మిగిలిపోయిన కాంట్రాక్ట్/క్యాజువల్ కార్మికులతో పాటు సివిల్ ఇంజనీరింగ్, పారామెడికల్‌లో పని చేస్తున్న వారిని కూడా రెగ్యులర్ చేయాలి.

20. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌తో పాటు డి.ఎ ఎరియర్స్ చెల్లించాలి. ఉద్యోగులకు యూనిఫారమ్స్ సరఫరా చేయాలి.

21. ఇంటర్ స్టేట్ ఒప్పందం ప్రకారం బస్సులు నడపాలి. అక్రమ రవాణాని అరికట్టాలి. కొరియర్, పార్సిల్, గూడ్స్ రవాణాకు ఆర్టీసిని అనుమతించాలి.

22. స్టాఫ్ రేషియోకు అనుగుణంగా సూపర్‌వైజర్లను పెంచి ఖాళీలను భర్తీ చేయాలి.

23. గ్యారేజి కార్మికులపై పనిభారాలను తగ్గించి గ్యారేజీతో సహా అన్ని విభాగాలలో అవుట్ సోర్సింగ్ ఎత్తేయాలి.

24. సిటీలో పని చేస్తున్న మహిళా కండక్టర్లకు రాత్రి 9 గంటలకే విధులు ముగించేటట్లు డ్యూటీలు వేయాలి.

25. రెగ్యులేషన్ 30లో పని చేస్తున్న ఉద్యోగులను వారు చేరిన తేదీ నుండి రెగ్యులర్ చేయాలి.

టిఎంయుకు చెందిన నోటీసును జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ గారు సెప్టెంబర్ 16వ తేదీన అడ్మిట్ చేసి ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకుంటూ, చర్చలు జరపకుండానే ఎటువంటి కారణం లేకుండా సెప్టెంబర్ 23వ తేదీకి వాయిదా వేశారు.

ఈ సంస్థ ప్రజల నిత్యావసర సేవల సంస్థగా గుర్తింపు ఉన్న దృష్ట్యా, లేబర్ కమిషనర్ గారు 14 రోజులలో నిరంతరం కార్మిక సంఘాలతో, యాజమాన్యంతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి సమ్మెను నివారించాల్సిన బాధ్యత సంస్థ యాజమాన్యం, ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారిగా అతనికి ఉన్నది. కానీ ఆ విధంగా చేయకుండా ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకున్న ఆ అధికారి సెప్టెంబర్ 23 నాటి చర్చలను కూడా ఎటువంటి కారణం లేకుండా భవిష్యత్ చర్చల తేదీని తెలుపకుండా సెప్టెంబర్ 21వ తేదీ నాడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ, చట్ట వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ సెప్టెంబర్ 26వ తేదీన టిఎంయు చర్చలను ముగించనున్నట్లుగా ఒక లేఖను కార్మిక శాఖ అధికారికి ఇచ్చింది. దాంతో చర్చలను ముగించినట్లుగా తెలియజేసింది. భారత కార్మిక చట్టాల పరిధిలో, భారత పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం 1947లోని సెక్షన్ 12 (6) ప్రకారం కార్మిక శాఖ అధికారి 14 రోజులలో సమస్యను సంబంధిత ప్రభుత్వానికి పంపలేదు అలాగే చర్చలను ఎందుకు కొనసాగించలేకపోయారో

తెలుపలేదు. సెప్టెంబర్ 30 నాటికి గడువు ముగియగా, మళ్లీ మూడవ తేదీన చర్చలు కొనసాగిస్తున్నట్లుగా, 4వ తేదీన చర్చలు జరిగేటట్లు నోటీసు ఇచ్చారు. దానికి యూనియన్ నాయకులు హాజరైనా చర్చలు జరగలేదు. ఇక ప్రభుత్వం తూతూ మంత్రంగా ఆర్థిక కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి ఇతర అధికారులతో కలిసి త్రిసభ్య కమిటీ సెప్టెంబర్ 2న ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఏ ఒక్క సమస్య మీద కూడా నిర్దిష్టంగా కార్మికసంఘాలతో చర్చించకుండానే చర్చలు ముగిసినట్లుగా ప్రకటించింది. కార్మిక సంఘాలకు అనివార్యంగా సమ్మెకు పోవడం తప్ప, మరే మార్గం లేకపోయింది. ఫలితంగా 4వ తేదీ అర్ధరాత్రి నుండి దాదాపు 50 వేల కార్మికులు సమ్మెలోకి దిగారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. సామ, దాన, బేధ, దండోపాయాలతో సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇంకా ఆర్టీసీని దోచుకున్న, దోచుకోబోతున్న దోపిడీదారులను కూడా వినియోగించి అన్ని రకాలుగా సమ్మెను విఫలం చేయాల్సిందిగా ఆదేశించింది. కానీ కార్మిక బలం ముందు ఏ బలం నిలువదని ప్రపంచ చరిత్రలో ఎన్నో సంఘటనలు నిరూపించబడ్డాయి. ఆర్టీసీ సమ్మె కూడా అదే రుజువు చేసింది. ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు విఫలం చేస్తూ తమలో తమకు ఎన్ని విభేదాలున్నా, ఈ సమ్మెను విజయవంతం చేసి ఈ సంస్థను కాపాడుకోవాలన్న తపన చిత్త శుద్ధి, సంకల్పం ప్రతి కార్మికునికి, కార్మికురాలికి దృఢంగా ఉండడం వలన సమ్మె అప్రతిహతంగా కొనసాగుతున్నది. అయితే ప్రభుత్వం నడిపిస్తున్న ప్రత్యామ్నాయ బస్సులను అడ్డుకోకపోవడం వలన కొన్ని బస్సులు తిరుగుతున్నాయి.

దాదాపు 75 వేల కోట్ల ఆస్తులు కలిగిన ఈ సంస్థ మీద ఆధిపత్యం చెలాయించి, సంస్థను దోచుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి పన్నాగం పన్నారు. తెలంగాణలో దాదాపు 550 వరకు బస్టాండ్‌లను, విలువైన భూములు కలిగి, రాష్ట్రంలోని 97 డిపోలు, 11 రీజియన్ కార్యాలయాలు, వివిధ వర్క్‌షాపులు, ఇతర ఆస్తులను దోచుకోవడంతో పాటు తనకు, తన తాబేదార్లయిన బడా పెట్టుబడిదారులకు నిరంతరం ఆదాయం సమకూర్చడం కొరకు బస్సుల సంఖ్యలో 50:30:20 నిష్పత్తిలో ప్రభుత్వ, అద్దె, పూర్తిగా ప్రైవేటు బస్సులను తేవాలని నిర్ణయించుకుని సంస్థ మనుగడను దెబ్బతీసి అపార సంపదను దోచుకునేందుకు అస్తిత్వం కలిగిన యూనియన్లను అప్రతిష్ట పాలు చేసి, తన పబ్బం గడుపుకోవాలని కార్మిక సంఘాల మీద దుష్ప్రచారం చేయడం మొదలుపెట్టారు. మొదట పండగపూట సమ్మె చేస్తున్నారని, ఆ తర్వాత యూనియన్ నాయకులకు అక్రమ ఆస్తులు ఉన్నాయని, మరొకవైపు సంస్థను నష్టాల్లో నెట్టేందుకు కార్మిక సంఘాలు ప్రయత్నాలు చేస్తున్నాయని, కార్మికునికి సగటున 50 వేల జీతం ఇస్తున్నా, ఇంకా జీతభత్యాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారని ప్రభుత్వం సంస్థకు ఇవ్వవలసిన బకాయిల కంటే ఎక్కువనే ఇచ్చిందని, తాము ఎక్కిన కొమ్మను తామే నరుక్కుంటున్నారని నోటికి వచ్చినట్లు మీడియా ద్వారా ప్రచారం చేశారు.

ఈ సమ్మె ఆర్టీసీ కార్మికుల జీతాల పెంపు కొరకు కాదని, ఈ సమ్మె ప్రజా రవాణా సంస్థను కాపాడుకోవడం కొరకని కార్మికుల రాజ్యాంగ, చట్టబద్ధ హక్కులను రక్షించుకోవడానికి అని ప్రకటించి ఆర్టీసీ జేఏసీ, జేఏసీ-1లు సంయుక్తంగా దసరా పండుగ తెల్లవారి అంటే అక్టోబర్ 9వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, కార్మిక, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని తమ మద్దతు తెలపాల్సిందిగా కోరాయి. హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు, అధికార పార్టీలు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు తెలంగాణ ప్రజాస్వామిక వేదిక, తెలంగాణ ప్రజాఫ్రంట్‌లు కూడ హాజరై సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపి, కార్మికుల సమ్మెను "ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం"గా వర్ణించాయి. ఇంకొకవైపు ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తూ, పాఠశాల, కాలేజీల బస్సులను వారివారి యజమానుల నుండి బలవంతంగా లాక్కొని నడపడం, అనుమతి లేని డ్రైవర్లు, కండక్టర్లను నియమించుకోవడం ఇంకోవైపు సమ్మెను విరమింపచేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజనం వాజ్యం వేయించడం లాంటి తప్పుడు పనులకు పూనుకున్నది. కార్మికులు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి సమ్మెను ఉధృతం చేయాల్సిందిగా పిలుపునిస్తూ న్యాయపోరాటం చేయాలని నిర్ణయించి సెప్టెంబర్ 9న జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలోనే ఐదుగురు సభ్యులతో కూడిన న్యాయ నిపుణుల కమిటీని (జస్టిస్ చంద్రకుమార్, దేశాయి ప్రకాష్ రెడ్డి, చిక్కుడు ప్రభాకర్, రామచంద్రరావు, రచన రెడ్డి) ఏర్పాటు చేసింది. ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల ఫలితంగా రచనారెడ్డి తప్ప మిగతా వారు క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రకాష్ రెడ్డి గారిని డివిజన్ బెంచ్‌లో, చిక్కుడు ప్రభాకర్‌ను సింగిల్ బెంచ్‌లో తమ

వాదనలు కొనసాగించాలని నిర్ణయించి, అందుకు అనుగుణంగా వాదనలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి న్యాయస్థానాన్ని వాడుకునే ప్రయత్నం బెడిసి కొట్టింది. అది తెలుసుకున్న ప్రభుత్వం మరింత మొండిగా వ్యవహరిస్తూ కార్మికులు తమకు తామే "సెల్ఫ్ డిస్మిస్" అయ్యారని, 50,000 కార్మికులు ఇక ఆర్టీసీ కార్మికులు కారని, ఆర్టీసీ చరిత్ర ముగిసిందని, తీరని అప్పుల్లో ఉందని, ఆ అప్పును ప్రభుత్వం తీర్చదని అన్యాయంగా, దుర్మార్గంగా మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీఆర్ తన నిరంకుశ పాలనను మరింత నిర్బంధాలతో కార్మికులను భయపెడుతూ, సమ్మె మీద పాశవిక నిర్బంధం అమలు చేస్తున్నారు.

ఒకవైపు మొక్కవోని ధైర్యంతో సమ్మెను కార్మికులు ఉధృతం చేయుచుండగా, మరొకవైపు ఆర్థిక సమస్యలతో అసలే చాలీచాలని జీతాలు కలిగిన ఉద్యోగులు సెప్టెంబర్లో చేసిన పనికి కూడా యాజమాన్యం జీతభత్యాలు చెల్లించకపోవడంతో ప్రభుత్వ దుర్మార్గ మాటలకు బాధ పడి ఇద్దరు మహిళా ఉద్యోగులతో పాటు 23 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కొందరు గుండెపోటుతో మరణించారు. సమ్మెను కోర్టు ద్వారా ముగింపు చేయాలని అనుకున్న ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచన యూనియన్ల న్యాయవాదుల సమర్థవంత వాదనలు వలన, రోజురోజుకు సన్నగిల్లుతుండగా మరోవైపు కార్మికులను సెల్ఫ్ డిస్మిస్ అన్న ప్రభుత్వం ఒకమెట్టు దిగి వచ్చి ఎక్కడికక్కడ కార్మికుల యూనియన్లతో సంబంధం లేకుండా పనుల్లో చేరాలని కార్మికులకు పిలుపునిచ్చినా, కార్మికులు తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విధుల్లో చేరేది లేదని రెండుసార్లు ప్రభుత్వ ప్రకటనలను తిరస్కరించారు.

ఇంకొకవైపు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దేశంలో ఎక్కడాలేని విధంగా స్పందిస్తూ, సంస్థలోని కార్మికులు సమ్మె చేస్తున్నారు, వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఏ ఒక్కటి కూడ పరిష్కరించడం లేదు. పైగా సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బంది పెడుతున్న విషయాలను చాలా లోతుగా పరిశీలించి జేఏసీల 26 డిమాండ్లలో 21 డిమాండ్లు పరిష్కరించ తగ్గవిగా నిర్ధారించి, మిగతా వాటిని పరిష్కరించేందుకు ఒక కమిటీ వేయాలని, తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సెప్టెంబర్ 18న ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబరు 28కి వాయిదా వేయగా, ప్రభుత్వం తన మొండి వైఖరిని సమర్ధించుకుంటూ కోర్టు తీర్పును ప్రభుత్వం తమకు అనుకూలంగా అన్వయించుకుని కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ, తూతూమంత్రంగా ఒక కమిటీ వేసి సెప్టెంబర్ 26న రెండు గంటలకు చర్చలకు పిలిచింది. చర్చలకు వచ్చిన కార్మిక సంఘాల నాయకులను భయభ్రాంతులకు గురిచేసింది. పోలీస్ అధికారుల సమక్షంలో చర్చలు జరిపేందుకు ప్రయత్నం చేసింది. ఈ అన్యాయాన్ని తీవ్రంగా నిరసిస్తూ కార్మిక సంఘాలు కోర్టు ఉత్తర్వుల ప్రకారం సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే విషయంతో పాటు మిగతా 25 సమస్యలను చర్చించాలని కోరగా, అందుకు నిరాకరించిన యాజమాన్య ప్రతినిధుల తీరును ఎండగడుతూ బయటకు వచ్చి సమ్మెను మరింత ఉధృతం చేయాల్సిందిగా పిలుపునిస్తూ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ప్రజలకు వివరించారు. ఇంకొకవైపు సమ్మె కొనసాగుతూ ధర్నా, రాస్తారోకో, ర్యాలీ, బంద్లతో తెలంగాణ అట్టుడుకుతుండగా, హుజూర్నగర్ గెలుపును బలుపుగా మలచుకున్న ప్రభుత్వం అధికార, అర్థ, అంగబలంతో దాదాపు వందకోట్ల పంపకంతో ఎన్నికల్లో నెగ్గినా, సమ్మె ద్వారా జరుగుతున్న ప్రజాపోరాటాన్ని కించపర్చుతూ, ప్రభుత్వ రంగంలో ఇక ఆర్టీసీ ఉండదని, ఆర్టీసీ సమ్మెకు ముగింపు బదులుగా, ఆర్టీసీకి ముగింపు వచ్చిందని, ప్రపంచంలో ఎవరూ దీనిని కాపాడలేరని, "ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన సమస్యను జెఎసి న్యాయవాది న్యాయస్థానంలో వదులుకున్నారని, సంస్థకు కేవలం ఇరవై నాలుగు వందల కోట్ల అప్పులు ఉండగా, 5 వేల కోట్ల అప్పు ఉన్నదని, అది ప్రభుత్వం తీర్చదని, ఇవ్వాల్సిన దానికంటే ఎంతో ఎక్కువగా ఇచ్చిందని, ఈ ఒక్క సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తే మరో 57 సంస్థలు కూడా విలీనం చేయమని అడుగుతాయని తప్పుడు మాటలు మాట్లాడిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంకొకవైపు కార్మికులు ఆర్టీసీ నష్టాలకు కారణమని తన విష ప్రచారాన్ని కొనసాగించారు.

మొదటి నుండి కార్మికులు చెబుతున్నట్లుగా, ఆర్టీసీని దోచుకునేందుకు ప్రభుత్వం కార్మికుల మీద నష్టాలను వేస్తున్నట్లుగా భావించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సంస్థలోని ఖర్చులను కార్మికుల పనివిధానాన్ని సమీక్షించడానికి పూనుకున్నది. గతంలో ఆర్టీసీకి 3444 రూట్లు ఉండగా నేడు అవి 3726 చేరుకున్నాయి. గతంలో ఆక్యుపెన్సీ రేటు 69 శాతం ఉండగా, నేడు అది 74.5 శాతంకు చేరుకుంది. గతంలో ప్రతి కిలోమీటరుకు ఆర్టీసీకి 19.1 పైసలు లాభం ఉండగా నేడు అది 37.4 పైసలకు పెరిగింది. గతంలో ప్రమాదాలు ఒక లక్ష కిలోమీటరుకు 0.12 శాతం ఉండగా నేడు అది 0.07 శాతానికి చేరుకున్నది. గతంలో రోజుకు 73 లక్షల

ప్రయాణీకులను గమ్యానికి చేర్చగా, నేడు రోజుకు 97.66 లక్షల ప్రయాణికులను గమ్యానికి చేర్చుచున్నది. గతంలో 10,000కి 0.01 శాతం బ్రేక్డౌన్ ఉండగా, నేడు 0.02 శాతానికి తగ్గింది. గతంలో కార్మికుని ఉత్పత్తి శక్తి 50 ఉండగా నేడు 63 శాతంకు చేరుకుని కార్మికులు తమ నైపుణ్యాన్ని పెంచుకుని సంస్థ మనుగడకు తమ రక్తమాంసాలను ధారపోస్తుండగా, ప్రభుత్వం కార్మికుల మీద దుష్ప్రచారం చేస్తూ, సంస్థ ఆస్తులను అధికారపార్టీ నాయకులకు, ఆ పార్టీ అధినేత బినామీలుగా ఉన్న బడా పెట్టుబడిదారులకు అప్పనంగా అందిస్తుంది. ఇందులో భాగంగా సంస్థకు చెందిన 49 పెట్రోల్ బంకులను కేసీఆర్ వియ్యంకుని బావమర్ది గారైన విఠల్‌రావుకు అప్పచెప్పింది. ఆర్మూర్లో బస్టాండ్ స్థలాన్ని ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డికి, కరీంనగర్‌లో మాజీ ఎం.పి. వినోద్ కుమార్‌కు, వరంగల్‌లో ఎంపీ దయాకర్‌కు అప్ప చెప్పింది. మెగా కృష్ణారెడ్డికి 40 ఎలక్ట్రిక్ బస్సులు కాంట్రాక్టు అప్పగించింది. ఇంకా సంస్థకు చెందిన మొత్తం ఆస్తులను అప్పచెప్పేందుకు ప్రైవేట్ బస్సులు పెంచి ప్రజా రవాణా సంస్థను ప్రభుత్వం నుండి తప్పించి, ప్రజల సహజ వనరులను తన బినామీదారులకు, తాబే దారులకు అప్పచెప్పేందుకు ఈ దుర్మార్గ కుట్రకు తెరతీసింది. కార్మికుల సమ్మె మీద ఉక్కు పాదం మోపుతూ నిజాం నవాబును తలదన్నే విధంగా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది.

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి 'సకల జనుల సమ్మె' ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకపాత్ర వహించిన ఆర్టీసి కార్మికవర్గం నేడు మరో చారిత్రాత్మక పోరాటానికి నాంది పలికింది. దీనిని తెలంగాణ ప్రజలందరు ప్రజాస్వామిక తెలంగాణ పోరాటాంలో అగ్రభాగాంగా భావించాల్సిన అవసరమున్నది. పనిచేసిన సెప్టెంబరు నెలకు 49,190 కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు నికారించిన ప్రభుత్వ దుర్మార్గ నిర్ణయాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో జెఎసి-1 చాలెంజ్ చేసివెంటనే జీతాలు చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశించాలని కోరింది. ఒకవైపు కార్మికుల బలిదానాలు కొనసాగుతుండగా, ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు సమ్మెపట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. రెక్కాడితే డొక్కాడని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చాలా మూర్ఖంగా ఉన్నది. సమ సమాజ స్థాపన కొరకు, ప్రజల కొరకు తమ అమూల్యమైన ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడిన, పోరాడుతున్న ప్రజా ఉద్యమ నాయకత్వం చెప్పినట్లుగా "ఇది ప్రజాస్వామ్య ముసుగులో దోపిడీ శక్తుల నియంతృత్వమనే విషయం" నేడు మరింతగా తెలంగాణ ప్రజలకు అర్థం అవుతున్నది. రాష్ట్ర రోడ్డు రవాణా వ్యవస్థ తెలంగాణ ప్రభుత్వం తెచ్చింది కాదు. ప్యూడల్ రాజుల నుండి ప్రభుత్వ ఆధీనంలోనే నడుస్తున్నది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలోనే అంచలంచలుగా ప్రైవేటీకరణకు, దోపిడీదారులకు ఈ వ్యవస్థను అప్పచెప్పేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించాయి. కొంత సఫలమయ్యాయి.

రాజ్యాంగంలోని అధికరణ 12 ప్రకారం ఆర్టీసీ ప్రభుత్వ విధుల్లోకి వస్తుందనే విషయాన్ని కూడా ప్రభుత్వం మర్చింది. ప్రభుత్వం చేసే అసందర్భ, అన్యాయమైన, తప్పుడు విధానాలు, కార్మికుల, ప్రజల జీవితాలను ప్రతికూల ప్రభావితం చేసే ఎటువంటి నిరంకుశ విధానాలయినా రాజ్యాంగం అనుమతించదు. ఈ విషయాన్ని 1950 నుండి నిన్నటి వరకు దేశ అత్యున్నత న్యాయస్థానం తమ రాజ్యాంగ ధర్మాసనాల నుంచి వివిధ తీర్పులలో చెప్పింది. ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నికగాబడ్డ ప్రభుత్వం అనే ప్రజాస్వామిక స్ఫూర్తిని పూర్తిగా తలకిందులు చేస్తూ ప్రజలకు డబ్బులు, మద్యం పంచి, అంగ, అర్థబలంతో, మిషన్‌లను ట్యాంపరింగ్ చేసి గెలిచి, దోపిడిదారుల కొరకు అందులో తమ వాటాను పదిలించేసుకునే ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులను, కార్మికులు తమ రక్తమాంసాలను వెచ్చించి సంపాదించిన ఆస్తులను, దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు అప్పనంగా ఇచ్చేస్తూ, తమ స్వంత ప్రయోజనాన్ని కాపాడుకుంటున్నాయి. అందులో భాగంగానే దేశాన్ని సర్వం దోచుకునేందుకు బార్లాతెరిచిన మోడి, కేసీఆర్ అటు కేంద్రంలో ఇన్సూరెన్స్, రైల్వేలు, బ్యాంకింగ్, ఇతర కీలక రంగాలను, రాష్ట్రంలో ఆర్టీసి, నిజాం షుగర్స్, ఇంకా ఇతర కీలక రంగాలను బడా పెట్టుబడి దారులకు అప్పచెబుతున్నాయి.

ఆర్టీసి కార్మికుల సమ్మె కీలకమయిన డిమాండ్ అయినా సమ్మెకు జీవనాడయిన "ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం" అనే అంశంను వదిలిపెడితే సమ్మె సారాంశంలో ఏమి మిగలదని గ్రహించిన సంస్థ కార్మికులు ఈ డిమాండ్ సఫలమయ్యే వరకు బహుముఖ పోరాటాన్ని విడిచేది లేదని పోరాటాన్ని ఉధృతం చేసారు. ప్రభుత్వ నిర్బంధాన్ని గెలిచేస్తూ ప్రధాన డిమాండ్‌ను సాధించే వరకు విశ్రమించేంది లేదని ప్రతినపూనారు. దేశ కార్మిక ఉద్యమానికి ఈ ఉద్యమం "వేగుచుక్క" లాగా అగుపడుతున్నది. ఎందుకంటే ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ, నూతన ఆర్థిక విధానాలు అమలు

జరుగుతున్న గత 25 సంవత్సరాల నుండి లక్షలాది కోట్ల రూపాయల ప్రజల ఆస్తులయిన ప్రభుత్వరంగ సంస్థలు దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు కారుచౌకగా అమ్మివేశాయి. నవరత్నాలని చెప్పబడుతున్న 1.ONGC, 2.BHEL, 3.NMDC, 4.SAIL, 5.NTPC, 6.BHARATH PETROLIUM, 7.COAL INDIA, 8.GAS AUTHORITY INDIA, 9. INDIAN OIL CARPORATIONలను కూడా ప్రైవేటీకరణ వైపు పరుగెత్తించేందుకు మోడీ ప్రభుత్వం వివిధ దుర్మార్గ చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగా ప్రపంచ దేశాలకు తిరుగుతున్న మోడీ, భారతదేశాన్ని దోచుకోండి, మేము మీకు అండగా వున్నామంటూ, భారతదేశం పెట్టుబడులకు అనువైన దేశమని ఆహ్వానిస్తున్నాడు. ఇంకకొవైపు మోటార్ వెహికల్ చట్టం, 2019 సవరణ పేరు మీద రహదారుల పర్మిట్లను ప్రైవేటీకరణ చేస్తూ బడా పెట్టుబడిదారులకు ప్రజా రవాణా వ్యవస్థను అప్పచెపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల, కార్మికుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామీ ఇచ్చి నేడు అసలు ప్రభుత్వరంగ సంస్థను లేకుండా చేయాలనే ప్రభుత్వ దుర్మార్గ చర్యలను ప్రజలందరూ అసహ్యించుకుంటున్నారు. ప్రజల ఆస్తులు దోచుకుని తమ పబ్బం గడుపుకుంటున్న బడా పెట్టుబడిదారులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు మాత్రమే ప్రభుత్వ దుర్మార్గాన్ని సమర్థిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 సెక్షన్ 53 ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ చట్టంలోని సెక్షన్ 112(30) ప్రకారం ఆర్టీసీకి సంస్థకు గత ఐదు సంవత్సరాలుగా రావలసిన బకాయిలు రూ. 1494 కోట్లు, ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు రూ. 784 కోట్లు మొత్తం రూ2278 కోట్లు, ప్రభుత్వం ఆర్టీసి నుంచి వాహన టాక్స్, డిజిల్ ట్యాక్స్, టోల్ ట్యాక్స్ లాంటివి వసూలు చేయకుంటే 3,000 కోట్లు సంస్థ అప్పులు తీరుతాయి. రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసి ద్వారా చెల్లించాల్సిన డబ్బులు సాలీన చెల్లిస్తే రాబోయే రెండు సంవత్సరాలలో సంస్థకు అప్పులే వుండవు. కాని ప్రభుత్వం సంస్థ ఆస్తులు దోచుకునేందుకు “నూతన ఆర్టీసి పాలసీ” పేరుతో కార్మికుల మీద, కార్మిక సంఘాల మీద ప్రజలలో తమ ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తూ, సమ్మెపై ఏకపక్ష దాడిని కొనసాగిస్తున్నది. రాజ్యాంగాన్ని, వివిధ కార్మిక చట్టాలను, భారత అత్యున్నత న్యాయస్థాన తీర్పులను ఉల్లంఘించి, నోటికి ఏది వస్తే అది మాట్లాడుతూ కార్మికుల మరణానికి కారణ మవుతున్నది. ఫలితంగా కార్మికుల కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఈ వ్యాసం ముగించే సమయానికి రాష్ట్ర మంత్రివర్గం ఆర్టీసిలోని 5100 పర్మిట్లను ప్రైవేటు ఆపరేట్లకు ఇచ్చే నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం చాలా దుర్మార్గమైనది. ఈ నిర్ణయంతో లక్షలాది పేద ప్రజలకు ఇబ్బందులతో పాటు 25 వేల కార్మికులకు హృదయాల్లో విషాదం నింపింది. ఇంకొకవైపు 3 రోజులలో కార్మికులు ఉద్యోగాల్లో చేరకుంటే మిగతా 5100 పర్మిట్లను కూడా ప్రైవేటుకిచ్చి సంస్థ నడిపే 10,400 బస్సులను ప్రైవేటుపరం చేస్తామని అహంకారంతో మాట్లాడారు. మాటల్లో సంక్షేమం, చేతల్లో బడా పెట్టుబడి దారులకు ప్రజాధనం దోపిడీ చేయడం, ఇదే బంగారు తెలంగాణ అని చెప్పకనే చేసి చూపెడుతున్నారు. ఒక అబద్దాన్ని పదే పదే ప్రచారం చేయడం ద్వారా, దాన్ని నిజమని ప్రజలను నమ్మించాలని చూసే గ్లోబెల్ సూత్రాన్ని తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే ఒక పథకం ప్రకారం అధికారం చేతిలో ఉంచుకొని లక్షలాది కోట్ల రూపాయల తెలంగాణ ప్రజల ధనాన్ని, సహజ వనరులను, బడా పెట్టుబడిదారులకు అప్పచెపుతూ తమ వాటాలను పొందుతున్నారు. ఇందులో భాగంగా దోచుకున్న సొమ్ము బయటికి వస్తే గత అవినీతి రాజకీయ నాయకులకు పట్టిన గతే తమకు పడుతుందని భావించి, గత ఐదున్నర సంవత్సరాలుగా దాదాపు 45 వేల జీవోలను ప్రజలకు అందుబాటులో ఉండకుండా దాచిపెట్టింది. నీళ్ళు, నియమకాలు, నిధులను సమపాళ్లలో ప్రజలకు పంచాలనే నదుద్దేశంతోనే ప్రజాస్వామిక తెలంగాణ పోరాటం మొదలయినది. సాధించిన భౌగోళిక తెలంగాణలో అధికారం చేపట్టినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం అందిన కాడికి దోచుకుంటూ, మళ్లీ ఫ్యూడల్ రాజుల పాలనకు తెరతీస్తున్నది. అందులో భాగంగానే సింగరేణిని, ఆర్టీసిని, ప్రభుత్వ ఖజానాను, దివాళా తీయించి, రాష్ట్రంలోని భూములన్ని బడా పెట్టుబడి దారులకు అమ్ముకుంటూ ప్రజల జీవన ప్రమాణాలను పూర్తిగా దెబ్బతీసింది.

లక్ష కొత్త ఉద్యోగాలు రాలేదు. పది లక్షల ఎకరాలకు నీరు రాలేదు. కొత్త పరిశ్రమలు రాలేదు. ఉన్న ఒక్క నిజాం షుగర్స్ గతంలో ఎన్నడూ లేనివిధంగా మూతపడింది. కాని రాష్ట్ర ప్రభుత్వ అధినేతలు ప్రజల ధనం దోచుకుని అపర కుబేరులయ్యారు. ధనిక రాష్ట్రాన్ని దివాళా తీయించారు. సకల

వనరులు ప్రజలకు ప్రజాస్వామిక పద్ధతిలో దక్కాలనే ప్రజాస్వామిక తెలంగాణ పోరాటాన్ని తీవ్ర నిర్బంధానికి గురిచేస్తూ, ప్రజాస్వామిక తెలంగాణ పోరాట, ఉద్యమ సంస్థల నాయకుల మీద దుష్ప్రచారం చేస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించాలని, ప్రజాస్వామిక తెలంగాణ ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న వివిధ ప్రజా సంఘాలను ప్రజల నుండి దూరం చేయాలని కుట్ర పన్ని తెలంగాణ ప్రజాస్వామికవేదిక, తెలంగాణ ప్రజాఫ్రంట్ భాగస్వామ్య పక్షాల సంఘాల నాయకులను తప్పుడు కేసులలో ఇరికిస్తున్నారు. ఇందులో భాగంగా సమ్మె మొదలవగానే గద్వాలలో కుట్ర కేసు నమోదు చేసి తెలంగాణ విద్యార్థి వేదిక నాయకులు మద్దిలేటి, నాగన్న, బలరామ్, విరసం నాయకులు, స్టూడెంట్ మార్చ్ సంపాదకులు జగన్, తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణలను అరెస్టు చేసి జైల్లో నిర్బంధించి తప్పుడు కేసులను బనాయించారు.

ఇంకొకవైపు రాజకీయ ఖైదీల విడుదల కమిటి నాయకుడు అనిల్, విద్యార్థి సురేశ్‌ను అక్రమంగా బంధించి తప్పుడు కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానానికి సమర్పించి ప్రజా జీవితంలో కొనసాగుతూ, రాజ్యాంగబద్ధ చట్టబద్ధ పోరాటాలను ముందుకు తీసుకుపోతున్న ప్రజాసంఘాల, హక్కుల సంఘాల నాయకులను, న్యాయవాదులను అక్రమ కేసుల్లో ఇరికిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రభుత్వ వైఖరిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, రాజకీయ పార్టీలు, తెలంగాణ సమస్త సమాజం ముక్త కంఠంతో ఖండించి ప్రజాసంఘాలను హృదయానికి హత్తుకోవాల్సిన అవసరమున్నది. వీరిని రక్షించుకోవలసిన బాధ్యత తెలంగాణ సమాజంపై వున్నది. నేడు ఆర్టీసి సమ్మెలో కార్మికులకు అండగా తెలంగాణ మొత్తం సమాజం పోరాడడం ద్వారా ఆర్టీసి పరిరక్షణ పోరాటాన్ని ప్రజాస్వామిక తెలంగాణ పోరాటానికి వేగుచుక్కగా భావించి ప్రత్యామ్నాయ బస్సులు నడుపకుండా వీరోచితంగా పోరాడాలి. అపుడే ప్రభుత్వం దిగివచ్చి ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారానే, కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రజా రవాణా వ్యవస్థకు గుండెకాయ లాంటి ఆర్టీసీని, దానికున్న ఆస్తులైన దాదాపు 75,000 కోట్ల రూపాయలను కాపాడుకోగలం. ప్రజల ఆస్తులను బడా పెట్టుబడిదారుల, అధికార పార్టీల నాయకుల చేతుల్లోకి పోకుండా అడ్డుకోగలుగుతాం. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎంతటి దమనకాండకు ప్రభుత్వం పాల్పడినా, మొక్కవోని ధైర్యంతో ప్రభుత్వ కుట్రలను ఎదిరిస్తూ తెలంగాణ సమాజం బహుముఖ పోరాటం చేయడం ద్వారా "ప్రజాస్వామిక తెలంగాణ పోరాటానికి వేగుచుక్కయిన'' ఆర్టీసీని రక్షించుకుంటాం.

★ రచయిత: కన్వీనర్, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక T

<u>**రచయితలకు సూచనలు:**</u>

**1. రచనలను పేజీకి ఒకవైపు మాత్రమే అర్థమయ్యేలా రాసి పత్రిక అడ్రస్‌కు ప్రతినెల 15వ తేదీలోగా పంపగలరు.**

**2. డీటీపీ చేయించి పంపేవారు ప్రతినెల 18వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో పంపించగలరు.**

**3. చేతి రాతలో పంపే రచనలను స్కాన్ చేసి మెయిల్ ద్వారా కాకుండా పోస్ట్ ద్వారా పంపించగలరు.**

**4. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**5. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**6. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**7. పరిశోధకులు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

**-సం.**

# లేత మెదళ్లలో మత బీజాలు!?

ఎనిశెట్టి శంకర్

**భా**రతదేశం భిన్న జాతుల, భిన్న మతాల, భిన్న కులాల ప్రజలతో భిన్నత్వంలో ఏకత్వం అంటూ లౌకిక రాజ్యం అని చెప్పుకుంటూ సాగిపోతున్న దేశం. ఇన్ని రకాల వాళ్లు ఒకే ప్రదేశంలో కలిసి జీవించడమనేది ఒక గొప్ప విషయమే. అయితే సామెతలు చెప్పుకున్నంత తేలికగా, కాగితాల మీద రాసు కున్నంత సులభంగా ఇక్కడ ప్రజల జీవనం సాగిపోతలేదనేది అక్షర సత్యం.

మనది సర్వసత్తాక ప్రజాస్వామిక, సామ్యవాద, లౌకిక రాజ్యం అంటూ మన రాజ్యాంగాన్ని అపూర్వంగా భావిస్తాం. ప్రపంచంలో మరెక్కడా లేని అతి పెద్ద లిఖిత రాజ్యాంగమని ఛాతీ కొట్టుకుంటూ మరీ చెప్పుకుంటాం. మంచిదే. కాని మనం అనుకున్నట్లే రాజ్యాంగం అమలవుతుందా? అని ప్రశ్నించుకుంటే 'లేదు' అని నిర్మొహమాటంగా చెప్పగలం. ఇందులోని ఒక్క 'లౌకిక' అనే దాన్నే కాస్త విశ్లేషించి చూద్దాం.

లౌకికవాదమంటే ఆంగ్లంలో 'Secularism' అని అర్థం. 'మతాతీత' అని వాడుకలో చెప్తుంటాం. అంటే మతాలకతీతంగా అని అర్థం. ముందే చెప్పుకున్నట్లు ఈ గడ్డ మీద ఎన్నో మతాలున్నప్పటికీ 'రాజ్యం' మతాల కతీతంగా వుండాలని చెప్పడం వ్యక్తులుగా ఎవరే మతం అవలంభించినా మరొకరు దాన్ని ఆక్షేపించరాదు. అలాగే ఏ మతాన్నీ ఆచరించకున్నా ఆక్షేపించరాదు. ప్రభుత్వ పరంగా అధినేతలు ఏ ఒక్క మతాన్ని తలపైకెత్తుకోవడం అనుచితం. కాని అడుగడుగునా మన పాలకులు, ప్రతి పనిలోనూ 'హిందూ మత' విధానాలనే ఆచరిస్తారు.

ప్రభుత్వ ప్రాజెక్టుగానీ, ప్రభుత్వం నిర్వహించే ఏ పథకంగానీ, కొబ్బరికాయ కొట్టడం, పసుపు కుంకాలు చల్లడం, అందరికీ బొట్టు పెట్టడం, ఈ తంతునంతా జరుపడానికి ఓ బ్రాహ్మణుడు వుండడం, ఇక్కడ భిన్న మతాల, కులాల వారుంటారన్నప్పుడు ఒక మతానికి సంబంధించిన 'తంతు'ను ప్రభుత్వ కార్యక్రమంలో చొప్పించడం ఏ రకంగా రాజ్యాంగ బద్ధం అవుతుంది?

ప్రతి జాతీయ పండుగలకు 'జెండా' నెగుర వేసేముందు గద్దెకు కుంకుమ బొట్టు పెట్టడం, కొబ్బరికాయ కొట్టడం గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి కార్యాలయాలు, విద్యాలయాల్లో తరచుగా చూసే 'జెండా'ను గౌరవించాలి. కాని పూజించ కూడదు. గౌరవస్థానం నుంచి పూజించే స్థాయికి తీసుక పోవడమంటే వ్యక్తుల చైతన్యాన్ని, ఆలోచనల్ని నిర్వీర్యం చేసి మనుషుల్ని యాంత్రికం చేయడమన్నమాట. పైగా 'జెండా'ను పూజించలేదని, కొబ్బరికాయ కొట్టలేదని ఎందరో ప్రధానోపాధ్యాయులపై ప్రతి సంవత్సరం ఫిర్యాదులు చూస్తుంటాం. విచిత్రమేమంటే హిందూ మతంలోని సవాలక్ష అసంబద్ధతలను వ్యతిరేకించే విగ్రహారాధనను వ్యతిరేకించే బౌద్ధం స్వీకరించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహాత్మున్ని పూజించి ఆ మహానుభావుని చైతన్య పూరిత ఆశయాలను ఆచరించకుండా చేస్తాం.



ఇక గ్రామీణ-పట్టణ స్థాయిల్లో వుండే విద్యాలయాల్లో ఎదిగి చైతన్య మూర్తులు కావల్సిన భిన్న విద్యార్థుల మెదళ్లలో అడుగడుగునా మత చాందసాన్ని నింపి హేతుబద్ధత లేకుండా చేస్తున్నాం.

ప్రతిరోజు ఉదయం జరిగే అసెంబ్లీలో ముఖ్య సమాచారం, ఏదేని సూక్తిని చెప్పడం, పిల్లల్లో స్ఫూర్తినింపే మాటో, పాటో వుండాలి. కాని ఇవన్నీంటినీ తలదన్నే విధంగా 'ప్రార్థనలు' చేయించడం ఆనవాయితీగా మారింది. పైగా ప్రతి శుక్రవారం రోజు సరస్వతీ పటానికి మొక్కి కొబ్బరికాయ కొట్టి ప్రసాదాన్ని అందిరికీ ఎంతో 'భక్తి'గా పంచడం ప్రతి పాఠశాలలో గదులున్నా లేకున్నా, విద్యుత్ సరఫరా వున్నా లేకున్నా, సిబ్బంది, ఉపాధ్యాయులు వున్నా లేకున్నా ఆ ప్రాంగణంలో 'సరస్వతీ దేవి' విగ్రహాన్ని ప్రతిష్టించడం ఈ మధ్య 'వైరస్'లా మారింది. కొబ్బరికాయ కొట్టడం, బొట్లు పెట్టడం, ప్రసాదం పంచడం ద్వారా మనం వాళ్లకు ఏం చెప్తున్నట్లు? పసిపిల్లలు చైతన్యవంతులు కాకుండా, నిటారుగా ఎదగకుండా, బ్రాహ్మణీయ భావజాలాన్ని చొప్పించి పరోక్షంగా 'కర్మసిద్ధాంతాన్ని' నమ్మేట్లు చేయడం.

ఈ మధ్య మరో కొత్త సంప్రదాయం మొలకెత్తింది. నారాయణ, చైతన్య, భాష్యం లాంటి కార్పోరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు వారి వారి సంస్థలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను 'బాసర' లాంటి ప్రదేశాల్లోకి పోయి సరస్వతీ అమ్మవారి పాదాల చెంత పెట్టి పూజించి వాటిని విద్యార్థులకు ఇవ్వడం. అలా చేస్తేనే 'బాగా' మార్కులు వస్తాయని యాజమాన్యం నమ్ముతూ పిల్లల్ని భక్తి మార్గాన నడిపించి నీ మార్కులకు సంబంధం నీ కృషి, పట్టుదల కాదు. అమ్మవారి ఆశీస్సులే అని చెప్తూ పిల్లల్ని తిరోగమన దారిలో నడిపిస్తున్నారు. ఇవన్నీ పైకి ఎవరో వ్యక్తులు నడిపిస్తున్నట్లు కనబడినా 'రాజ్యం' పకడ్బందీగా వ్యక్తుల చైతన్యం బలపడకుండా వారిని అణచిపెట్టే ఒక కుట్ర మాత్రమే అని మనం తెల్సుకోవాలి.

శాస్త్రజ్ఞానం ఒకవైపు పెరుగుతున్నా మన వ్యవస్థలో అశాస్త్రీయ భావజాలాన్నే పసిమెదళ్లలో ఒక ప్రణాళికా బద్ధంగా నింపుతున్నారు. చిన్నప్పటి నుంచే పిల్లల్ని హేతుబద్ధంగా ఆలోచింపచేసే బదులు 'కర్మ' సిద్ధాంతాన్ని, పూర్వ జన్మ సుకృతమనే భావనల్ని వాళ్ళ మెదళ్లలో బలంగా చొప్పించి చైతన్య పూరితంగా ఆలోచించని వారిగా తయారు చేస్తున్నాం. ఎక్కడ ఈ తరం తల ఎత్తి వ్యవస్థ లోపాలు ఎత్తి చూపుతుందోననే భయంతో వాళ్లను నిర్వీర్యపరిచే విధానాలే మనం చూస్తాం. ప్రశ్నించే మెదళ్లను నిద్రపుచ్చడమే దీని లక్ష్యం.

చిన్నప్పటి నుంచే పిల్లలకు దైవభక్తి నేర్పితే తప్పేమిటి? పైగా వాళ్లు చెడుమార్గం పట్టకుండా దోహదపడిన వాళ్లమవుతాం అంటూ కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతుంటారు. పిల్లలకు 'భక్తి' నేర్పితే అదెలా క్రమశిక్షణో ఎవరికీ అర్థం కాదు. 'నీతిబోధ' పేర చాలామంది ఉపాధ్యాయులు బాబాల గూర్చి, సన్యాసుల గూర్చిన జీవితాంశాలను చెప్తుంటారు. సామాన్య జీవితాన్ని వదిలి కాషాయ వస్త్రాలు ధరించి 'పలాయనవాదా'న్ని ప్రవచించే స్వాములు, సాముల గూర్చి చెప్పడం ఏ రకమైన నీతి బోధో ఎవరూ ఆలోచించరు(బాబాలు వారి ఆశ్రమాలు ఎవరికి ఉపయోగపడ్తాయి? అక్కడ ఏ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతాయో ఏ మాత్రం ఆలోచించని ఒక దుష్ట సంప్రదాయాన్ని పాటింప చేస్తూండడం ఇక్కడ చర్చించడం లేదు.)

ఈ తంతులన్నీ వ్యక్తులు జరుపుతారని భావిస్తే మనం పప్పులో కాలేసినట్లే.

పాలకులు ఏ పార్టీవాళ్లయినా వాళ్ల పాలన సజావుగా సాగడానికి తమ ప్రజల్ని(వాళ్ల దృష్టిలో ఓటర్లే) భక్తి పేర, క్రమశిక్షణ పేర ఇలాంటి బోధనలు జరిపిస్తారని మనం మరువద్దు. కాకుంటే ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క విధానాన్ని అవలంభిస్తూ ఎంతో అభ్యుదయ వాదుల్లాగా కొన్ని కొన్ని నినాదాలు ఇవ్వడం కూడా వాళ్ల పాలనను భద్రపరుచు కోవడానికే!

మరీ ముఖ్యంగా మనది విచిత్రమైన పరిస్థితి. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞాన ఫలితాలు అనుభవిస్తూ అత్యంత తిరోగమన విధానాల్ని నేర్పుతుంటాం. కాకుంటే ఇప్పటికీ ఏ ఛానల్ చూసినా జ్యోతిష్యం, వాస్తు, తాయెత్తుల మహిమలు, ఉంగరాల మహిమలు వగైరా ఈనాటికీ ఎలా చూడగల్గుతున్నాం?

ప్రభుత్వాలే వివిధ విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్యం, వాస్తు మొదలైన పురాతన అంశాల మీద పీజీ కోర్సులు పెడ్తుంటే ఓ నాలుగురాళ్లు సంపాదించుకుందామని అన్ని విలువలకు తిలోదకాలిచ్చిన ఫక్తు వ్యాపార ఛానళ్లను ఇంక ఏమని ప్రశ్నించగల్గుతాం?

ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే విద్యాలయాల్లో, ప్రభుత్వ విద్యాలయాల్లో 'మత' ప్రచారం జరుపరాదని రాజ్యాంగం చెప్పినా 'మెజారిటి' భావనే ఈ అపసవ్య ఆలోచనలకు, భావాలకు ఆలంభనం.

ఏది ఏమైనా ఈ దేశ భవితవ్యాన్ని కాపాడవలసిన నేటి బాలల్ని వాళ్లకి క్రూరంగా తెలియకుండానే మత రొంపిలోకి దింపి వాళ్ల మెదళ్ళు ఎదగకుండానైతే ఓ ప్రణాళికాబద్ధమైన కుట్ర సాగుతోంది. ప్రగతి శీలురైన విద్యార్థి సంఘాలు, అభ్యుదయ కాముకులు ఈ విషయంలో ఓ బృహత్ కార్యక్రమంలో ప్రణాళిక వేసుకొని తుదకంటా పోరాడితేనే ఈ లేత మెదళ్లను మనం రక్షించుకోగల్గుతాం.

★ రచయిత: ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ T

# ఎమ్మార్వో సజీవ దహనానికి బాధ్యులెవరు?

అరవింద్

బ్రేకింగ్ న్యూస్గా.. హైదరాబాద్‌లోని అబ్దుల్లా పూర్ మెట్ ఎమ్మార్వో లంచం అడిగినందుకు ఒక రైతు సజీవదహనం చేశాడనే వార్త గుప్పుమన్నది. ఇప్పుడు వైరల్ అవ్వగా.. సామాజిక మాధ్యమంలో ట్రెండింగ్ అయినది. ఆ ఎమ్మార్వో పక్షం మీడియా తలెత్తుకుంది. ముఖ్యంగా మిడిల్ క్లాస్ మానవత్వం పేర అధికారినిని చంపేస్తారా? అంటూ స్పందిస్తున్నారు. ఇలా స్పందిస్తున్నవాళ్ళల్లో ఒక్కశాతమైనా లంచం వేధింపులు తాళలేక సామాన్యులు, రైతులు చచ్చిపోతుంటే, పిల్లలతో సహ కుటుంబాలు భగభగ మండిపోతుంటే మీ మానవత్వం ఎక్కడ పోయిందంటూ మరికొందరు ప్రశ్నిస్తున్నారు. మన మనిషితనం మృగాలుగా మారి లంచాల పేర వేటాడే వారి వైపా.! లేకపోతే అన్యాయంగా బలవుతున్న సామాన్యుల వైపా.? అంటూ మరో పక్షం వాదిస్తున్నది. ఇలా వాదిస్తున్న సమూహంలో అనేకమంది లంచాలతో, అవినీతితో ఇబ్బందులకు గురయినవారే అధికం.

మరో వర్గం అధికారిణి పక్షం వుంటూ ఒక అధికారిని పట్టపగలు ఆఫీసులోనే సజీవ దహనం చేస్తుంటే ఎలా సమర్థిస్తారు.? అసలు మనుషులేనా.? అంటు ఆక్రోశంగా పోస్టులతో విరుచుకుపడుతున్నారు.

ఒక మనిషిని దారుణంగా సజీవదహనం చేయడాన్ని ఎవరూ సమర్థించలేం. ఎలాంటి పరిస్థితితులలోనైనా. అలా నెరాల్ని సమర్థిస్తే తప్పుపట్టవలసిందే. మరోవైపున అంతే స్థాయిలో ఎందుకు హింస ఆ స్థాయికి ఎగబాకింది అనే విషయాన్ని ఆలోచించగల మెచ్యూరిటీ ఎవరికైనా ఉన్నదా.? మనిషిని చంపే హక్కు ఎవరికీ లేదని వాదిస్తుండడం మానవీయమైన కోణం. అదే మానవీయతను.. కంటికి కన్ను, పంటికి పన్ను అని సురేష్‌కి ఉరిశిక్ష అంటూ వస్తున్న కథనాలను కొట్టిపారేసే మానవీయతను ప్రదర్శించగలమా.! మన మానవత్వాన్ని అధికారి, సామన్యుడి ఇద్దరి విషయాలలోనూ సమంగా ప్రదర్శించగలమా.!?

మరోమాట.. ఎమ్మార్వోకు మద్దతుగా ఉండడమంటే అవినీతికి మద్దతుగా ఉన్నట్లు కాదు. సురేష్‌కి మద్దతంటే హత్యకు మద్దతుగా ఉండడం కాదు. ఇలాంటి విషాదమైన ఘటనలలో ఆవేశాలు, భావోద్వేగాలు అదుపులో ఉంచుకోగలిగితే సత్యం వైపు వెళ్ళగలం. లేకపోతే ఏ ప్రభుత్వ నిర్లక్ష్యం వలననైతే ఇంత దారుణం చోటు చేసుకుందో.. ఆ ప్రభుత్వం హాయిగా తప్పించుకుంటుంది. యధేచ్ఛగా, నిర్భయంగా మరో చోట ఇలాంటి ఘాతుకానికి స్థానం కల్పిస్తుంది. ఈ ఘటనలో ప్రభుత్వ పాత్రపై ఫోకస్ చేయకుండా ఉంటే.. కేవలం నేరస్తుడిగా సురేష్ మాత్రమే భాధ్యుడుగా మిగులుతాడు. నిజానికి అతడు మాత్రమేనా దోషి..?

కాయకష్టం చేసి బతుకీడ్చే సురేష్ ఈరోజు ఒక ఎమ్మార్వో గా ఉన్న అధికారిని చంపగలిగే స్థితిని ఎందుకు కల్పించబడింది? ఒక సామాన్యుడు ఇప్పటిదాకా లంచం వేధింపులతో తనకు తాను చచ్చిపోవడం జరిగింది. మీకేమైనా ఓపిక ఉంటే రాష్ట్రంలో ఏదో ఒక జిల్లా పేపర్ తీసుకుని చూడండి. ఎమ్మార్వో ఆఫీస్‌లో ఓ రైతు ఆత్మహత్య అనో, ఆత్మహత్యాయత్నం అనో వార్త ఉంటుంది. ఈ అంశం ఎప్పుడు సమస్యగా అనిపించలేదు. ఈ విషయం ఎపుడూ సామాజిక సమస్యగా భవించలేని మనం. ఈ ఘటన సామాజిక సమస్య అని అంటున్నాం. ఇప్పటికైనా ఆహ్వానించవలసిందే..

### ఎమ్మార్వో విజయరెడ్డి సజీవదహనం

రెండు తెలుగు రాష్ట్రాల రాజధానైనా హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్‌మెటల్‌లో ఎమ్మార్వోగా విజయరెడ్డి విధులు నిర్వహిస్తున్నది. 150 ఎకరాలను రైతులు విభజించుకుని సాగు చేసుకుంటున్నారు. అది కూడా 50ఏళ్ళుగా.. ఇప్పుడు పాస్ పుస్తకాల దగ్గర కటకట మొదలైంది. కొన్నేళ్లుగా రేపు-మాపు అంటూ తిరగడం మొదలెట్టారు. అసలు భూ యాజమాన్యపు కుటుంబం లేదు. సాగు చేసుకుంటున్న వారికి దక్కకుండా బడా నేతలు కలుగచేసుకుని కొన్నేళ్లుగా మేం భూ యజమానులం



అని తెరమీదకు వచ్చారు. ఈ కేసు స్థానిక కోర్టులో తీర్పు నకిలీల వైపు వచ్చింది. ఇప్పుడు హైకోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలో ఏకపక్షంగా ప్రత్యర్థులకు భూములు ముట్టచెప్పవద్దని సాగుదారుల వైపు వాదన.. అలా పదే పదే తిరిగిన వారిలో ఒకరు సురేష్. ఈ క్రమంలో భూమి అటు వైపు వెళ్లకుండా తమ ప్రయత్నం తాము చేస్తున్నారు. ఈ క్రమంలో లంచం అడిగిందని ఆగ్రహించి ఇప్పుడు ఎమ్మార్వోను సజీవ దహనం చేశాడని ప్రాథమికంగా సురేష్ వాగ్మూలం తెలియపరుస్తుంది. సజీవదహనమైన విజయరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయురాలి నుండి ఎమ్మార్వోగా ఎదిగినట్లు, కోట్ల రూపయుల విలువ చేసే ఇళ్ళు ఉన్నట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. అసలు నిజాలేమిటో తేలాల్సివుంది. విజయ్ రెడ్డి సజీవ దహనంలో కార్ డ్రైవర్ గురనాథం, సురేష్‌లు చికిత్స పొందుతూ మృతి చెందారు.

## దేశంలో అవినీతి సమస్య

తినే దొడ్డు బియ్యం తీసుకునే రేషన్ కార్డ్ నుండి మొదలు భూమికి పట్టపుస్తకాల కోసం, ఇంటి రిజిస్ట్రేషన్ కోసం, లోన్ కోసం, ఏదైనా సంక్షేమ పథకం కోసమైనా.. ఆఖరకు పుట్టిన, మరణ తేది ధృవీకరణ పత్రాల కోసమైనా వెంటాడేది లంచం.. లంచం..లంచం..

గత కొద్దిరోజుల క్రితం ఒక జిల్లా కలెక్టరేట్ ముందు కుటుంబంతో సహా అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని మంటల్లో బూడిదైంది. ఆ భగభగ మండిపోయిన వారిలో ఇద్దరు పసిపిల్లలు కూడా ఉన్నారు. ఈ విషయాన్ని కార్టున్‌గా గీసిన బాలను నాన్ బెయిల్‌తో బంధించారనుకోండి. ఆ మనుషుల మరణాలు ఆ ఇద్దరు పసిపిల్లల దహనాలు దేశంలో హింసగా, సమస్యగా అనిపించలేదు. మన మానవత్వం సానుభూతిగానైనా కురవలేదు.

ఒక రెవెన్యూ ఆఫీస్ అటెండర్‌గా పని చేసే అతి చిన్న ఉద్యోగిపై రైడ్ చేస్తే.. పై అధికారికి బినామీగా ఉండటంతో అవినీతి డబ్బు కోట్ల రూపాయలలో బయటపడడం. తెలంగాణలో ఈ మధ్య కాలంలో తాజా వార్తగా నిలిచిన ఒక ఎమ్మార్వో ఇంట్లో 93 లక్షల డబ్బుతో పాటు, 40 తులాల బంగారం, ఎంతో విలువైన భూమి పత్రాలు స్వాధీన పర్చుకున్నామని అధికారులు స్పష్టం చేసారు. ఈ డబ్బంతా గ్రామాల్లో పంటకు పంటకు పోగేసిన రైతుల సొమ్ము. ఇలాదోచుకుతింటున్న తిమింగళాల సంఖ్య వేలల్లో ఉంది. దేశంలో ఐతే లక్షల్లో ఉంది.

ఎమ్మార్వో సజీవదహనం ఘటన లంచం పేర జరిగిందంటూ వచ్చిన వార్తలతో సురేష్‌కు మద్దతు లభించింది. మరో కోణమైన బడానేతల హస్తం అనేది మొదటగా వెలుగులోకి రాకపోవడంతో చర్చకు తావివ్వలేదు. రెండు పక్షాలలో మరోకోణంలో తావు లేకుండా అనారోగ్యకరమైన చర్చ జరిగింది.

## ఎమ్మార్వో సజీవదహనంపై ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ డిపార్ట్మెంట్‌ను తొలగించేందుకు దుర్మార్గమైన ప్రయత్నం చేస్తోంది. తమ తమ ఆధిపత్యాన్ని అడ్డుకుంటున్న రెవెన్యూ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతుండడం తెలిసిందే. ప్రభుత్వం రెవెన్యూ శాఖపై తీవ్రమైన వక్రీకరణలు, దుష్ప్రచారం చేస్తోంది. సరిగ్గా చెప్పుకుంటే.. ఇంట్లో ఎలుకలు చొరబడ్డాయని ఇంటిని తగలబెట్టుకొన్న చందంగా.. రెవెన్యూ శాఖలో అవినీతి ఉందని మొత్తం శాఖను ఖూనీ చేసే ప్రయత్నం ఎంతటి దుర్మార్గమైనది.

రెవెన్యూ విభాగంలో అవినీతి ఉన్నది. ఉన్నదానిని ప్రక్షాళన చేయకుండా మొత్తం శాఖను ఎత్తివేసే కుట్రను ఎమ్మార్వో సజీవ దహనం కేసు సంధర్భంగా అమలు చేసే ప్రయత్నం కనపడుతోంది. రెవెన్యూ శాఖలో ధరణి సాంకేతికతను ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టుగా ఇవ్వగా పదినెలలో అది చేతులత్తేసింది.. తప్పుల తడకగా పత్రాలు. ఇటు రైతులకు, అధికారులకు నిత్యం వార్ మొదలైంది. కొన్ని చోట్ల చిరు చిరు ఘర్షణలు. ఆ క్రమంలో వీటిని పరిష్కరించలేదు. అవి మరితగా జటిలమయ్యాయి. అధికారులకు, ప్రజలకు ఘర్షణపూరితమైన వాతవరణాన్ని సృష్టించాయి. ఇంత దారుణం చోటు చేసుకుంటే ప్రభుత్వం పరిష్కారం చూపకపోవడం. హాస్యాస్పదంగా బాటిల్స్‌లో పెట్రోల్ నింపకూడదని పెట్రోల్ బంక్‌లకు హుకుం జారిచేయడం.

## ప్రతిపక్షాల పాత్ర

రాష్ట్రంలో ఎలాంటి సంఘటన జరిగినా అధికార పార్టీని విమర్శించడం ప్రతిపక్షాల పరిపాటి. అవి ఏ పార్టి అయినా ఇదే సూత్రబద్ధంగా వ్యవహరిస్తాయి. ఘటనలో హతురాలు అధికార యంత్రాంగంలో కిందిస్థాయి అధికారి. హంతకుడు సామాన్యుడు. ఆ సామాన్యుడిని నేరస్థుడిగా కోర్టు శిక్ష విధిస్తుంది. ఎందుకంటే సామాజిక, రాజకీయార్థికంగా బలహీనమైన వర్గం కదా. సమాజంలో అధికార యంత్రాంగంలో భాగస్వామ్యం పంచుకుంటూ లంచాల రూపంలో శ్రమను దోచుకుంటున్న ఆర్థిక నేరస్థుల విషయాన్ని ప్రతిపక్షాలు ఆలోచిస్తాయా? సామాన్యుడు నేరస్థుడిగా ఎందుకు మారాల్సి వచ్చిందో ఆలోచించగలవా? విజయరెడ్డి సజీవదహనంపై సిట్టింగ్ జడ్జ్ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేయగలవా? భూ మాఫియాకు కొమ్ము కాస్తున్న బడానేతలపై ఫోకస్ చేయగలవా? సజీవదహనం కేసులో సమగ్ర విచారణకు డిమాండ్ చేయగలవా? అనే ప్రశ్నలకు సమాధానంగా ప్రతిపక్షాలు తమ పాత్ర పోషిస్తాయా!?

## పౌర సమాజం పాత్ర

నేరంలో నేరస్థుడి పాత్ర ఒంటరిగా మాత్రమే ఉండదు. నేరం వ్యవస్థీకృతంగా ఉంటుంది. లంచం అనేది నిజమైతే రైతులు అలసిపోయి తమను తాము బలితీసుకునే గతాన్ని ఇప్పటిదాకా చూశాం. సరికొత్తగా ఎదుటి అధికారిని బలి తీసుకోవడమనేది సురేష్ చర్యతో చూశాం. లంచం కాదు బడానేతలు వేసిన ప్లాన్‌లో సురేష్ బలై ఎమ్మార్వో సజీవదహనం చేశాడనేది ఒక ఆరోపణ వినపడుతున్నది. అదే నిజమైతే అసలు హంతకులను పట్టుకోమని డిమండ్ చేయాల్సివుంది. ఘటన విషయంలో ఇప్పుడు శిక్షించడానికి సురేష్ బతికిలేడు. దారుణానికి కారణమైన సమస్యలు అలాగే, అంతకంటే జటిలంగా వ్యవస్థలో అనేకం వున్నవి. సురేష్‌లా మరికొందరు ప్రవర్తించే అవకాశాలు ఉన్నాయన్నది కొట్టిపడేయలేని అంశం.

నిందితుడైన సురేష్ భాధితురాలిగా ఉన్న విజయరెడ్డి చనిపోయారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం, వాటిలో మనుషులు చనిపోవడం ఒక విషాదం. విషాదంలోకెల్లా విషాదమల్లా మరణాలను సమర్థించడం. మరణాలపై విద్వేషం చిమ్మడం. మరణాలను ప్రోత్సాహకంగా వ్యవహరించడం.

మరణాలపై సానుభూతి బదులుగా విద్వేషం కక్కుతుండడం. మనిషి ప్రాణం పోతే తిరిగిరానిది. పోయినవాళ్ళంతా మంచివారని కాదు. పోయిన ప్రాణాలు ఆధిపత్య వ్యవస్థలో మాములు వాళ్ళే. వారిలో వారిని పోల్చితే భేదాలు ఉండవచ్చుగాక. అధికారిగా-రైతుగా స్వల్ప వైరుధ్యం ఉండవచ్చు. కానీ, శత్రు వర్గాలుగా చిత్రించడం. అలాంటి విద్వేషాలకు తావివ్వడం దురదృష్టకరం.

నేర ఘటనలలో నేరం అంటే తెలీనివారైన పిల్లలు ఎక్కువగా సామాజిక శిక్షలకు గురవుతారు. హతురాలికే కాదు. హతుడికీ పసి పిల్లలున్నారు. ఈ విషయాన్ని మీడియా విస్మరిస్తున్నది. దానికి తోడుగా సమాజం విస్మరిస్తే అర్థమేముంది? ఇరువైపులా పిల్లలను సమాజం భవిష్యత్తులో ఎలా ట్రీట్ చేస్తారనేది ప్రశ్న. సమాజంలో హింస ప్రవృత్తి అధికమవుతుంది.

అవునన్నా కాదన్నా దేశంలో అవినీతి పెరిగిపోయింది. అడ్డుకట్ట వెయ్యాలనే ఉద్దేశ్యంలో ప్రభుత్వం లేదు. వుంటే ఇలాంటి విషాదమైన స్థితి నేడు ఆవరించి ఉండేది కాదు. ఇప్పటికైనా అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రక్షాళన చేసే దిశగా పౌర సమాజం ఆలోచించాలి. ఎందుకంటే నిజమైన దేశ భక్తంటే ఇదే కదా.! శాంతియుతమైన సామాజిక వాతావరణం. ఆరోగ్యకరమైన పాలనా విధానం. బాధ్యతయుతమైన పౌర సమాజ నిర్మాణం జరగాలి.

★ **రచయిత: పీజీ విద్యార్థి, తెలుగు విశ్వవిద్యాలయం** T


# ఆ గుండె ఆగిపోదు

● బల్ల రవీంద్రనాథ్

సర్ గిలాని అనగానే అందరికీ పార్లమెంటు మీద దాడి కేసు గుర్తుకు వస్తుంది. హిందూత్వవాదులు, భారత ప్రభుత్వం ఆయన్నో టెర్రరిస్టుగా, దేశద్రోహిగా, వేర్పాటువాదిగా చూస్తారు. కశ్మీర్ ప్రజలు, ముస్లిం మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, జాతి ఉద్యమకారులు, ముఖ్యంగా భారతదేశ వ్యాపితంగా ఉన్న రాజకీయ ఖైదీలు గిలానీని ఆత్మీయంగా, ప్రేమగా భాయ్, దోస్త్, సాబ్ అంటూ పిలుచుకుంటారు. ఎక్కడో కశ్మీరు లోయలో పుట్టిన గిలాని భారత ప్రజల మనసుల్లో చెరగని జ్ఞాపకం అయ్యాడు.

సయ్యద్ అబుద్ రెహమాన్(ఎస్ఎఆర్) గిలాని 1969లో కశ్మీరు లోయలోని ఓ పేరున్న కుటుంబంలో పుట్టాడు. గిలాని తండ్రి సయ్యద్ అబ్దుల్ వలి ఉల్లాషా గిలాని మత సంస్కరణవాది. కశ్మీరీ ముస్లింలు మూఢ నమ్మకాల నుంచి బయట పడటానికి ఆయన చాలా కృషి చేసారు. గిలాని తన అన్న బిస్మిల్లాతో పాటు చిన్నప్పటి నుంచి కశ్మీరులో జరుగుతున్న అణచివేత, దాడులను చూసాడు. తిరుగుబాటు ఎందుకు అనివార్యమో గ్రహించాడు. తండ్రి నుంచి వచ్చిన ప్రజాస్వామ్య భావాలు, అభ్యుదయ ఆలోచనలు ఆ అన్నదమ్ములిద్దరినీ ఎన్ని కష్టాలు వచ్చినా, నష్టాలు వాటిల్లినా చలించకుండా జీవితకాలం ప్రజాస్వామిక విలువలతో నిలబడేలా చేసాయి. గిలానీ ఉన్నత చదువుల కోసం కుటుంబాన్ని కశ్మీరులోనే వదిలి, ఢిల్లీకి వచ్చి అక్కడే ఢిల్లీ యూనివర్సిటీ జాకీర్ హుస్సేన్ కాలేజీలో ఉద్యోగం సంపాదించాడు.

విద్యార్థి దశ నుంచి ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా గిలాని ఎన్నో పోరాటాలు చేసాడు. వృత్తి రీత్యా అరబిక్ ప్రొఫెసర్ అయినా కశ్మీర్ చరిత్ర, భారత భద్రతా దళాల అణచివేత, కశ్మీరీల తిరుగుబాటు మొదలైన విషయాలు తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరిస్తూ సభలూ, సమావేశాలు నిర్వహించేవాడు.



2001 డిసెంబర్‌లో పార్లమెంటు మీద జరిగిందని లేదా జరిపించబడిన దాడి కేసుతో ఒక్కసారిగా సర్ గిలాని పేరు దేశమంతా మార్మోగింది. దాడికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులతో పాటు సెక్యూరిటీ గార్డు, గార్డెనర్ మరో 7 మంది పోలీసులు చనిపోయారు. కేవలం రెండు రోజుల్లో కేసును పరిష్కరిస్తున్నా మంటూ ఢిల్లీ పోలీసులు చెప్తూ గిలాని, డాక్టర్ అఫ్జల్‌గురు, అతని కజిన్ షౌకత్ హుస్సేన్‌గురు మరియు షౌకత్ భార్య అఫ్సాన్ గురుల పేర్ల మీద కేసు నమోదుచేసైఆరు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఆ దాడికి మొత్తం గిలానీనే ప్రణాళిక రచయిత, బాధ్యుడు. వెంటనే గిలానీని అదుపులోకి తీసుకొని, నిర్బంధంలో తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసారు. అవమానించారు. బండ బూతులు తిట్టారు.

"నేరాన్ని ఒప్పుకోకపోతే నీ భార్యను అత్యాచారం చేస్తాం" అని బెదిరించారు. ఎన్ని అమానుష పరిస్థితులు ఎదురైనా గిలాని తనపై మోపిన తప్పుడు ఆరోపణలను అంగీకరించలేదు. ఎటువంటి బెదిరింపులకు లొంగని ధృడమైన చిత్తం, ఉక్కుగుండె గిలానీది. దాదాపు 2 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు.

పోటా చట్టం కింద ప్రత్యేక కోర్టులో విచారణ జరిపి రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించి, కుట్రపన్నారనే ఆరోపణలకు గిలాని, అఫ్జల్‌గురు, షౌకత్ గురులకు మరణశిక్ష, అఫ్సాన్‌కు 5 సంవత్సరాల జైలు శిక్ష విధించింది ప్రత్యేక కోర్టు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, బుద్ధిజీవులంతా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ప్రచారం, పోరాటం మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, మేధావులు అందరూ గిలానీ విడుదల కోసం గొంతు కలిపి తీవ్రమైన పోరాటం చేసారు.

ప్రస్తుతం భీమా కోరేగాం కుట్రకేసులో నేరస్థుడిగా పూణె, ఎరవాడ జైలులో నిర్బంధించబడిన మా సీఆర్‌పీపీ పబ్లిక్ రిలేషన్స్ కార్యదర్శి రోనా విల్సన్, అహేరి కుట్రకేసులో జీవితఖైదు విధించబడి నాగపూర్ అండాసెల్ నిర్బంధించబడిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబ, జెఎన్‌యు విద్యార్థి హేమమిశ్రాలు గిలానీ విడుదల కోసం అలుపెరగకుండా పోరాటం చేసారు. పోటా ప్రత్యేక కోర్టు విచారణలో ఓడిపోయినప్పటికీ ఈ బృందం విశ్రమించకుండా వారి ప్రచారాన్ని ఉధృతం చేసి తీవ్రమైన న్యాయపోరాటానికి కృషిచేసారు. పెద్ద ఎత్తున వచ్చిన ప్రజా ఉద్యమాల కారణంగా ఢిల్లీ హైకోర్టు గిలాని మరణశిక్షను రద్దుచేసింది. గిలానీ, అఫ్సాన్‌లు ఇద్దరూ ఎటువంటి నేరారోపణ లేకుండా బయట పడ్డారు. ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లారు. గిలాని, అఫ్సాన్‌లతో పాటు షౌకత్ గురు కూడా నిర్దోషిగా నిరూపించబడ్డారు. ఎటువంటి ఆధారాలు లేకున్నా కేవలం ప్రజల మనోభావాల కోసం అఫ్జల్‌గురుకు సుప్రీంకోర్టు ఉరిశిక్షను ఖరారు చేసింది. జైలు నుంచి విడుదలైన తర్వాత గిలాని అన్యాయంగా అఫ్జల్‌గురుకు సుప్రీంకోర్టు విధించిన ఉరికి వ్యతిరేకంగా గొంతు విప్పి ప్రజాస్వామిక శక్తులన్నింటినీ ఏకం చేసి ఉరిశిక్ష రద్దు కోసం చాలా పోరాటం చేసాడు.

చిన్నప్పటి నుంచి తీవ్ర నిర్బంధం, అణచివేత, అన్యాయాలు, దుర్మార్గం, బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలు, అత్యాచారాలు ఇలాంటన్నింటినీ చాలా దగ్గరగా చూస్తూ ఎదిగిన గిలానీకి స్వతహాగానే భారత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, సామ్రాజ్యవాద పోకడల పట్ల వ్యతిరేకత, వాటికి నిరసన తెలుపుతూ మాట్లాడటం అత్యంత సహజంగా జరిగింది. బహుశా అది ఒక కశ్మీరీకి సాధ్యమైనంతగా మిగతావారికి అంత సులువు కాదేమో! ఏ ఒక్క కశ్మీరీని వదిలేయకుండా, లోయలోని తిరుగుబాటును అణచివేయడానికి రాజ్యం ఉపయోగించే అమానుష పద్ధతులు డాక్టర్ చదువుతున్న అఫ్జల్‌గురును కూడా చాలా ఆలోచింపచేసాయి. అతను కశ్మీరీల విముక్తి కోసం పోరాడుతున్న ఒక ప్రజాస్వామికవాది. భారత న్యాయ చరిత్రలోనే అత్యంత అరుదైన, విషాదకరమైన సంఘటన అఫ్జల్ ఉరిశిక్ష.

ఒక రాజకీయ ఖైదీగా ఢిల్లీ తీహార్ జైలులో ఒంటరి చీకటి సెల్‌లో ఎంతో నికృష్టమైన పరిస్థితుల్లో(నగ్నంగా ఉంచడం) మగ్గిపోయినా గిలానీ స్వతంత్ర ఆపేక్ష ఆగిపోలేదు. అది "ఆజాదీ కశ్మీర్"ను మరింత పెంచింది. అంతేకాదు తనతో పాటు జైలులో ఉన్న చాలా మంది జీవితాలను దగ్గరగా చూడటం, చిన్న చిన్న నేరాలకు తీవ్రశిక్షలకు ఎలా గురవుతారో చూసాడు. పెద్ద పెద్ద ఆర్థిక నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ పెద్దవారు ఎలా శిక్షలు తప్పించుకుంటారు, అమాయక ఆదివాసీలు, ముస్లింలు, దళితులు చేయని నేరాలకు ఎలా శిక్షలు అనుభవిస్తారో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. ఒక్క కశ్మీరు యువత మాత్రమే కాదు, దేశవ్యాపితంగా ఉన్న ముస్లిం యువత "టెర్రరిస్టు" ముద్రతో ఎలా సమాజం నుంచి దూరం చేయబడతారు, ఆ ఒక్క ముద్రతో ఎటువంటి నేరారోపణలు లేకున్నా, రుజువు కాకున్నా ఆ వంకతో ఎలా అక్రమంగా అరెస్టు కాబడి, రకరకాల చిత్రహింసలకు గురవుతాడు, ఎన్‌కౌంటర్ ఉలా అవుతాడు, బ్రతికున్న జీవచ్ఛవంలా ఎలా మారతాడో, నేరం రుజువు కాకున్నా యావజ్జీవ శిక్షలు, ఉరిశిక్షలు ఎలా పడతాయో, అవి ఎలా అమలవుతాయో అనుభవ జ్ఞానంతో ఆకలింపు చేసుకున్నాడు.

జైలు నుంచి బయటికి వచ్చాక రాజకీయ ఖైదీల, మైనారిటీల విడుదల కోసం, వారి హక్కుల కోసం తీవ్రంగా పనిచేసాడు. ఇదే క్రమంలో 2008 మార్చిలో ఢిల్లీలో "కమిటీ ఫర్ ద రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్" సంస్థ ఏర్పడింది. అప్పటి ఎస్ఏఆర్ గిలానీ గురించి నేను పేపర్లలో చదివాను, వార్తల్లో విన్నాను. ఢిల్లీ సమావేశంలోనే మొదటిసారి గిలాని కలిసింది, చేయి కలిపింది.

"హైదరాబాదు నుంచి మీకు ఒక కత్తి లాంటి కార్యకర్తను ఇస్తాను అన్నాను కదా! ఇదిగో ఇతనే" అంటూ ప్రొ.సాయిబాబ నన్ను గిలానీకి మొదటిసారి పరిచయం చేసాడు. అతన్ని మొదటిసారి కలిసినప్పుడే ఎంతో ఉద్విగ్నత, ఇన్స్పిరేషన్‌కు లోనయ్యాను. చాలా మృదువుగా, సూటిగా మాట్లాడతాడు. ఎంతో ఆత్మీయంగా ఉంటాడో, విషయాల పట్ల అంత స్పష్టంగా, నిక్కచ్చిగా ఉంటాడు. 2008 సీఆర్‌పీపీ ఆవిర్భావ సభ ఢిల్లీలో, దేశంలోని ప్రముఖ మేధావులు, నాయకుల సమక్షంలో జరిగింది. అక్కడ సర్ గిలానీ సీఆర్‌పీపీ సెంట్రల్ ఛాప్టర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. నేను సెంట్రల్ ఇ.సి.మెంబర్. 2009 మార్చిలో ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ ఏర్పాట్లలో గిలానీ చాలా సహకరించారు. నేను జనరల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించి ఆ రోజు నుంచి గిలానీతో సమన్వయంగా పనిచేస్తున్నాను. రాజకీయ ఖైదీల విడుదల కోసం మనం ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచేయకుడా పనిచేయాలి, జైళ్లలో వారి దుర్భర పరిస్థితులు, మానసిక ఆందోళనలు ఎలా ఉంటాయో, మన ఆవశ్యకత ఏమిటో గిలానీ కేవలం మాటల్లో మాత్రమే కాకుండా ఆచరణలో చూపిస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా ఉండేవాడు. ఎ ఫ్రెండ్, ఎ ఫిలాసఫర్, ఎ గైడ్ అనేవి గిలానీ విషయంలో అక్షర సత్యం. ఆయనో సజీవమైన సాక్ష్యం. ఒక సాధారణ వ్యక్తి దేశభద్రతకు పెనుముప్పుగా ఎలా ముద్రవేయబడతాడో అనేదానికి గిలానీ జీవితమే గొప్ప ఉదాహరణ.

సీఆర్‌పీపీకి ఇండియన్ ఛాప్టర్ అని కాకుండా సెంట్రల్ ఛాప్టర్ అని పెట్టడంలోనే కశ్మీరీల స్వయం ప్రతిపత్తి, ఈశాన్య రాష్ట్రాల, జాతుల స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛ ఆకాంక్ష ప్రతిబింబిస్తాయి. వారు భారత సామ్రాజ్యవాదాన్ని ఎంతగా తిరస్కరిస్తూ వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, హక్కుల కోసం పోరాడుతున్నారో దాన్ని గౌరవిస్తూ సెంట్రల్ ఛాప్టర్‌గా ఏర్పాటు చేయడం జరిగింది. తర్వాత క్రమంలో సీఆర్‌పీపీ సెంట్రల్ ఛాప్టర్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి తుదిశ్వాస వరకు నిబద్ధతతో పనిచేసాడు. కమ్యూనిస్టు భావజాలాన్ని ముస్లిం మైనార్టీలు సమర్థించకపోయినా, వారు కలిసి రాకపోయినా సరే ఈ దేశంలో ఆదివాసీల తర్వాత అంతటి నిర్బంధానికి, అణచివేతకు గురయ్యేది ముస్లిం మైనారిటీలే. కాబట్టి మనమే వారిని కలుపుకొని ఓపికతో పనిచేయాలంటూ సుతిమెత్తగా దిశానిర్దేశం చేసేవాడు. 2005లో న్యాయవాది నందితా హక్సర్‌తో చర్చించి ఆమె ఇంటి నుంచి బయటికి వచ్చినప్పుడు గుర్తుతెలియని అగంతకులు జరిపిన కాల్పుల్లో 4 బుల్లెట్ గాయాలకు లోనయ్యాడు. మరణం అంచుల వరకు వెళ్లొచ్చాడు. 2 బుల్లెట్లు తీస్తే ప్రాణానికే ప్రమాదం అని వెన్నుపూసలో బుల్లెట్‌ను అలానే వదిలేసారు. వెన్నులో బుల్లెట్లు ఉన్నా కార్యరంగంలో వెన్నుచూపకుండా చివరి వరకు కొనసాగాడు.

2013లో అఫ్జల్‌గురు ఉరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. 2016లో ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొంటే మరోసారి ఈ ప్రభుత్వం దేశద్రోహం కేసుపెట్టి నిర్బంధించి మరో నెల రోజులు జైల్లో పెట్టింది. అఫ్జల్‌గురు అమాయకుడు అని గిలాని చివరి వరకు నమ్మారు. భారతదేశానికి భగత్‌సింగ్ ఎటువంటి వాడో కశ్మీర్‌కు అఫ్జల్ అటువంటివాడు అని చెప్పేవారు.

25 డిసెంబర్, 2016లో నను టీడీఎఫ్ నిజనిర్ధారణ బృందంతో తెలంగాణలో అక్రమంగా నిర్బంధించబడి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జైలులో ఆరునెలలు అక్రమంగా నిర్బంధించినప్పుడు మా విడుల కోసం చాలా కృషిచేసాడు.


ఆర్టికల్ 370 రద్దు చేయడం, కశ్మీర్ ప్రజలను చీకటిలో తీవ్ర నిర్బంధానికి గురిచేయడం, భారత ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. స్వేచ్ఛ కోసం పరితపించే కశ్మీరీలను కనీస స్వేచ్ఛ లేకుండా, కరెంటు లేకుండా, ఇంటర్నెట్, ఫోన్ సౌకర్యాలు నిలిపివేసి బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా తీవ్ర నిర్బంధానికి గురిచేయడాన్ని గిలానీ ఎటువంటి పరిస్థితిలోనూ జీర్ణించుకోలేకపోయాడు. టెర్రరిస్టు ముద్ర, అక్రమ నిర్బంధం, తీవ్ర చిత్రహింసలు, దుర్భర జైలు జీవితం, తుపాకీ గుండ్లు ఏవీ కూడా సర్ గిలానీ దృఢ సంకల్పాన్ని దెబ్బతీయలేకపోయాయి. కానీ 370 రద్దు తర్వాత పరిస్థితులు మాత్రం ఆయన్ను తీవ్రంగా కలిచివేసాయి.

ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకున్నా ఆయన కశ్మీరీల గురించి ఆలోచించడం మానలేదు. అకస్మాత్తుగా 24 అక్టోబరున ఆయన మరణవార్త వినడం చాలా దురదృష్టకరమైన విషయం. శ్వాసించినంత కాలం కశ్మీరీల స్వేచ్ఛ కోసం, రాజకీయ ఖైదీల విడుదల కోసం పరితపించిన ఆయన గుండె ఆగిపోవడం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహజ మరణం కాదు. అది కచ్చితంగా ప్రభుత్వ, ఆధిపత్య భావజాలానికి ప్రతీక. అది

కల్పించిన తీవ్ర మానసిక ఒత్తిడి, ఆందోళన వలన జరిగిన హత్యగానే దీన్ని మనం పరిగణించాలి.

గిలానీ మరణానంతరం ఢిల్లీ పోలీసుల, ప్రభుత్వ చర్యలు కూడా చాలా దుర్మార్గంగా ఉన్నాయి. డెడ్‌బాడీని స్వాధీనం చేయడం విషయంలో, దాన్ని అక్రమంగా తరలించాలని చూడటం, అంబులెన్స్ కున్న కరెంటు తీసివేసి బాడీకి ఐస్ లేకుండా చేయాలని చూడటం, చివరకు ఆయన గెండె పరితపించిన ఆజాదీ కశ్మీర్‌కు, అతని జన్మస్థలానికి అంతిమ సంస్కరణలకు కూడా అనుమతించకుండా ఇక్కడే ఢిల్లీలో చేసుకోండి. కశ్మీర్‌కు అనుమతి లేదు అంటూ ఆయన మరణానంతరం కుటుంబాన్ని కూడా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేసారు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల నిరసనలతో చిరకు ఆయన్ను కశ్మీర్‌కు తరలించడానికి అంగీకరించారు. స్వేచ్ఛ కోసం పరితపించిన ఆయన గుండె ఆగిపోయినా ఆకాంక్ష ఆగిపోలేదు. అలానే కొనసాగుతున్నది. జీలం నది ఒడ్డున, కశ్మీరు లోయలో ప్రశాంతంగా నిదురిస్తున్న ఓ నా ప్రియమిత్రుడా నీ గుండె మంట నిరంతరం మండుతూనే ఉంటుంది. స్వేచ్ఛా పిపాసను రగిలిస్తూనే ఉంటది. కచ్చితంగా ఆ రోజులు వస్తాయి... శెలవు మిత్రమా.

**✶ రచయిత: సీఆర్‌పీపీనాయకులు**



# హ్యూస్టన్‌లో 'మోడీ-హౌడీ' హంగామా

ఎ.నర్సింహారెడ్డి

అమెరికా టెక్సస్ రాష్ట్రంలోని సముద్రతీర హ్యూస్టన్ నగరంలో సెప్టెంబర్ 22 నాడు జరిగిన మెగా 'హౌడీ-మోడీ' సభ ఊహించినట్లుగానే ఆర్భాటంగా, జనరంజకంగా, సంచలనాత్మకంగా, ఆనందాతిరేకాల ప్రదర్శనగా జరిగింది. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ మీడియా, సంఘ్‌పరివార్ల 'ఈవెంట్ మేనేజ్‌మెంట్'తో అద్భుతంగా ప్రచారం చేసుకొచ్చారు. మనదేశ వార్తా పత్రికలన్నీ ప్రధాన శీర్షికలు రాస్తే, రోజంతా ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా అంతా టెక్సాస్ రాష్ట్రం నుంచి ప్రచారం చేస్తూనే ఉంది. ఈ వేదికపై నుంచి మోడీ-ట్రంప్ జోడి అపూర్వ కలయికగా గారడి వాళ్లలాగ విన్యాసాలు, విచిత్ర హవభావాలను ప్రదర్శించారు. ఒకరికొకరు ఆలింగనాలు, పొగడ్తలు, తుళ్లింతలు చేస్తూ సర్కస్‌ను మించిన రక్తి కట్టించారు. దేశాభిమానాన్ని దురభిమానంగా మార్చేశారు. మోడీని ట్రంప్, ట్రంప్‌ని మోడీ పొగడ్తల వర్షాలతో ముంచెత్తగా స్టేడియంలో నిండిన 50 వేల మంది ప్రవాస భారతీయులు (ఎక్కువ మంది) పరవశించిపోయారు. నిజానికి పరస్పర రాజకీయ ప్రయోజనాలు, వ్యాపార ప్రయోజనాల కోసమే ఈ సభను నిర్వహించారు. ఈ సభ నిర్వహణనూ, ఏర్పాట్లనూ కూడా అమెరికా-భారత్ వ్యాపార సామ్రాజ్య కార్పొరేట్ కంపెనీలు చేశాయి.

మోడీ హౌడీ ప్రచారాన్ని ఆకాశానికెత్తి ప్రసారం చేస్తున్న సమయంలోనే, హ్యూస్టన్‌లోనే ఇంటర్నేషనల్ హ్యూమాని టేరియన్ ఫౌండేషన్, అలియన్స్ ఆఫ్ జస్టిస్ అకౌంటబులిటీ (ఎజెఎ) వంటి అనేక సంస్థలు ఈ సభను వ్యతిరేకిస్తూ రోడ్లపై ప్రదర్శనలు జరిపి మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఆ సభకు ఎదురుగా మూడు వేల మందికి పైగా 'మోడీ హిట్లర్' అంటూ ప్రదర్శన నిర్వహించారు. కాశ్మీరీయులపై ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఒకే సమయంలో రెండు కార్యక్రమాలు జరిగినా మన మీడియాలో దాని ఊసే లేదు, అసలేమి ప్రచురించలేదు. విదేశీ మీడియా మాత్రం ఆ నిరసన కార్యక్రమాన్ని కూడా ప్రసారం చేసింది. ఆ వేదిక మీద నుంచి భారత్ అభివృద్ధి వెలుగుల్లో ఆకాశంలో విహరిస్తున్నదంటూ చేసిన ప్రసంగంలోని వాస్తవం ఏమిటి? అనేది ప్రజాస్వామికవాదులు, దేశభక్తులను వేధిస్తున్న ప్రశ్న.

2020లో జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రెండవసారి రిపబ్లికన్ అభ్యర్థిత్వాన్ని సాధించాలని ఉవ్విళ్లూరుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు కనీసం అరడజను సమావేశాలు నిర్వహిస్తే తప్ప ఇంతమంది ప్రేక్షకులు లభ్యమయ్యే అవకాశం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ సభ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించినవారంతా ట్రంప్‌ను మోదీ ఎంతగా ఆకట్టుకున్నారో గమనించే ఉంటారు. స్టేడియం చుట్టూ సభికులకు అభివాదం చేద్దామని మోదీ ప్రతిపాదించడం, ఆ వెనువెంటనే అందుకు ట్రంప్ అంగీకారం తెలిపి, ఆయన ఎటు తీసుకెళ్తే అటు కదలడానికి సిద్దపడటం ఆసక్తి కలిగించే అంశం. అంతేకాదు, మరోసారి డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావాలని మోదీ నినాదం ఇచ్చారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వారిని లాంఛనంగా అభినందించడం తప్ప గతంలో ఏ ప్రధానీ అధికారంలో ఉన్నవారికి మద్దతుగా ప్రచారం చేసిన దాఖలా లేదు. అలాగే అమెరికా అధ్యక్షుడెవరూ గతంలో వేరే దేశాల అధినేతలు పాల్గొనే సభకు హాజరైన సందర్భం లేదు. ఇంత పెద్ద సభకు హ్యూస్టన్‌ను ఎంచుకోవడం యాదృచ్ఛికం కాదు. ఈ నగరం డెమొక్రాట్లకు పట్టుండే టెక్సాస్ రాష్ట్రంలోనిది. ఈ సభ ట్రంప్‌కూ, రిపబ్లికన్లకూ ఎంతవరకూ సాయపడుతుందో వేచిచూడాలి.

అమెరికా అధ్యక్ష స్థానానికి పోటీ చేయనున్న ట్రంప్‌కు ఇది ఫక్త్ ఎన్నికల సభ కాగా, ప్రధాని మోడీకి హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు - ఉప ఎన్నికలు కూడా ప్రధానమైనవే. ప్రజల దృష్టిని ప్రధాన మౌలిక సమస్యల నుండి మళ్ళించడంలో సిద్ధహస్తుడైన మోడీ హ్యూస్టన్ సభతో సఫలీకృతుడయ్యాడు. అంతక్రితమే నిర్మలా సీతారామన్ ఆర్థిక సంక్షోభాన్నుంచి బయటపడటానికని కార్పొరేట్ల టాక్సును 10 శాతం తగ్గించి మన ఖజానాకు ఒక లక్షా 45 వేల కోట్ల

# howdy modi



రూపాయలు నష్టం చేకూర్చి, ఈ మొత్తాన్ని ప్రజల నెత్తిపై భారం మోపటానికి రంగం సిద్ధం చేసుకోగా, ప్రజల నిరసనను మైమరిపించటానికి హ్యూస్టన్ సభను చక్కగా వాడుకున్నారు. ఈ సభలో ట్రంప్ టక్కరి తనం వొలక బోస్తూ మోడీని భారత జాతిపిత అని ఆకాశానికెత్తాడు. ఏ జాతిని నిర్మించాడో? ఏ నీతిని, ఏ రీతిని ప్రదర్శించాడో? పీడకులను, విద్వేషకులను జాతిపితలంటూ కీర్తించడం, ఒక నియంతను ఆకాశానికెత్తడం మరో నియంత అయిన దురాక్రమణదారుడైన ట్రంప్‌నకే చెల్లింది.

గడిచిన 45 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత నిరుద్యోగ సమస్యతో యువత సంక్షోభంలో ఉండగా, దేశంలోని సంపద ప్రజల పక్షాన గాక కార్పొరేట్ల వైపు ఉన్నందుకు గానూ కొనే ప్రజల్లేక అమ్మకాలు లేక అన్ని ఉత్పత్తి రంగాలు కుదేలైపోయిన తరుణంలో 'హౌడీ', 'హౌడీప్' అన్నట్లు ఆర్థిక సంక్షోభాన్ని ఎత్తి చూపుతున్న వేళ మోడీ ప్రచార వేదిక అసలు సమస్యను మసిబూసి మారేడు కాయ చేయటానికి ఉపయోగపడింది. రిజర్వుబ్యాంకు నిధుల్లో లక్ష 76 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం లాక్కొని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నుండి రిజర్వ్‌ను తొలగించి 'బ్యాంకు ఆఫ్ ఇండియా'గా చేయడంపై (సోషల్ మీడియా నుండి) దేశంలో సర్వత్రా నిరసనల నడుమ హోస్టన్ హడావిడితో జనాలు ఈ విషయాన్నే మర్చిపోయారు. ఆర్టికల్ 370 రద్దు పేరిట 80 లక్షల తోటి భారతీయులను హౌస్ అరెస్టు చేసి గత 52 రోజుల నుండి నిర్బంధించిన మోడీ ప్రభుత్వ అక్రమ పాలనను ప్రశ్నించకుండా ఉండటానికి ఈ విదేశీ స్టేజ్ నాటకం చక్కగా ఉపయోగపడింది.

### ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసిన సభ :

హ్యూస్టన్ సభ గురించి ప్రముఖ జర్నలిస్టు పి.జె.జేమ్స్ విశ్లేషణ ప్రకారం "హిందూత్వ, మితవాద శక్తులు ఈ సభను ఏర్పాటు చేసాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ నిశ్శబ్దంగా ఉన్నందుకు గానూ, ట్రంప్ తరపున మోడీ ఎన్నికల సభను నిర్వహించారు. ఎన్ఆర్‌జి ఫుట్‌బాల్ స్టేడియంలో 50 వేల మందిని తీసుకురావటానికి మోడీకి మీడియా మేనేజర్లు సహాయ పడ్డారు. ట్రంప్ ఈ సభకు రావడం వెనక... తెలివిగా ఒక వాణిజ్య ఒప్పందానికి మోడీతో ఆమోదం చేయించుకున్నాడు. 2020 మార్చి 31 నుండి ఈ ఒప్పందం కార్యరూపం దాల్చవచ్చు, అది గ్యాసుకు సంబంధించిన ఒప్పందం. అమెరికా నాచ్యురల్ గ్యాస్ కంపెనీ, పెట్రోనేట్ ఎల్ఎన్‌జి లిమిటెడ్

(పిఎల్ఎల్) ఇండియాతో ఎంఓయూపై సంతకం చేయటం జరిగింది.

ఈ ఒప్పందం ప్రకారం పిఎల్ఎల్ 50 లక్షల టన్నుల ఎల్ఎన్‌జిని డ్రిఫ్ట్ ఉడ్స్‌లోని తెల్లురియాన్ ఉత్పత్తి స్థలం నుండి కొనటానికి ఒప్పుకుంది. ట్రంప్ ఒత్తిడి మేరకు ఇరాన్ నుండి, వెనుజులా నుండి దిగుమతులను ఆపి, అమెరికా నుండి దిగుమతి చేసుకోవటానికి మోడీ ఒప్పుకున్నాడు. డాలర్లతో కాకుండా రూపాయితో చెల్లించే వీలున్న, అప్పు తెచ్చుకునే వీలున్న (60 రోజుల్లో రుణం చెల్లించే విధంగా), తక్కువ ధరకు దిగుమతి చేసుకునే ఇరాన్, వెనుజులా చమురును కాదని.. మన భారతదేశ ప్రయోజనాలను ట్రంప్‌కు తాకట్టు పెట్టాడు మోడీ. చైనా తనకు కావాల్సిన 3వ వంతు చమురు ఇరాన్ నుండే దిగుమతి చేసుకుంటూ, అమెరికా ఒత్తిడిని బేఖాతరు చేసింది. ఒకవైపు రూపాయి విలువ పడిపోతుండగా, అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతుంటే, భారతదేశం ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉండి కూడా ఎక్కడో దూరం నుండి అమెరికా చమురును ఎక్కువ ధరకు కొనుక్కోవాల్సిన అవసరం నరేంద్ర మోడీకి ఎందుకు వచ్చింది. జాతీయ పౌరసత్వం సమస్య, కశ్మీర్ సమస్యలను లేవనెత్తిన మోడీ ఈ రెండు విషయాల్లో మద్ధతు పొందడానికి ట్రంప్‌కు వంతపాడుతున్నాడు.

### మోడీ - ట్రంప్‌ల ప్రేమ పండగ :

ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్‌లో "మోడీ-ట్రంప్‌ల ప్రేమ పండగ హ్యూస్టన్‌లో యుద్ధకాంక్షను ధృవీకరించింది" అని రాసింది. మనదేశాన్ని యుఎస్ గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామిగా పిలుస్తూ చైనాతో నడుపుతున్న వాణిజ్య యుద్ధానికి తోడు మిలటరీ యుద్ధానికి ట్రంప్ భారత్‌ను దరి చేర్చుకున్నాడని రాసింది. ఇప్పటికే భారతదేశంలోని నౌకాశ్రయాలన్నింట్లో అమెరికా యుద్ధ నౌకలు రావడానికి ఒప్పందం కుదిరిందనీ, భారత్-అమెరికా ద్వైపాక్షిక ఒప్పందాలను నాలుగు దేశాల మధ్య ఒప్పందాలకు తీసుకెళ్ళిందని పేర్కొంటూ జపాన్, ఆస్ట్రేలియాలతో భారత్‌ను తెలివిగా ఈ కూటమిలోకి లాగింది. 2002 గుజరాత్ అల్లర్లలో ముస్లిములను ఊచకోత కోసిన మోడీని మానవ హక్కుల ఉల్లంఘనకారిగా పేర్కొంటూ ఆయనకు అమెరికా వీసాను తిరస్కరించింది. ప్రధాని కాగానే ఆహ్వానించింది.

అమెరికా ప్రభుత్వం నేడు ఆసియా-పసిఫిక్‌లో భారతదేశ ఉనికికి ఉన్న విశిష్టత దృష్ట్యా చైనా వ్యతిరేక కూటమిలోకి భారత్‌ను తెలివిగా మచ్చిక చేసుకుని నేడు మోడీని ట్రంప్ పొగుడుతున్నాడని ఈ ఆన్‌లైన్ పత్రిక పేర్కొంది. భారత్ అమెరికాకు చేరువవుతున్న సమయాన పాకిస్తాన్‌ను చైనా చేరదీసిందని, ప్రతిష్టాత్మకమైన చైనా పాకిస్తాన్ ఎకానమికల్ కారిడార్ నిర్మాణాన్ని వేగవంతం చేసిందని రాసింది. మోడీ హ్యూస్టన్ సభకు వచ్చిన ప్రేక్షకులకు నించోబెట్టి మరీ ట్రంప్‌కు స్టాండింగ్ ఓవేషన్ ఇప్పించాడనికి, దీన్ని ఉగ్రవాదాన్ని ట్రంప్ ఎదిరిస్తున్నందుకని మోడీ పేర్కొన్నాడని, వాస్తవానికి ఉగ్రవాదం అనే విషసర్పానికి పాలు పోసి పెంచింది, బిన్‌లాడెన్‌ను తయారుచేసింది అమెరికా సామ్రాజ్యవాదమని పేర్కొంది. 1950 దశకంలోనే పాకిస్తాన్‌కు 500 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం చేసి, ఆయుధాలనిచ్చి కశ్మీర్ విషయంలో భారత్‌కు వ్యతిరేకంగా తీవ్రవాదులను తయారు చేసింది అమెరికానే అనే విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం సముచితంగా ఉంటుంది.

2004లో మోడీ మొదటిసారి ప్రధాని అయి-అప్పటివరకు అమెరికా పర్యటనపై ఉన్న నిషేదం తొలగిపోయి అధికారం చేపట్టిన తొలి సంవత్సరంలో అమెరికాలోని న్యూయార్క్ మాడిసన్ స్క్వేర్‌లో ఇటువంటి అట్టహాసపు సభే జరిగింది. ఇప్పుడు ఆయన రెండో హయాం మొదటి సంవత్సరంలో ఈ సభ జరిగింది. ఈ రెండో సభకు ఇతర సందర్భాలున్నాయి. ఒకటి, వచ్చే సంవత్సరం అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ట్రంప్ రెండో దఫా పోటీపడుతున్నారు. రెండు, విదేశీ వాణిజ్య సంబంధాల విషయంలో ఆయనకు ఈ మధ్య సానుకూల పరిస్థితులు లేవు. ఇండియాతో సహా అనేక దేశాలతో భీషణ ప్రతిజ్ఞలు చేసి, వాటి నుంచి బయటకు రాలేక సతమతమవుతున్నారు. మూడోది, ఈ సభ జరిగిన టెక్సస్ రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ పరిస్థితి బాగాలేదు. అందువల్లనే ప్రవాస భారతీయులను ఉద్దేశించి ట్రంప్‌ను మళ్లీ గెలిపించాలని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఇది ఆ దేశ అంతరంగిక రాజకీయ వ్యవహారంలో తల దూర్చడమే అవుతుంది. అంతకు మించి మోడీ అమెరికా సర్కారుకు, ట్రంప్‌కు సాగిలపడే తన వ్యవహారాన్నీ నగ్నంగా ప్రదర్శించాడు.

దేశంలో ఆర్థిక సంక్షోభం పెరిగింది. నిరుద్యోగం 45 సంవత్సరాల క్రితం స్థాయికి పోయింది. విదేశీ మారక నిల్వలు

ఆవిరై పోతున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. 9.5 లక్షల పారు బాకీలతో బ్యాంకులు దివాళా తీశాయి. పరిశ్రమలు మూత పడుతున్నాయి. ఇప్పటికే పది లక్షల మంది కార్మికులు బజారు పాలయ్యారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలు ప్రకటించి ఆర్థిక సంక్షోభం నుంచి తెములుకోవాలని ఉబలాట పడుతున్నది. నిర్మాణ, సర్వీసు, పారిశ్రామిక రంగాలు దెబ్బతింటున్నాయి. వ్యవసాయ రంగం సంక్షోభ స్థాయిలోనే ఉన్నది. నోట్ల రద్దు, జిఎస్టీ దేశానికి అనర్థాలు తెచ్చి పెట్టాయి. ఈ వైఫల్యం దేశ ఆర్థిక రంగాన్ని కుదేలు చేస్తున్నది. దానిని కప్పిపెట్టుకోవడానికే మతోన్మాదాన్ని, పాక్‌పై విద్వేషాన్ని ఒక ఉన్మాదంగా పెంచి పోషిస్తున్నారు. మరోవైపు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు, స్వావలంభన, స్వదేశీయత అన్నీ అటకెక్కించారని నిరసనలో తెలిపారు.

## ప్రవాసులకు నిరాశ మిగిల్చిన హ్యూస్టన్ సభ

మరోవైపు హ్యూస్టన్ వేదిక నుంచి ఎలాంటి ప్రకటనలు వెలువడుతాయోనని ప్రపంచమంతా ఉత్సుకత కనబర్చింది. ముఖ్యంగా అమెరికాలో స్థిరపడిన భారతీయులు కొంతకాలంగా అమెరికాలో ఎదుర్కొంటున్న అభద్రత, అనిశ్చితి నుంచి ఉపశమనం దొరుకుతుందనే ఆశ, ఉత్సాహం భారతీయుల్లో కనపడటం గమనార్హం. మొదటి నుంచీ తన విదేశీ పర్యటనల వలన దేశానికి ఏ ప్రయోజనమూ లేకపోయినా, వాటికి అంతులేని ప్రచారం కల్పించి వాటిని తన వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకోవడానికి ఉపయోగించుకోవడంలో మోడీది అందెవేసిన చేయి. ఇప్పుడా 'బ్రాండ్ ఇమేజ్' మేనేజ్‌మెంట్‌కు పరాకాష్టే ఈ హౌడీ, మోడీ! లేదంటే మరో ప్రయోజనమేమున్నది? భారత అమెరికా సంబంధాల్లో ఏమైనా మార్పులు చోటు చేసుకోబోతున్నాయా? అమెరికా భారత్‌పై విధించిన వాణిజ్య ఆంక్షలనేమైనా ఉపసంహరించుకుందా? అంటే అదేమీ లేదని తేలిపోయింది. ఇరాన్ నుంచి చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించిన నేపథ్యంలో అమెరికా నుంచి ఇంధన దిగుమతులు పెంచుకోవటం, వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకోవటం లక్ష్యాలుగా మోడీ ఈ పర్యటన చేపట్టినట్టుగా ప్రభుత్వ వర్గాలు చెబుతూ వచ్చినా, అటువంటి స్పష్టమైన ప్రకటనలేవీ నేతలిరువురి నోటా రాకపోవడం గమనార్హం!

ఈ హ్యూస్టన్ 'హౌడీ మోదీ' సభలో ఆశించిన ప్రకటనలేవీ రాలేదు. దీంతో భారతయులను ఒకింత నిరాశపర్చిందనే చెప్పాలి. నిజానికి అమెరికాలోని మోదీ మద్దతు దారులంతా గత ఎన్నికల్లో ట్రంప్‌కే ఓటేశారు. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసలపై, విదేశీయులు ఉద్యోగాలు చేయటంపై, హెచ్-1బీ వీసాలపై తీసుకున్న నిర్ణయాలు భారతీయుల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తించాయి. కొందరైతే ఉద్యోగాలను, చదువులను మధ్యలోనే వదిలేసుకొని భారత్‌కు తిరిగొచ్చారు. కొందరు కుటుంబసభ్యులు, సన్నిహితుల పెండ్లీలు, ఇతర శుభ, అశుభ కార్యాలకు కూడా రాకుండా అమెరికాలోనే ఉండిపోయారు. భారత్‌కు వస్తే తిరిగి అమెరికా వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉంటాయో ఉండవోనన్న భయాలు ఆవరించాయి. దేశీయ కంపెనీల సంరక్షణ పేరిట ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు భారత్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు భారీగా పెంచేశారు. దీనికి ప్రతిగా అన్నట్లు భారత్ కూడా కొన్ని అమెరికా ఎగుమతులపై సుంకాలు పెంచటం గమనించదగింది.

అమెరికా-భారత్ వాణిజ్య, సౌహార్ద సంబంధాలకు ప్రతీకగా సాధారణ ప్రాధాన్యాల వ్యవస్థ(జిఎస్‌పి)ని పేర్కొంటారు. ఇది ఇరుదేశాల వాణిజ్య సంబంధాల్లో ఐదు దశాబ్దాలుగా కీలకంగా ఉన్నది. అమెరికా భారత్‌కు ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటిచెప్పేది. అలాంటి దాన్ని ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేయటం విస్మయపర్చింది. ఇలాంటి అనేక విషయాలపై హౌడీ మోదీ సభలో ఇరు దేశాధినేతల సమక్షంలో సానుకూల ప్రకటన వస్తుందని భారతీయులు గంపెడాశతో ఎదురుచూశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే హ్యూస్టన్ సభ ఓ 'ఈవెంట్'గా ముగియటం భారతీయులను తీవ్ర నిరాశ పర్చిందనటంలో సందేహం లేదు. నరేంద్ర మోదీ తాజా అమెరికా పర్యటన వాణిజ్య, దౌత్య సంబంధాలను బలోపేతం చేసే దిశలో కాకుండా పూర్తిగా రాజకీయ పర్యటనగా మారటం ఆశ్చర్యకరం.

## శరణార్థులు - వలసదారులు :

మోడీ-ట్రంప్‌లకు ఒక కామన్ పాయింట్ ఉందని, అది శరణార్థులను పౌరసత్వం పేరిట వేదించటమని పేర్కొన్న డబ్ల్యుఎస్‌డబ్ల్యుఎస్ పత్రిక అమెరికా సరిహద్దులో మెక్సికోకు వ్యతిరేకంగా ట్రంప్ గోడ కడుతున్నాడని, హిందూ-ముస్లిమ్ విభజన పేరిట అసోంలో 1971 ముందు భారతీయత అంటూ

జాతీయ పౌరచట్టం తీసుకొచ్చి ముస్లిములను దేశం నుంచి బయటకు పంపించే ప్రయత్నం మోడీ చేస్తున్నాడని రాసింది. ఐక్యరాజ్యసమితి ఇటీవల విడుదల చేసిన నివేదికలో ప్రపంచంలో 10 దేశాల నుండి వలసవాదులు వేరే దేశాలకు వెళ్తుండగా అగ్రస్థానంలో మనదేశం కోటి 75 లక్షల ప్రవాస భారతీయులు వేరే దేశాలకు వెళ్ళారని తెలిపింది. 2015 సంవత్సరంలో ఈ సంఖ్య కోటి ఏభై తొమ్మిది వేలు మాత్రమే. మెక్సికో రెండవ స్థానంలో కోటి 20 లక్షల తోనూ, మూడో స్థానంలో చైనా కోటి 10 లక్షలతోనూ ఉన్నది. కనీసం 45 లక్షల మంది భారతీయులు అమెరికాలో ఉన్నారు. మోడీ సభకు వచ్చినవారిలో చాలామంది హెచ్1 వీసాలు, గ్రీన్‌కార్డులపై ట్రంప్ ప్రకటన కోసం వచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. కొద్ది సంవత్సరాల అమెరికా జీవనానికి భారత పౌరసత్వాన్ని వదులుకొంటున్న భారతీయులు మోడీకి జేజేలు పలకటం ఇదో రకమైన దేశభక్తి.

## మిలటరీ ఒప్పందాలు

ఇప్పటికే లాజిస్టిక్స్ మిలటరీ ఒప్పందాలు మనదేశంతో చేసుకొన్న అమెరికా వచ్చే నెలలో మనదేశ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లతో కలిపి మిలిటరీ విన్యాసాలు చేయబోతున్నది. 'భద్రతా సంబంధాల' పేరిట న్యూఢిల్లీతో వాషింగ్టన్ ఒప్పందాలు చేసుకోనుందని ట్రంప్ ప్రకటించాడు. రానున్న కాలంలో మనదేశం అమెరికా నుండి మిలిటరీ ఆయుధాల్ని మరిన్ని కొనుగోలు చేసి జిడిపిలో ఆ మిలటరీ ఖర్చులను పెంచుకోనుంది. రానున్నకాలంలో ఆక్రమిత కశ్మీర్‌ను వశపర్చుకునే విధంగా యుద్ధ సన్నాహాలకు అమెరికా తోడ్పాటును ఇచ్చే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తుండగా, అదే సమయంలో చైనా మద్దతు పాకిస్థాన్‌కు ఉండటంతో దక్షిణ ఆసియాలో రానున్న కాలం తీవ్ర ఉద్రికత్తతలకు నెలవు కానుందని అంచనా. ఇదే జరిగితే భారత్ పాకిస్తాన్‌ల మధ్య సంబంధాలు యుద్ధ సంబంధాలుగా తయారవుతాయి. దీనివల్ల లబ్ధి పొందేది ఆయుధ విక్రయదారులేనని చరిత్ర నుండి గుణపాఠం నేర్చుకోవాలి. ప్రజల జీవన ప్రమాణాలు దిగజారుతున్నా దేశభక్తి పేరిట ఎన్నికలలో మతాలతో ప్రజలను వేరుజేసి అధికారంలో కొనసాగే వైఖరిని నిరసిద్దాం.

ఆర్టికల్ 370 రద్దుకు ముందు కశ్మీర్ విషయంలో భారత్–పాకిస్తాన్‌ల మధ్య 'మధ్యవర్తిత్వం' వహిస్తానన్నప్పుడు మన దేశం నుండి తీవ్ర నిరసనను ఎదుర్కొన్న ట్రంప్ మరలా సెప్టెంబర్ 24 నాడు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాలలో భాగంగా కలుసుకొన్నప్పుడు ఇలాంటి మాటే అన్నాడు. నాకు ఇరు ప్రధానులతో మంచి సంబంధాలున్నాయి కనక కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తానంటూ మన అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోంటున్నాడు. ముందే చెప్పినట్లుగా, భారత్‌తో అమెరికా వాణిజ్యం పెంచుకోనున్న నేపథ్యంలో భారత్ ఎల్ఎన్‌జి దిగుమతిదారు పెట్రోనెట్ అమెరికన్ కంపెనీ టెల్లూరియన్‌లో 250 కోట్ల దాలర్లు పెట్టుబడి పెట్టే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. సంవత్సరంలో 50 లక్షల టన్నుల గ్యాస్ దిగుమతికి ఇది ఉద్దేశించింది. ఒప్పందం తుది రూపం ఖరారు కాకమునుపే లాంఛనప్రాయంగా సంతకాలు చేశారు.

అంతకుముందు 17 ఇంధన కంపెనీలతో మోడీ జరిపిన సమావేశంలో వాటి అధికారులు భారతదేశంలో ఆర్బిట్రేషన్, పరిష్కార ఏర్పాట్లలో మార్పులను కోరారు. అంతేగాక పెట్రోలియం, గ్యాస్, బొగ్గు, పునరుజ్జీవ ఇంధన విషయాలకు వేర్వేరు మంత్రిత్వశాఖలు గాక ఏకీకృత మంత్రిత్వ శాఖ ఏర్పాటును పరిశీలించాలని కోరారు. అమెరికా నుండి సాలీనా 58 లక్షల టన్నుల ఎల్ఎన్‌జి కొనుగోలుకు గెయిల్ 2011లోనే రెండు అమెరికన్ కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. అయితే దేశంలో డిమాండ్ తక్కువగా ఉన్నందున అందులో చాలాభాగం తిరిగి అమ్మివేసింది. అరబ్ దేశాల నుంచి సరఫరా కోల్పోయి అమెరికా నుండి పెట్రోలు, గ్యాస్ దిగుమతి చేసుకోవటమంటే రవాణా ఖర్చులు భారీగా పెరిగి వాటి విక్రయధర హెచ్చుగా ఉంటుంది. అయినా 'మిత్రత్వం' కోసం మోడీ సిద్దపడుతున్నారు. 'స్వదేశీ' సిద్దాంతాన్ని విశ్వసించే పార్టీనేత 'విదేశీ' పెట్టుబడులకు అర్రులు చాచటమే కొసమెరుపు. అదే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రభావం.

## ముగింపు :

2019లో బిజెపి–ఆర్ఎస్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత నరేంద్ర మోడీ, అమిత్‌షాలు దేశ పాలన పగ్గాలు తమ చేతుల్లో మరింత బలంగా బిగించుకుంటున్న నేపథ్యంలో హిట్లరిస్ట్ ఎజెండాను బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు రంగం మీదకు తెచ్చాయి. మాట్లాడే వాళ్ళు, పోట్లాడే వాళ్ళు, వ్యక్తిత్వాన్ని, అస్థిత్వాన్ని నిలుపుకొనే వాళ్ళను, మైనార్టీలను, భిన్నాభిప్రాయాలు గల వాళ్లను వెంటాడి వేటాడి వేధిస్తున్నది. అందులో భాగంగానే

దేశ వ్యాప్తంగా మూకదాడులు, దురహంకార రీతులు చెలరేగి పోతున్నాయి. రాజ్యాంగ సంస్థలైన ఎన్నికల కమీషన్, సిబిఐ, ఇడి, సివిసి తదితర సంస్థలతోపాటు న్యాయ వ్యవస్థ కూడా స్వయం ప్రతిపత్తి, స్వతంత్రతను కోల్పోయాయి. అన్నీ సంస్థలు మోడీకి జేబుసంస్థలుగా పని చేస్తోన్నాయి. నాజీ జర్మనీ పోకడలకు ఏ మాత్రం తీసిపోకుండా మోడీ పాలన మరింత పకడ్బందీగా ఈ దేశంలో ఫాసిస్టీకరణ చేస్తోంది. బుద్ధిజీవులు, మధ్యతరగతి, మీడియా, కార్పొరేట్ వర్గాలు, రాజకీయాలు, శాసనాధికారాలు అన్ని ఫాసిస్టీకరణ ముందు వెన్నెముక లేని జీవుల్లా వంగి నంగి వ్యవహరిస్తున్నాయి.

యూపిఏ పాలనలో ఉత్పన్నమైన అనేక సమస్యలు మోడీ పాలనలో తీవ్రమవడమేగాక కొత్త సమస్యలనేకం తలెత్తాయి. అయినా భావోద్వేగాల మాటున దేశాన్ని మాయజేసి మరోసారి అధికారంలోకొచ్చింది మోడీ ప్రభుత్వం. ఇప్పుడా సమస్యలు మరింత ముదిరి దేశాన్ని సంక్షోభానికి గురిచేస్తున్నాయి. గాడితప్పిన ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న నిరుద్యోగ తీవ్రత, ఆకలిచావులు, మూకదాడులతో పాటు లెక్కకు మించిన రాజకీయ వివాదాలు దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా ఈ సమస్త సంక్షోభాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడమే ఈ హౌడీ మోడీ ఆంతర్యమన్నది యదార్థం. మహారాష్ట్ర, హరియానా రాష్ట్రాలతో పాటు దేశంలోని 64 స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ విశ్లేషణలను తీసిపారేయలేం. మొత్తంగా చూస్తే హ్యూస్టన్ సభ మోడీకేమో గాన సభగా, దేశంలో మతతత్వ, హిందూత్వ, ఫాసిస్ట్ పాలనకు ప్రపంచ పెద్దన్న (ట్రంప్) లైసెన్స్ ఇచ్చిన సభగా మారిపోయిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి ఈ కుతంత్రాల పట్ల అప్రమత్తమై కీలెరిగి వాత పెట్టడమే నేడు ప్రజల కర్తవ్యం.

ఈ నేపథ్యంలోనే ఫాసిస్టీకరణ, కార్పొరేటీకరణ రాజకీయ జమిలిగా నడుస్తోన్నాయి. వీటికి జాతీయ మద్దతే కాదు. అంతర్జాతీయ మద్దతూ కావాలి. మన మార్కెట్‌ను సామ్రాజ్యవాద కార్పొరేటీకరణలో మరింత భాగస్వామ్యం చేయాలి. ట్రంప్ అక్కడ శ్వేత జాతి దురహంకారంతో నెట్టుకొస్తున్నాడు. ఇక్కడ మోడీ మెజార్టీ మత దురహంకారంతో చెలరేగి పోతున్నాడు. అందుకే ఇద్దరిదీ జాత్యహంకారం మైనార్టీ వ్యతిరేకత, మితవాద, మతవాద దృక్పథం. దేశ సమస్యలు, ప్రజల సమస్యలు, ఆర్థిక సంక్షోభం నుండి ప్రజలను అబద్దాలతో కృత్రిమ భ్రమలతో పక్కదారి పట్టిస్తున్నారు. జాతి విద్వేష భావజాలంతో సయ్యాట లాడుతున్నారు. మోడీ ట్రంప్‌లదీ అంతర్జాతీయ క్రీడ-ఇద్దరికీ ఇద్దరు విద్వేష, ఉన్మాద పునాదుల మీద ఎదిగిన వారు. నెత్తుటికూడుకు, రక్తపు భాషకు, కార్పొరేట్ రాజకీయాలకు, మాయమాటల గారడీలకు అలవాటు పడ్డవారు. ఇక ముందు ముందూ భారత్ అమెరికా సైనిక వ్యూహంలో, ఫైనాన్స్ మార్కెట్ మతలబుల్లో నిండా మునుగుతుంది. ఇద్దరు కలసి రెండు దేశాలు కలిసి ప్రపంచంలో ఏ విపత్తులు సృష్టిస్తారో అన్న సంశయం ప్రజాస్వామికవాదుల్లో నెలకొంది.

T

## 'నడుస్తున్న తెలంగాణ'ను ఆర్థికంగా ఆదుకోండి

నడుస్తున్న తెలంగాణ మీది. మాది. మనందరిది.

నొసటి నుంచి రాలిన చెమట చుక్కది. పోరులో చిందిన నెత్తుటి బొట్టుది.

అంటరాని వెలివాడది. ఆశయాల బడుగు జీవిది.

విద్యార్థులది. అధ్యాపకులది. ఉద్యోగులది. వ్యాపారస్తులది.

కనుక ఈ పత్రికను నడపడానికి మీకు తోచిన ఆర్థిక సహాయం చేయండి.

పత్రికను పదికాలాలు నిలబెట్టండి.

సాహిత్యం/కథ

# "వినాషాయచ దుష్కృతం"

సమీర

'యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతు... .. సంభవామి యుగేయుగే... సంభవామి..' పూజ గదిలో డిజిటల్ సౌండ్ సిస్టంలో మంద్ర స్వరంలో ఘంటసాల గీతాలాపనా స్తోత్రం మీదే ధ్యాసతో కళ్ళు మూసుకున్న భాగ్యలక్ష్మి...

'ముకుందా ముకుందా..' పూజ గది నానుకున్న హాల్‌లో నుంచి, సెల్ కాలర్ ట్యూన్ మోత, ఒక్కసారి కాదు, రెండవ మూడవసారి మోగుతూ ఏకాగ్రతను భంగంచేస్తుండంతో 'అబ్బ! యాళలే పాళలే, కనీసం ఆగనైనా ఆగరు, పూజ భగ్నమైంది' విసుగును బైటకే వ్యక్తీకరిస్తూ, పూజా పీఠం ముందు నుండి లేచింది.

'ఇక్కడే కూచున్నరు. కొంచెం ఫోనెత్తడమో, కట్ చేయడమే, సైలెంట్ మోడ్ లోనికో మార్చడమో చేయకూడదా' విసక్కుంటూ హాల్ లోనికి వచ్చింది.

అర్ధాంగి అసహనం కొత్తదేమీకాదన్నట్లు వినీవిననట్లు కుర్చీలో కూర్చుని పేపర్‌లోనికి తీక్షణంగా దేనినో చూస్తున్నడు రఘురామ్. పెళ్ళిముందు అల్లుడు కూతురికీ మాటిచ్చిన కారును బుక్ చేసిన రిసిప్ట్‌ను, మొదట భార్యకూ, కారు వచ్చినంక కూతురు, అళ్ళుల్లకూ చూపించి, వాళ్ళనూ సర్‌ప్రైజ్ చేసి వాళ్ళ కళ్ళల్లో సంతృప్తిని, బిడ్డను కారులోనే తిప్పి యాత్రలు చేయించాలనే మధురోహల్లో తేలుతూ.

ఔను మరి, పెళ్ళై నాలుగేళ్ళైంది. ఏడాదిన్నర తర్వాత బిడ్డ తల్లైంది, కాని ఒక అన్‌వాంటెడ్ ఆడపిల్లకు, ముందస్తుగా రాబోయేది ఆడపిల్లని తెలుసుకొని కడుపు తీయిద్దామని వియ్యంకులంటే ఒప్పుకోక, 'కాకుంటే పిల్లను తామే పెంచుకుంటం, ఇంకో కాన్పు చూడండని బతిమిలాడి ఒప్పిస్తే, మళ్ళీ రెండున్నరేండ్లకు ఇప్పుడు నీళ్ళాడింది బిడ్డ.

ఇప్పుడైనా మనవడిని చూడాలని ఇరువైపులా అందరి ఎదురుచూపులు. ఇటు భార్య, అటు కూతురితో పాటు వియ్యంకులు, తామే గాక కోడలినీ, పూజలు ముమ్మరంగా చేయమనీ, తీర్థయాత్రలు చేయించమనీ తమమీద వత్తిళ్ళు, వెసులుబాటు లేక కారు కొనివ్వడంలో ఆలస్యం. ఈ రెంటి నడుమ బిడ్డ నలిగిపోవడం చూడలేక, ఇక ధైర్యం చేసి, లోన్ మీద కారు బుక్ చేయించిండు రఘురామ్. ప్రాసెస్ అంతా అయి, అది రావడానికి ఇంకో నెలైనా పడుతది. ఒప్పుకున్న కట్నంలో ఇంకో పది లక్షల బకాయి ఉండనే ఉంది.

'హలో హలో..ఆ...ఆ..ఆ!' ఆవలినుండి ఫోన్ కట్ అయింది. ఫోన్‌తో సహా కుప్ప కూలిన భార్యను చూసి, చేతిలోని పేపర్‌ను జారవిడుస్తూ లేచి వచ్చి భుజంపై చేయివేసి ఊపుతూ, 'భాగ్యా భాగ్యా ఏం..ఏమైంది..భాగ్యా'

భార్య స్పందించక పోవడంతో,పక్కనే పడిన ఫోన్ తీసి, రిసీవ్డ్ కాల్ నెంబర్ కు డైల్ చేసాడు. మోగుతున్న ఫోన్‌ను ఎడమభుజానికీ, చెవికీ మధ్యన అదిమి పట్టి, నీళ్ళకై వంటింట్లోని ఫిల్టర్ వద్దకు నడిచాడు.

'అయ్యా, అమ్మకు..' హాల్ లోనికి వస్తూ సొమ్మసిల్లిపడిన యజమానురాలిని చూస్తూ అడిగింది, అప్పుడే వచ్చిన పనిమనిషి రేణుక.

తనరాకనుగాని, ప్రశ్నను గానీ పట్టించు కోకుండా, అవతల నుంచి స్పందనలేని ఫోన్నుండి మళ్ళీ మళ్ళీ రింగ్ చేస్తూ, తన భార్యవైపు చూపిస్తూ, 'ఆవిడ సంగతి చూడన్నట్లు సైగ చేస్తూ, అందించిన నీళ్ళగ్లాస్‌తో యజమానురాలి పక్కన కూర్చున్నదావిడ.

నాల్గవసారి ఫోన్ చేస్తుండగా, మెసేజ్ సిగ్నల్ సౌండ్ వచ్చింది.

మెసేజ్ చదివి దిగ్భ్రమతో మౌనంగా ఫోన్‌ను టీ పాయ్ మీదుంచి, పనిమనిషి పరిచర్యతో లేచిన భార్యను కుర్చీలో కూచో బెడుతూన్న భార్యతో, 'వెళదాం పద'. అంటూ బెడ్ రూమ్ లోనికి నడుస్తూ, మెసేజ్‌ను మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటూ బెడ్ రూమ్ లోనికి నడిచి బ్యాగ్‌లో బట్టలు సర్దుతున్నడు.

ఎంతడిగినా బదులివ్వకుండా కళ్ళ నుంచి ధారలుగా కారుతున్న కన్నీళ్ళను కూడా తుడుచుకోకుండా కుర్చీలో

జారగిలబడి కుర్చీ వెనుకంచుకు మెడను వాల్చిన యజమానిని వదిలి, వంటింట్లోనికి నడిచి పాలు కాచి, హార్లిక్స్ కలిపి గ్లాసుల్లో తెచ్చేసరికి, సర్దిన బ్యాగ్‌తో సిద్ధంగా ఉన్న ఇద్దరి ముందుకూ ట్రే ను చాపుతూ, 'అమ్మా అయ్యా, అమలమ్మ కేమన్నయిందా? ఒంట చేయలే, ఇద్దరూ ఏం తినలే, ఇదో ఈ పాలైనా తాగి పోండి. పోయేటాల్లకు యా పొద్దైతదో!' అంది.

తన సందేహానికి సమాధానం ఆశించలే. పెద్ద కీడేదో తప్పకుండా జరిగి ఉంటుందనే నిర్ధారించుకొని తనే పోయి ఆటోను తీసికొచ్చింది.

'అమ్మా ఏం కాదులే, నీ పూజ, నీ భక్తి ఊకెనే పోదులే. ఎంత కష్టమైనా ఆ పరమాత్ముడు తీరుస్తడులే పోయిరా తల్లీ. నీవ్ పరేషానై అమ్మను బయపెట్టకు సారు, అమలమ్మను సల్లగ తీస్కొని రాండి'. ఆటో ఎక్కిన యజమానులకు ధైర్యం చెప్పి సాగనంపిందే గాని, ఆమెకూ 'ఈ దేవుడ నెటోడు నిజ్జెంగొకడు, మంచోడు, మంచివైపే ఉండేటోడు, బలమున్నోడొగడు– అపుడెపుడో సచ్చినంక మంచోల్లకు సుకాల సర్గానిచ్చెటోడు, సెడ్డోల్లకు సిచ్చలేసెటోడొకడు ఇప్పుడే మన నడ్మనే ఉంటె ఎంత బాగుండు...' తనలోనే అన్నట్లు గొణుగుతూ, గేటువేసి బైటకు నడుస్తుంటే

'ఏందొదినా ఏందో నీ లోపల నీవే మాట్లాడు కుంటున్నవ్' అదే వీధిలోని మరికొన్ని ఇండ్లల్లో పనిజేసే దోస్త్ ఒకామె అడిగింది.

'ఏందొదినా, ఆ దేవుడనేటోడు మన ముంగటే మన నడ్మనే ఉండి, మంచోల్లను కాపాడుకుంట, సెడ్డోల్లను సిచ్చించు కుంట ఉంటె ఎంత బాగుండె అంటాన్న.'

'ఎట్ల సీన్మలల్ల ఈరోల లెక్కనా'

'ఆ ఆ. అట్ల'

'ఆ వాల్లు రారు, ఆ దేవుడూ రాడు, ఈ ఈరోలు ఉండి రారు. దేవుడూ...ఊ.. అసలున్నడోలేదో ఎవల్లు సూసింద్రు?'

– – –

మెసేజ్‌ననుసరించి సూటిగా హాస్పిటల్‌కే పోయే సరికి, బర్న్ వార్డ్ అత్యవసర విభాగం బైట వరండాలోని కుర్చీలమీద కూచున్న అమల మామ, వియ్యంకులను చూసి, లేచి నిలబడి, విచార వదనంతో చూసి తలదించుకున్నడు. అత్త లేచి ముందుకు వస్తూ, 'వదినా ఎంతపనైపాయెనమ్మా..ఆ' అంటూ, వియ్యపురాలిపైబడి ఘొల్లు మన్నది. భగవంతుని ముందు బుద్ధిగ కూచొని పూజ చేస్తుంటే ఇంత గోరమై పోయిందొదినా ఆ..' జరిగినట్లు చెప్పాలనుకున్న దాన్ని, వలపోతలోనే ఏకరువు పెట్టింది. '..మామూలుగ రాత్రి వాళ్ళ రూమ్‌ల ఏదో చిన్న గొడవ జరిగిందొచ్చు. పొద్దెక్కిందాన్క లేవలే. 'పడుకోనీలే, నీళ్ళు పోసుకున్నపిల్ల, పైగా రాత్రేందో గొడవ పడినట్లుంది' అనుకొని



లేపలే. ఎన్మిది దాట్నంక లేసింది, అప్పట్కే వంటింటి శుద్ధి పని నేను పూర్తి చేసినంటని చెప్పి 'వంటదేముంది తర్వాత చేస్కోఒచ్చు. నీవ్ పూజ జేస్కోబిడ్డని చెప్పిన. అట్లే తన కాలకృత్యాలూ, స్నానం ఐనంక, ఎందుకో మన్సువడి పెండ్లి పట్టు చీర కట్టుకొని పూజ గదిలోనికెళ్ళింది. మీయన్న బజారుకు కూరగాయల కంటని పోయిండు. శేఖర్ తలనొస్తుందంటని, ఆఫీసుకు పోకుండ ఇంట్లనే ఉన్నడు... అమ్మాయి పూజగదిలో కెల్లినంక నేను వంటింట్లకు వోయిన. బియ్యంకడిగి, పూరీలకని పిండి గల్పుతుండంగ, పూజగదిలోనుండి ధభాల్న సప్పుడైంది. ఉరికి చూస్తేముంది దీపాల చెమ్మె కిందబడి ఉంది. అమ్మాయి మంటల్ల.

అరే శేఖర్ అంటనరిస్తే వాడొచ్చిండు. వాడొచ్చినా దగ్గెర్కి పోయెటట్లు లేదు. వాడు నేను కేకలేస్తుంటే పొరిగింటి జనం రానే ఒచ్చింద్రు.....' తన కథనాన్ని ఆవిడనుకున్న దానికంటే బాగానే చెప్పింది.

వియ్యపురాలి మాటలను వింటున్నది. '...ఎప్పుడొచ్చిండో సూసి, మల్లపోయిండో, అంబులెన్స్ తోనే ఒచ్చిండాయన. ..... పోలీసులు వచ్చి ప్రమాదస్థలాన్ని చూసి, హాస్పిటల్కే వచ్చి మమ్మల్ని వివరాలడిగి, అమ్మాయి వాగ్మూలం తీసికునే పరిస్థితి లేదని డాక్టర్లు చెప్పడంతో, ఇంతకు గంటా గంటన్నర ముందే వచ్చి వెల్లింద్రు.

మీరొచ్చినంక చెప్పమని తనకు చెప్పి పోయింద్రంట.

పోలీసులొచ్చి తమ అభిప్రాయాన్నడిగినపుడు భాగ్యలక్ష్మి అసలు వాళ్ళతో కాదు గదా మరెవ్వరితోనూ మాట్లాడే స్థితిలో లేకుండా, మౌనంగా అత్యవసర విభాగం బయట పొడవు కుర్చీమీద ఒరిగి దుఃఖ సముద్రంలో మునిగిపోయి ఉంది. రఘురాం అమ్మాయి కోలుకుని మాట్లాడితే తప్ప తనేమీ ప్రత్యేకంగా చెప్పలేననీ, అప్పటికి వియ్యపు వాళ్ళు చెప్పిందే తనకు తెలుసనీ, అంతకు మించి సంఘటన గురించింకేమీ తెలియదన్నడు. గతంలోని వత్తిళ్ళు బాధల గురించి,తన అనుమానాల గురించి అడిగితే, చెప్పడం ఇపుడు తగదని అన్నడు.

పేషంట్ వాగ్మూలాన్ని తీసికునే పరిస్థితి కూడా లేక తచ్చాడుతూ ఎస్సై డాక్టర్లతో మాట్లాడి వెళ్ళిపోయాడు.

అడ్మిట్ చేసినప్పటి నుండి సుమారు ఐదు గంటల తర్వాత జూనియర్ డాక్టర్ ఒకతను బైటకు వచ్చి, ఎదురు చూస్తున్న వాళ్ళతో, ప్రాణాపాయం మాత్రం తప్పినట్లే యనీ, పూర్తి వివరాలు రాత్రివరకు చెబుతామని చెప్పి వెళ్ళిండు.

'భగవంతుడా ప్రాణాన్ని కాపాడినవా తండ్రీ' అంటూ నీళ్ళులేని కండ్లను తుడుచుకుంటూ,' ఒదినా రాత్రి దాన్క మనను సూదనియ్యరంట పా, ఆత్రంల తినొచ్చిన్రో లేదో, మేం గుడ మంచినీళ్ళ సుక్కగూడ ముట్టలే, ఇంటికి పోదం రాండి. ఆ పూజ గదిల ఆక్సిడెంట్ పరిస్థితినీ చూద్దువుపా. అట్లే ఇంత సల్లవడి ఒత్తం పాండి' అంటూ వియ్యపుటింటివాళ్ళతో కొడుకుతో సహా కదిలింది పరమేశ్వరి.

'ఎస్సై నన్నోకసారి అబ్బాయితో వచ్చి కల్వమన్నడు, మేము పోలీసుస్టేషన్ కు పోయి వస్తం, నీవ్ గుడ రారా..'అంటూ కొడుకును వెంబడించుకొని, 'మీరు పదండి.' అంటూ వియ్యంకుడు, కొడుకు శేఖర్తో స్కూటర్ను తీసికొని వెళ్ళి పోయిండు.

నాలుగు రోజుల తర్వాత, రోగిని చూడ్డానికి అనుమతించింద్రు డాక్టర్లు. తల ఉపరితల భాగం చాలా ధ్వంసమైందనీ కనీసం మాట్లాడి విని చూడగలిగే స్థితిలోకి తేవడానికి నాల్గు ప్లాస్టిక్ సర్జరీలు చేయవలిసొచ్చిందనీ, ఐనా రెండ్రోజుల దాన్క మాట్లాడించే ప్రయత్నం చేయొద్దనీ హెచ్చరికగా సూచించిన్రు. మరుసటి రోజు బర్నింగ్ జనరల్ వార్డ్ లోనికి మార్చిన్రు. సందర్శకులకు చూడ్డానికి తేపకు ఇద్దరికి మించి అనుమతించలేదు. తల్లి భాగ్య లక్ష్మి దగ్గరుండి సపర్యలు చేస్తున్నది. మరో సుమారు వారం పది రోజులవరకు ద్రవ రూపాహారమే. అదీ పైపుల ద్వారానే. తరువాతే మాట్లాడడం, మాట్లాడించడం, నోటిద్వారా ఆహారాన్నివ్వడం.

చస్తుందనుకున్న కోడలు బతుతుందని డాక్టర్లు నమ్మకంగా చెప్పడం, మాటలు కూడా రేపో మాపో మొదలౌ తాయనే సమాచారం పరమేశ్వరిని, శేఖర్నూ నిద్రకు దూరం చేసింది. ఐనా రోజుకు రెండు సార్లు వియ్యంపురాలికి కాలకృత్యాల కైతేనేం, స్నానాదికాలకు, స్వల్ప విశ్రాంతి నిచ్చే పేరిట ఉదయం పది గంటలకు వచ్చి గంటా గంటన్నర సేపు ఇంటికెళ్ళే అవకాశం ఇస్తున్నరు.

'ఏయ్ అమలా బతికి బైటపడినవ్. కనుక మా ఇంట్లో ఉండక తప్పదు. నోరు నిజాన్ని బైటకు పెట్టిందో జీవితమంతా రోజూ నరకం తప్పదు. పెద్దపిల్లను మనింట్లనే అపురూపంగానే పెంచుకుందం. పొరపాటేదో జరిగిపోయింది. కడ్పులనే చచ్చిన

పిల్లను, నీ ప్రాణంను కాపాణ్ణికె తీసేసింద్రు డాక్టర్లు. గతించిన చేదును తవ్వుకొని మల్ల బతుకులను బజార్ల పడేస్కును డెందుకు? సద్దుకున్నదానివి. బాగా ఆలోచించు. ఎట్లైనా నీ బిడ్డకోసమన్నా నీవ్ బతకాల్సిందే.' జనరల్ బర్న్‌వార్డ్ లోన్కి మార్చిన రెండోరోజున, వియ్యపురాలినింటికి పంపిన సమయంలో కోడలికి బుద్ధి చెప్పింది, హెచ్చరించింది.

మాట్లాడలేని స్థితిలో నుండి, ముఖమంతా బ్యాండేజీతో నున్న అమల నిశ్శబ్దంగా, తల ఊపి ఆదేశాన్నంగీకరించినట్లు తలూపింది.

తరువాత వచ్చిన తల్లితో, ఒక ప్యాడ్ మీద రెండు కాగితాల నుంచి, ఒక పెన్నునీయమని స్వల్పంగా కాలిన గాయాలున్న చేతుల సైగతో కోరింది.

ఒక రోజు ఒక పగలు అనేక విరామాలతో రాసిన ఉత్తరాన్ని.. 'అమ్మా ఎందుకమ్మా నా బతుకిట్లైంది– "ప్రమాదమని ప్రచారం చేసిన ముందురోజు సాయంకాలం పరీక్షకని డాక్టర్ కాడికి తీసుకపోయింద్రు. స్కానింగ్, ఇతరపరీక్షలన్నీ చేయించిద్రు. ఏం ఎట్లా మేనేజ్ చేసింద్రో తెల్వదుకాని, కడ్పులో పెరుగుతున్నది ఆడపిల్లేనని తెలుసుకున్నరు. అక్కడక్కడే ఏం అనలేదు. నాకేమీ చెప్పలే. డాక్టర్ ప్రెస్క్రైబ్ చేసిన మందులూ తీసుకున్నడాయన. భోజనంచేసి పడుకోనీకె పడగ్గదిలోకి ఆలస్యంగానే వచ్చిండాయన. విషయంచెప్పినాక కడ్పుల శిశువును తీసేద్దామని అన్నడు. నేను ఒప్పుకోలేదు. చాలా సేపు బుజ్జగిస్తూనే ఒప్పించే ప్రయత్నం చేసిన్రు. నేను ససేమిరా ఒప్పుకోలే. అప్పుడు షురువైంది ఘర్షణ.

మాటలు దాటి చేతలు హింసకు దిగిండాయన. ఆయన పిడిగుద్దుల తన్నుల నుండి కడ్పుల బేబిని కాపాడుకుంటూ ఏడ్వకుండా పెద్దగా అరవకుండా భరించిన. అలిసి పోయిండో, అప్పుడే ఇంకో ఉపాయమేందో తట్టిందో, ఆగి నిశ్శబ్దమై పడుకున్నడు. అర్ధరాత్రి దాటినంక, తెల్లవారేముందు సుమారు మూన్నాల్గు గంటల ముందు నిద్రపట్టింది. ఒళ్ళంతానొప్పులతో లేట్‌గనే తొమ్మిది తర్వాత లేచిన. నన్నెవరూ లేపలే. లేచేవరకు ఇంట్లో ఎన్నడూ లేనంత ప్రశాంతంగా ఉంది. నేను స్నానంచేసి, మామూలు దస్తులతో పూజగదిలోకి వెళుతుంటే, అత్తమ్మ చూసి ఇవాళ శుక్రవారం పట్టుచీర కట్టుకోమ్మా అని అనునయంగా అన్నది. కాదనడమెందుకని, ఆమె చెప్పినట్లే పెళ్ళినాటిపట్టు చీర జాకెట్ తొడుక్కొని, మనసును మరింత దేవునిపై నుంచి పూజగదిలో కెళ్ళి పూజా విగ్రహాలను పూజా వ్రత పందిరిని కడిగి శుభ్రంచేసి హారతి చెమ్మెలోని దీపాలన్నీ కొత్తవత్తులతో వెలిగించి పూజచేసి, కండ్లు మూసుకొని కూచుని ధ్యానంలో ఉన్న.

నాలుగైదునిమిషాల్లో తలమీద గోరువెచ్చని ధార. మెల్లగా కారుతున్న నేయి వాసనతో కొద్దిగా మెలకువ వచ్చినా, ఏదో మహిమానుభూతితో కళ్ళు తెరవలే. ధార ఆగింది. వెంటనే ధభాల్న, కూచున్న నాముందు సుమారు రెండడుగుల దూరంలో నున్న దీపం చెమ్మె, నాఒడిలో పడింది. కండ్లు తెరిచే వరకు ఎదుట ఉరిముతున్న కండ్లచూపులతో అత్తమ్మ. లేవబోతె వెనుక నుంచి ఎవరో కిందకు తోసింద్రు. అరుస్తూ పొర్లుతూ పెడబొబ్బలు పెట్టిన. తర్వాతిక ఏమైందో గుర్తులేదు.'

బిడ్డ నివేదిక చూసి నిశ్చేష్టురాలైంది తల్లి. కుమిలి కుమిలి ఏడ్చింది. తెల్లారి వచ్చిన రఘురామ్ చేతిలో బిడ్డ రాసిన పేజిన్నర కాగితాలను పెట్టింది.

ఆయన వస్తున్న కన్నీళ్ళను తుడుచుకొని, పోలీసు స్టేషన్కు బైల్దేరడానికి సిద్ధమైండు.

'ఆత్రపడకండి. అమల బతకబోతుంది.

తర్వాత.... .....'

– – –

ఒక రోజంతా ఆలోచించింది. ఎన్నో ఆలోచనలతో సంఘర్షించింది.

యాడాది కింద పక్క వీధిలో ఇటువంటి సంఘటనలోనే అరెస్టయి జైలు శిక్షపడి, లోపలికి వెళ్ళి బెయిల్తో బైటకు వచ్చి బలాదూర్గ కేసులకు తిరుగుతున్న యువకుడూ, అతని తల్లీ గుర్తుకొచ్చిండు. మరో బంధువుల కేసులో కాలం గడిచే కొద్దీ దుఃఖతీవ్రత, కసి తీవ్రత పలుచబడి, పోయిన బిడ్డ రాదనే ఉదారానికి గుర్రై, అధిక మొత్తంలో డబ్బు వత్తిళ్ళకు లొంగి పోయి, కేసును ఉపసంహరించుకున్నదీ గుర్తుకొచ్చింది.

హత్య హింస నుండి తేరుకుని, కేసుని గెలిచి నేరస్థులకు దీర్ఘకాలిక శిక్షలను వేయించగలిగినా, గెలిచిన బాధిత ఆడవాళ్ళ నిస్తేజ యాంత్రిక జీవితం గుర్తుకొచ్చిన అనేకానేక విషాద ఆలోచన సుడిగుండాలలో తిరిగింది.

– – –

బతుకుతదని నమ్మకంగా నిర్ధారణగా తెలిసిన కోడలు

మరణించిందనే వార్త ఆరవరోజు తెల్లవారు ఝామున నాల్గు గంటలకే అందడంతో ఆమితాశ్చర్యానికి గురిచేసింది. ఒకవైపు పీడా వదిలిందనే ఉపశమనం కల్గినా, కారణం కొరకు ఆసక్తిని రేపింది.

రఘురామ్ పరిస్థితికూడా అందుకు భిన్నంగా ఏమీలేదు. డాక్టర్లు కూడా ఏమీ చెప్పలేకపోయిన్రు. వాళ్ళకూ ఆశ్చర్యం, తమ కృషియంతా నిరర్థకమైందనీ పెదవి విరిచింపజేసింది.

అందరూ హాస్పిటల్ చేరే వరకు, స్ట్రెచర్ మీద తెల్లబట్ట కప్పిన దేహం, దానిమీద ఒరిగిన భాగ్యలక్ష్మి.

అమల మృతిచెందిన రెండ్రోజులకే వియ్యంకులింటి వాళ్ళు, సమస్య నుండి పూర్తిగా విముక్తులైనా, మరకేమాత్రం పడకుండా, మరి 'కొన్ని' కారణాల కోసం తీవ్ర మనస్తాపం దుఃఖాన్ని ప్రదర్శించి కృతకృత్యులయ్యారు. తామే దశదిన కర్మ కాండను నిర్వహిస్తామన్న కోర్కెను భాగ్యలక్ష్మి, ఎంతమంది చెప్పినా చివరకు, 'అది శాస్త్రమని' రఘురామ్ చెప్పినా వినకుండా ఒప్పుకోకుండా చివరకు, తమ ఇంట్లోనే జరగాలనే, చెయ్యాలనే షరతుతో అంగీకరింపజేసింది.

కర్మ ముగించిన రోజు అందరూ గాఢ నిద్రలో నిద్రిస్తున్నరు. శేఖర్ బోడగుండుతో అర్ధనగ్న దేహంతో కర్మకాండ జరిపిన హాల్ పక్క గదిలో నేలమీద, పీటమీద ఉంచిన అమల ఫోటో ముందుంచిన వత్తి దీపం ప్రమిదకు మూన్నాల్గడుగుల దూరంలో సాంప్రదాయంగా తాగిన మద్యం మత్తులో గాఢ నిద్రలో ఉన్నడు.

అర్ధరాత్రి దాటినంక అమల మరణించిందనే నిర్ధారణ జరిగిన సమయానికే దడేల్‌మనే శబ్ధంతో కొందరులిక్కిపడినా ఏందోలే అని మళ్ళీ అటుతిరిగి ముడుచుకున్నరు. రఘురామ్ మాత్రం మేల్కొని తన పక్కకు రెండడుగుల దూరంగా నున్న పక్కవైపు చూసిండు. ఖాళీగా కన్పించింది. తెలియని ఆందోళనకూ భయానికి గుర్తై మెల్లగా నక్కుతూ శబ్ధం వచ్చిన పక్కగది వైపు అడుగులేసిండు.

గది గడప దాటినంక కనబడిన దృశ్యం, మరింత భయానికి గురిచేసి, 'భాగ్యా..' గొంతు పెగల్లేదని అనిపించి

సవరించుకొని ధైర్యం కూడ గట్టుకొని దగ్గరగావెళ్ళిండు, 'భాగ్యా ఏందిది?' దాదాపు అరిచిండు.

జవాబు లేకుండా మొసపోస్తూ, కళ్ళు విప్పార్చి 'శిష్టులను రక్షించ లేకున్నా, దుష్టులను శిక్షించనీకె వచ్చిన కలికావతాణి నేను' ఆమె కూడా అంతే బిగ్గరగా అరిచినట్లే జవాబిచ్చింది.

ఈ లోపున ఒక్కొక్కరుగా కొందరు గదిలోనికి ఒచ్చిన్రు.

'కొడుకా శేఖరా..' అంటూ ఘొల్లుమని కుప్పకూలింది. ముక్కలు ముక్కలుగా ఛిద్రమైన కొడుకు తలభాగాన్ని చూసి ఏ మాత్రం చెదరని మొండం మీద పడి పరమేశ్వరి.

'అమ్మా భాగ్యా!' భాగ్యలక్ష్మీ ఏందీ భయంకరమైన పనీ, రూపం' దగ్గరగా వచ్చి ఎడమచేయి ఆవిడ భుజం మీద చేయివేసి, కుడిచేత్తో బిడ్డముఖంమీద చిట్లిన రక్తాన్ని తుడుస్తూ అడిగిండు, ఆమెతండ్రి.

'నేను కలకత్తా కాళిని . ఉగ్రరూపంగాక మరేముంటది. పక్కకు జరగండి' ఆదేశిస్తూకదిలింది.

అదివరకే ఆ భయంకరదృశ్యాన్ని క్షణాల కాలంచూసి ఇక చూడలేక బయటకు వెళ్ళిన్రు.

భాగ్యలక్ష్మి ఛిద్రమైన అల్లుడి తల పక్కన పడి ఉన్న పాతకాలపు విసుర్రాయి ఒక(పై)భాగాన్ని ఆప్యాయంగా ఎత్తుకొని బిడ్డను ఎత్తుకున్నట్లు చంకలోనికెత్తుకొని బైటకు గది గడప దాటింది.

'ఎక్కడికమ్మా'తండ్రి అడిగిన మాటను పట్టించుకోకుండా నడుస్తూ గేటు దాటింది.

రఘురామ్, మామతో కలిసి వెంటనే నడుస్తూ, 'ఏడికి భాగ్యా ఈ చీకట్లో'

'పోలీస్ స్టేషన్‌కు. చీకటెక్కడుంది. చీకట్లను ఇప్పుడే కద పగలగొట్టి వెలుగు లోనికొచ్చింది" అంటూ నడుస్తుంటే, చేసేది లేక అనుసరించారు.

– – –

మారణాయుధంతో స్వయంగా నేరాన్నంగీకరించి లొంగిపోయిన భాగ్య స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి, కోర్టులో హాజరు పరిచారు పోలీసులు.

'ఏందమ్మా ఎందుకట్లా చట్టాన్ని చేతిలోనికి తీసుకున్నవ్. పోలీసులున్నరు, న్యాయ స్థానాలున్నవనీ తెలియదా నీకు.'

ఆ వ్యవస్థలన్నీ ఉన్నయనీ, అవెట్లున్నవో తెలుసు యువరానర్. ఎన్నడో ఎంతకాలానికో వచ్చే న్యాయమే గావచ్చు.

అంతదాన్క ఎదురు చూసే ఓపిక లేదు సార్. ఆలస్యంగా దొరికిన న్యాయం నిరాకరించినట్లేయనీ మీ కలియుగ న్యాయ సూత్రమే యువరానర్. అందుకే భారతంలో కృష్ణ పరమాత్ముడినే ఆవాహన చేసుకొని అందుబాటులో అందిన చక్రాయుధంతోనే నా న్యాయాన్ని నేనే సాధించుకున్న సర్!'

'ఇది ద్వాపరయుగం కాదు. బాగా చదివిందానివే. ఇది కలియుగం!..' గద్దించినట్లుగా, '..యుగాన్ని బట్టి ధర్మం మారుతది. ఈ యుగ ధర్మాన్ని బట్టి పద్ధతిని అతిక్రమించినవ్. నీవు చేసింది క్షమించరాని నేరం. నీకు శిక్ష ఖరారు చేసేముందేమైనా చెప్పదలుచుకుంటే చెప్పు.'

ఔ నేను కఠినమైన శిక్షకు అర్హురాలినే.

ఐతే నేనింకో హత్య చేసిన. అది నా కూతురు, ఒకే ఒక్కకూ...,'కొన్నిక్షణాలు తలదించుకుని ఉబికి వస్తున్న దుఃఖాన్ని నియంత్రించుకుంటూ,'నా ..కూతురు అమలనూ చంపిన. రెండుహత్యలు.'

జడ్జ్ నిరుత్తరుడై, క్షణాల్లో దిగ్భ్రాంతి నుండి తేరుకొని, ఈవిడను సైకియాట్రిస్టుకు చూపించి వారం రోజుల్లో మళ్ళీ హాజరుపరచండని ఆదేశించాడు.

వారం తరువాత నేరస్థురాలితో సహా సైకియాట్రిస్టునూ ప్రవేశపెట్టారు.

'భాగ్యలక్ష్మి అనే ఈవిడ సరియైన మానసిక స్థితిలోనే ఉంది. ఆవిడ నాకిచ్చిన బిడ్డ ఈ వాఙ్మూలప్రతిని, మెడికల్ రిపోర్ట్‌లనూ చూడండి యువరానర్.'

జడ్జ్ అందించిన రాత ఫైల్ ను చదివి,

'ఏందమ్మా నీ ఈ వైఖరి?..'ఆగ్రహిస్తూ 'బతికే బిడ్డనూ చంపుకుంటవ్. ఆవిడకో రెండున్నరేండ్ల పాప ఉందనీ తెలుసు. అల్లుడినీ చంపుతవ్.అంతా నీ ఇష్ట మేనా:' గద్దించాడు.

'క్షమించండి యువరానర్. అసలు బతకడానికే జీవితమైతే మనుషులకు పెళ్ళెందుకు సర్? బతకడంలో జీవించడంలో ఇంకేమీ లేదా? ఆ ఉన్నదాన్ని లేకుండా చేసి, నిత్య స్వనియంత్రణ వత్తిడి, అవమానాలతో బతికుతూ చావమనే కదా రామలక్ష్మణులు శూర్పనఖ ముక్కు చెవులు కోసి విడిచి పెట్టింది.

ఇరవైఏడేళ్ళ పిల్ల. ఎంతలేదన్నా ఇంకో ఇరవై ఏళ్ళ పాటు మగవాడి అవసరమైన పిల్ల. అదేమీ లేకుండా ఉన్న బిడ్డ కూడా తన తల్లేనని గుర్తించలేక దగ్గరకు చేరలేని జీవితం ఎందుకనిపించింది. అవసరం లేదనిపించింది సర్. అందుకే మొదట ఆమెనూ, తర్వాత ఆమెనా స్థితికి నెట్టిన అతన్నీ చంపిన యువరానర్. నేనే శిక్షకైనా సిద్ధమే. రెండు సార్లు ఉరితీయమని శిక్ష ప్రకటించండి సర్! నా బిడ్డ లేని జీవితం నేనై నేను చంపుకున్న నేరాన్ని గర్తు చేసికుంటూ బతికే జీవితం నాకొద్దు సార్. నా..నాకు మరణ శిక్ష్..ఏదీ కఠినాతి కఠినమైన మరణ శిక్షే వేయండి సా..ర్' వెక్కుతూ బోనులో కుప్పకూలింది.

కోర్టులోని జనం లాయర్లతో పాటు నిశ్చే ష్టులైన నిశ్శబ్ద స్థితిలో జడ్జ్ కేసును పై కోర్టకు సిఫారసు చేసి ఆ రోజుకిక కోర్టు వ్యవహారాన్ని ఆపివేస్తున్నానని ప్రకటించి నిష్క్రమించాడు.

T


## 'నడుస్తున్న తెలంగాణ'లో

## మీ ప్రకటనలకై సంప్రదించండి

| | | |
|---|---|---|
| చివరి కవర్(కలర్‌లో పూర్తి పేజీ) | : | రూ. 40,000 |
| రెండవ కవర్(కలర్‌లో పూర్తి పేజీ) | : | రూ. 35,000 |
| మూడవ కవర్(కలర్‌లో పూర్తి పేజీ) | : | రూ. 30,000 |
| పూర్తి పేజీ(బ్లాక్ అండ్ వైట్) | : | రూ. 25,000 |

## పరిశోధన

# ప్రజా కళారూపాలు-సామాజిక అధ్యయనం-పరిరక్షణ

ఇమ్మిడి మహేందర్

సమాజం నిత్య చలనశీలమైనది. సమాజం అంటే ప్రజలు. శ్రమజీవులు. కళలు శ్రమలో భాగంగానే పుట్టాయి. శ్రమ నుంచి తాత్కాలిక విరామం దొరికినప్పుడు కష్టాన్ని మరిచి పోవడానికి, కష్టంతో పాటు నడవడానికి కళలు ఉపయోగ పడ్డాయి. ఈ కళలు సామాజిక ప్రయోజనం దృష్ట్యా ప్రతిఫలించినప్పుడు అవి 'ప్రజా కళారూపాలు' అవుతాయి. అటువంటి కళలకు సామాజిక ప్రయోజనం ఉంటుంది. ఈ కళలు ప్రజలవైపు, సమాజం వైపు, పీడితుల వైపు నిలబడ్డప్పుడు అవి నిజమైన 'ప్రజా కళలు' అవుతాయి. ఇవి ప్రజలను చైతన్యవంతం చేస్తాయి. వారిని అభ్యుదయం వైపుకు నడిపిస్తాయి. ప్రశ్నిస్తాయి. కలబడుతాయి. చివరకు విజయం సాధించే దిశకు కదులుతాయి. ఈ చర్యల వల్ల సామాజిక ప్రయోజనం నెరవేరుతుంది. సమాజం చైతన్యవంతం అవుతుంది. ఇప్పుడు వీటి అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడింది. సామాజిక ప్రయోజనాన్ని ఆశించే కళలు ఒకవైపు, దానికి తగ్గట్టు సన్నద్ధం కాని సమాజం మరొకవైపు. అన్ని వైపుల నుండి దాడులు చేసే మత, కుల, భూస్వామ్య, పెట్టుబడిదారి భావనలు. ఇన్ని ఆటంకాల మధ్య ప్రజలను సమూహిక చైతన్యవంతం చేయాలంటే వీటి మధ్య వైరుధ్యాల్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

### 1. కళలు - వాటి పుట్టుక:

కళలను అధ్యయనం చేయడమంటే సమాజాన్ని, అందులోని సామాజిక వైవిధ్యాన్ని, అంతరాలను అధ్యయనం చేయడం. అంతిమంగా మన గురించి మనమే అధ్యయనం చేయడం. మానవుడు తన పరిణామ క్రమంలో ఆహార సేకరణ దశ నుండి ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు చేరుకున్నాడు. ఆహార ఉత్పత్తిలోని మౌలిక సూత్రాన్ని మానవుడు తన అనుభవం ద్వారా తెలుసుకున్నాడు. తద్వారా గుంపులుగా జీవించడం, కుటుంబ వ్యవస్థలు, ఆచారాలు, సంప్రదాయాలు, కష్టాలు, సుఖాలు, బాధలు, సంతోషాలు, కోపం, ఈర్ష, ద్వేషాలు అయిన భావనలు తన మనస్సులో చోటు చేసుకున్నాయి. తన జీవితంలో భాగంగా ఉన్న అంశాలు, తనకు అనుభవంలోకి వచ్చిన వివిధ అంశాలను ఇతరులకు చేరవేసే క్రమంలో కళలు పుట్టాయి. పనిలో భాగంగా ఉండి మొదటిసారి చెప్పినదాని కంటె రెండవసారి చెప్పడానికి ప్రయత్నం చేసినప్పుడు కళాత్మకత చోటు చేసుకుంటుంది. విషయావగాహన ఉన్నప్పుడు విషయాన్ని కాస్త కళాత్మకంగా బోధించడం మానవ నైజం. తన కళ్లతో చూసిన వాటికి రూపం కల్పించే క్రమంలో మొదటగా చిత్రకళ ఏర్పడింది. తర్వాత సైగలు, భాష ఏర్పడింది. భావ వ్యక్తీకరణకు ఒక మాధ్యమం దొరికింది. వాటి పరిణామ క్రమమే కళలకు పునాది అయ్యాయి. కళలు పరిణామ క్రమం చెందినా ఏనాటి కళలు ఆనాటి సమాజంలోని సంస్కృతి, వికాసాలను ప్రతిబింబిస్తాయి. సమాజం కోరుకున్నట్లుగా కళ రూపాంతరం చెందుతుంది. సమాజం మార్పు చెందాలని కళ ఆశిస్తుంది. ఈ రెండు పరస్పర ప్రభావితాలు.

ఆంగ్లంలోని Art అనే పదానికి తెలుగులో 'కళ' అనే సమానార్థకం ఉంది. "భావము అనబడు ముడి పదార్థమును భవము అను నిర్మిత రూపంలోకి మార్పొందిచుటయే కళ. కనుక కళ అనునది గతిశీలము. కళ అనునది భవము. కళ అనునది వికృతి. కళ అనునది నిర్మిత రూపము. కళ అనునది సృజన." (సంజీవ్‌దేవ్, సూర్య దేవర., చిమకుర్తి శేషగిరిరావు. పుట: 01).

"కళను నిర్వచించమంటే, ఒక ప్రదర్శన ద్వారా ఒక ప్రయోజనం సాధించడానికి అతి సుళువైన మార్గం ఏదైతే వుందో అది శిల్పమనీ, ఆ శిల్పం వల్ల ఆ ప్రదర్శనానికి కలిగే లక్షణం కళ అని చెబుతాను" (కుటుంబరావు, కొడవటిగంటి. 1999: 68) అని నిర్వచించారు.

"బుద్ధి సూక్ష్మతను ఉపయోగించి మనిషి కల్పించేది కళ. ఈ కళ భావనాశక్తిని రేకెత్తిస్తుంది. మనస్సులో ఏర్పడ్డ దృశ్యాన్ని సృష్టించే ప్రయత్నమే కళ అనవచ్చు." (శ్రీనివాస్ యాదవ్, దూదిమెట్ల. 2017:08)

## 2. కళల ప్రయోజనం:

కళలకు ఏమైనా ప్రయోజనాలు ఉంటాయా? అనే ప్రశ్నతో మనం మొదలవ్వాలి. కళ కళ కొరకే, లేదా కళ ప్రజల కొరకే అనే రెండు ప్రధానమైన చర్చలు సాహిత్యలోకంలో ఉన్నాయి. అందరు కేవలం ఈ రెండు ప్రయోజనాల గురించే ఎక్కువగా చర్చిస్తున్నారు కానీ ప్రతి కళకు ఒక స్వీయ స్వభావ చైతన్యం ఉంటుందన్న విషయాన్ని చాలా మంది పట్టించుకోలేదు. ఈ విషయాన్ని చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రతి కళకు ఉన్న స్వీయ స్వభావ చైతన్యం ప్రజలకు అండగా ఉండి సమాజంలో, వ్యవస్థల్లో వారి సామాజిక ప్రయోజనం నెరవేర్చటంలో భాగస్వామ్యం అవుతాయి. వాస్తవానికి ప్రతి కళకు ప్రయోజనం ఉంటుంది. యంత్ర కళలైనా, ప్రజా కళలైనా. ఆ ప్రయోజనం ఎవరివైపు ఉన్నది అన్నది గమనించాల్సిన అంశం.

"సవ్యమైన సమాజంలో తిండీ, గుడ్డాలాగే కళలు కూడా ప్రజల అవసరాలను తీర్చేవిగా ఉండాలి. జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడం, జాతి యొక్క అభ్యుదయానికి యథాశక్తిగా సాయపడటం, అనుక్షణం పెరిగే విజ్ఞానాన్ని ఉపయోగ పరుచుకోవడం, ప్రవర్తనలో అవసరమైన మార్పులు సాధించటం ప్రజలందరికీ అవసరం. ప్రజల సంస్కృతీ ఎంతగా అభివృద్ధి అయితే సమష్టి జీవితం అంతగా అభివృద్ధి చెందుతుంది." (కుటుంబరావు, కొడవటిగంటి, 1999: 80)

సామాజిక ప్రయోజనాన్ని, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని సమన్వయించేదే నిజమైన కళ. అప్పుడే కళలు నిజమైన ప్రజాస్వామిక వాదులను తయారుచేయగలుగుతుంది.

## 3. ప్రజా కళలు - ప్రజా కళాకారులు:

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలు నిర్మించిన కళలను 'ప్రజాకళలు' అనవచ్చు. అన్ని కళలను ప్రజలే నిర్మిస్తారు. వీటిని విస్తృతార్థంలో 'జానపద కళలు' అని అంటారు. కానీ కళలు నిరంతరం ప్రజల వైపు అంటే పీడితుల వైపుకు నిల్చున్నప్పుడు అవి నిజమైన ప్రజా కళారూపాలుగా గుర్తించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జయధీర్ తిరుమలరావు గారి మాటలను గుర్తుచేసుకోవాలి. "ప్రజలే కవులై, కళాకారులై ప్రదర్శించే కళా రూపాల్ని ప్రజా కళారూపాలనడం సబబు. ఐతే ఈ పరిధిని మరింత పెంచక తప్పదు. ప్రజల కోసం ఉపయోగపడే ప్రదర్శనలు కూడా ప్రజా కళారూపాలే. అంతే కాని ప్రజా వ్యతిరేక భావాలను ప్రజలచేతే చెప్పించే కళా రూపాలు ప్రజా కళారూపాల కిందకు రావు. వీటిలో కొన్నింటిని జానపద కళా రూపాలని కొందరు పిలుస్తున్నారు. ఐతే ప్రజా కళారూపాలలో కలుస్తున్న కాలుష్యం గుర్తించకపోతే వీటి అధ్యయనం అసంపూర్తిగానే ఉంటుంది. ప్రజా కళారూపాలలో 'ప్రజా' పదం రాజకీయమైన ఒక ప్రయోజనాన్ని ఉద్దేశిస్తుంది. జానపద పదానికి రాజకీయార్థం లేదు. విస్తృతార్థం తప్ప" (తిరుమలరావు, జయధీర్. 1987: 9)

"ఇప్పుడున్న సమాజం దోపిడి సమాజం. ఆ దోపిడి కులపరమైంది కావచ్చు. లింగ, ప్రాంత, ఆర్థిక, మత, జాతి పరమైందీ కావచ్చు. ఆ దోపిడి పోగొట్టడానికి ఒక మనిషి ఇంకొక మనిషిని దోపిడి చేయడానికి అవకాశం లేని వ్యవస్థ కోసం పోరాడే జనాలకు అండదండగా తమ కళా రూపాలను తయారు చేసే వారిని, ప్రదర్శించే వారిని 'ప్రజా కళాకారులు' అంటాము. ఇప్పుడున్న సమాజం ఏ కొంచెం ముందుకు పోవడానికి తమ కళారూపాలను ప్రదర్శించే వారైనా ప్రజా కళాకారులని అంటాము" (స్ఫూర్తి. 2015: 33)

భారతీయ సామాజం వివిధ వర్గాలుగా, కులాలుగా విడిపోయి నిరంతరం దోపిడికి గురవుతున్నది. చైతన్యలేమితో బాధ పడుతున్నది. పాలితులుగా ఉన్న మనం కలిసి లేకపోవడం మూలంగా కుల, మతాలను తమ రాజకీయ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్న అనేక మంది చేతుల్లో నిరంతరం బలి అవుతునే ఉన్నాం. ఎవరి శవాలను వారే మోస్తున్నాం. చిన్నపాటి లక్ష్యాలతో సంతృప్తి చెంది, సుదూర లక్ష్యాలను అలక్ష్యం చేస్తున్నాం. ఇటువంటి సందర్భంలో మనం సామాజిక పోరాటాలలో ఎంత చైతన్యంగా పాల్గొంటున్నామన్నది మన చైతన్యం మీద ఆధారపడి ఉంటుంది. ఈ చైతన్యం సమాజ పురోగమానానికి ఏ మేరకు తోడ్పడినా, ఆ వైపుకు తమ కళలతో చైతన్యం చేసిన ఆ కళాకారులను ప్రజా కళాకారులనే పిలవాలి.

## 4. ప్రజా కళారూపాలు-సామాజిక అధ్యయనం:

సామాజిక అధ్యయనం అంటే వైరుధ్యాల అధ్యయనం. కుల వర్గ సమాజంలో కళలకు కూడా కులాలు, మతాలు, ప్రాంతాలు అనే వివక్షతలు ఉంటాయి. కళా ప్రదర్శనల్లో లింగ వివక్షత కూడా ఉంది. ఇన్ని అసమానతలు కలిగిన కళలు ఏకం కాగలవా? కాగలవు. ఏకం కావాలని సమాజం కోరుకుంటున్నది. సమాజం కోరుకున్నట్టు కళలు రూపాంతరం చెందుతాయి. ఆ ప్రయత్నం చేయాలి. ఈ అవసరాన్ని

ప్రజాస్వామికవాదులు, ప్రజా కళాకారులు, సాంస్కృతిక సంఘాలు గుర్తించాలి. వారిని సామూహిక పరచాల్సిన బాధ్యత ఉన్నది.

సామాజికానికి, సామూహికానికి మధ్య విభేదాలు ఉన్నాయా అనే ప్రశ్న వేసుకుంటే భిన్న అస్తిత్వాలు గల ఈ సమాజంలో సామాజికత అనేది ఏ వర్గాలకు ఆ వర్గాలు, ఏ కులాలకు ఆ కులాలను దృష్టిలో పెట్టుకొని చూడాల్సి ఉంటుంది. నేటి సమాజంలో కళలు సామాజిక స్పృహను కల్పిస్తూనే సామాజికతత్వం అత్యున్నత రూపమయిన "సామూహికం" అనే భావన కిందికి కళలు మార్పు చెందాల్సిన అవసరం ఉంది. జయధీర్ తిరుమలరావు కళా రూపాలను ఒకే వేదిక మీదకు తెచ్చి, వారిని సామూహిక ప్రదర్శనకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రజా కళారూపాలు సమాజంలో ఉండే అనేక సమస్యల మీద నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వాలు చేసే కుట్రలను ప్రశ్నిస్తూనే ఉంటాయి. కనుక కళలు సామూహిక లక్ష్యం కొరకు పనిచేస్తున్నాయి. సమాజంలోని వివిధ ఉద్యమాలు, పోరాటాలు, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాలలో ప్రజా కళారూపాలు, అవి సృష్టించిన సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

## ప్రజా కళలు-స్వీయ అస్తిత్వ చైతన్య భావనలు:

ఏ సామాజిక చలనం అయినా సాహిత్యాన్ని, కళలను ప్రభావితం చేస్తుంది. ఆ చలనాన్ని చైతన్యంగా మార్చి తిరిగి ప్రజలకు చేరవేసేవి కళలు. అట్లా ఈ కళలు ప్రజాకళలుగా రాజకీయార్థంలోకి రాక మునుపే అవి చైతన్యం కలిగి ఉన్నాయి. స్థానిక, ప్రాంతీయ ఆధిపత్యాన్ని తిరస్కరించాయి. పోరాటం చేశాయి. పోరాటంలో పాల్గొన్న వారిని నిలబెడుతూ సమాంతర సాహిత్యాన్ని సృష్టించాయి. ప్రతి కళారూపాన్ని తమదైన జీవనంలోంచే తయారు చేశారు. తమ నిత్యజీవితంలో భాగమైన పశువుల నుండి మాదిగలు డప్పులు తయారు చేశారు. కురుమ గొల్లలు తమ మందలోని మేకల చర్మం నుండే డోలు వాయిద్యాన్ని సృష్టించారు. చర్మాన్ని నేర్పుగా వొలిచి, వాయిద్యంగా తయారు చేసుకున్నారు. తమ తమ కుల సంప్రదాయంలో భాగంగా చాలా కళలు ఉన్నాయి. ఇప్పటికి కొన్ని కళలు బతికి ఉన్నాయంటే కులాలు వాటిని తమ వాటిగా గుర్తించుకోవడమే. కనీసం ఈ రూపంలోనైనా కళలు బతుకుతున్నాయని ఒకింత ఆనందమే అయినా ఈ కళలు, కళాకారులు కుల స్వభావాన్ని వదిలి, కులం పట్ల స్పృహను పొంది ప్రజలందరిని సామూహిక పరచాల్సిన అవసరం ఉంది. మొదటి తరం జానపద పరిశోధనల్లో ఎక్కువ శాతం పాటలు, శ్రామిక గేయాలు, రామాయణపు పాటలు మొదలైన వాటి సేకరణే పరిశోధనలుగా సాగాయి. కానీ ప్రతి కళకు ఉండే భిన్నమైన నిర్మాణ పద్ధతులు, వైవిధ్యాలు, సామాజిక స్థితుగతులలో కళల ప్రతిఫలనం అన్న అంశాలపై ఇంకా చర్చ జరగలేదు.

## ప్రజా కళలు-సామాజిక, సాహిత్యోద్యమాలు:

ప్రపంచ వ్యాప్తంగా ప్రజా కళారూపాలు, ప్రజా శక్తులే రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఫాసిజాన్ని నిర్మూలించడానికి కృషి చేసినవి. సంపదపై అజమాయిషి గల నాయకులూ, సామ్రాజ్యవాదులూ ఫాసిజానికి ప్రత్యక్షంగా సహకరించారు. అయినా సమాజంలోని ప్రజా కళారూపాలు ఫాసిజాన్ని ప్రశ్నించాయి. పాటలు కట్టాయి, ఆడాయి. ఫాసిజానికి వ్యతిరేకంగా కవులు తమ కలాలను కదిలించారు. సుంకర సత్యనారాయణ "స్టాలిన్ గ్రాడ్ యుద్ధం" అనే బుర్ర కథను రాశారు. హిట్లరును ఉద్దేశించి పాటలు వచ్చాయి. "మిట్టిపడే హిట్లరయ్యా", "అయ్యో హిట్లరూ" అనే పాటలు వచ్చాయి. సుంకర సత్యనారాయణ సమాజంలో జాతీయాలను తన పాటల్లో ఉపయోగించాడు. "మానవతీమణులనుబట్టి నానా హింస పెట్టినందుకు ఆనవాలు మరణమేనని" రాశాడు.

మొదటి నుండి మన దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు బలపడ్డాయి. జమిందారీ, భూస్వామ్య, సామ్రాజ్య వాద సంస్కృతికి వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి. ప్రజా శక్తులను కూడగట్టి వారిలో చైతన్యం నింపడానికి ప్రజా కళారూపాలు ఉపయోగపడ్డాయి. స్వరాజ్యం వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. ప్రజా కళాకారులపై నిర్బంధం పెరిగిపోయింది. "మా భూమి నాటకం", "సీతారమారాజు బుర్రకథ"ను నిషేధించారు. వాస్తవానికి ప్రజానాట్యమండలి వేసిన కళా రూపాలను చాలామంది కమ్యూనిస్టు వ్యతిరేకులు కూడా చూసి స్పందించారు. గూడవల్లి రామబ్రహ్మంగారు కమ్యూనిస్టు వ్యతిరేకి అయినా నాజర్ బుర్రకథ విని ఆయనని హత్తుకుని ఆయన స్పందనను తెలియజేశారు. మా భూమి నాటక ప్రదర్శన మధ్యలో కళావెంకట్రావు గారు ఆ నాటకాన్ని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

ప్రతి ఉద్యమానికి కార్యక్షేత్రం సమాజం. తెలుగు ప్రాంతాలలో వచ్చిన సంఘ సంస్కరణోద్యమైనా, జాతీ

యోద్యమైనా, అభ్యుదయోద్యమం, విప్లవోద్యమం, అస్తిత్వవాద ఉద్యమాలలో ప్రజా కళారూపాలు ఎనలేని కృషి చేశాయి. పై వాటిలో స్త్రీవాద మైనారిటీ ఉద్యమాలు కళారూపాలను ఏ విధంగా వినియోగించు కుంటున్నాయి అనే అంశంపై ఇంకా స్పష్టమైన నిర్ధారణలకి రావాల్సి ఉంది. ఈ రెండు ఉద్యమాలలో సామాజికంగా ప్రజా కళారూపాలను ఎక్కువగా ఉపయోగించుకోలేదు. మైనారిటీలు మైనారిటీగా ఉండడం వల్ల సాహిత్యంలో వచ్చినంత ధిక్కార స్వరం ఆ సమూహంలో ప్రజా కళా రూపాలలో వ్యక్తం కాలేదు. దానికి కారణం వారి సమూహం అత్యల్పమై ఉండడం. కానీ స్త్రీవాద ఉద్యమం ప్రపంచ జనాభాలో సమానంగా ఉన్నప్పటికీ వారు సాహిత్యంలో వేసినంత ప్రభావం కార్యక్షేత్రం అయిన సమాజంలో వేయలేకపోయింది. అభ్యుదయ, విప్లవ వాదులు స్త్రీవాద కోణంలో ప్రజా కళా రూపాలను వ్యక్తీకరించారు. ఈ వైరుధ్యాన్ని ప్రజాస్వామ్యవాదులు సామాజిక అభ్యున్నతి కోరుకునేవాళ్లుగా వీటిని అధ్యయనం చేసి స్త్రీ వాద అభ్యున్నతి కోసం తోడ్పడాల్సిన అవసరం ఉన్నది.

అటు సాహిత్య రంగంలో, సాంస్కృతిక, రాజకీయ రంగంలోనూ స్పష్టమైన అవగాహన కలిగిన ఉద్యమాలు సమాజంలో అత్యంత ప్రభావం వేయగలుగుతున్నానయి. వీటికి ప్రత్యక్ష ఉదాహరణగా విప్లవ, దళిత, ప్రాంతీయం అస్తిత్వోద్యమాలను గుర్తించవచ్చు

ప్రజా కళాకారులకి సామాజిక, రాజకీయ లక్ష్యంతో పాటు సాహిత్య, సాంస్కృతిక లక్ష్యం కూడా ఉంది. ప్రజా కళారూపాలను ఉద్యమాలలో ప్రతిఫలింపజేసిన ప్రజా నాట్యమండలి ఈ విషయంలో ఆదర్శంగా నిలుస్తుంది. తితిదే వారు తమ ఇరవై వేల మంది కళాకారులకు సరైన అవకాశాలు కల్పించకుండా చేసినప్పుడు ప్రజా నాట్యమండలి వారితో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. తమ లక్ష్యాలకు భిన్నంగా పని చేస్తున్న కళాకారులైనప్పటికీ కళా హృదయంతో ఆలోచించి తన సామజిక బాధ్యతతో పాటు, అధ్యయన విస్తృతిని ఈ సంఘటన తెలియజేస్తుంది.

సాంస్కృతికోద్యమం అంటే ప్రజా కళారూపాలను, కళలను బతికించుకోవడం, కళారూపాలను తయారు చేసుకోవడం మాత్రమే కాదు. విశాల ప్రజారాశుల ఆలోచనలపై, ఆచార వ్యవహారాలపై పాత సమాజానికి సంబంధించిన అన్ని రకాల మూఢనమ్మకాలను అవి వేస్తున్న ప్రభావాన్ని తొల గించడం, నూతన ప్రజాస్వామిక సమాజానికి అనుకూలమైన సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టించేదిగా ఉండాలి. ఇవి ప్రజా కళారూపాల లక్ష్యం కావాలి.

సమాజం నిత్యం అనేక కుదుపులతో బెంబేలెత్తున్నది. మార్కెట్ వలయంలో చిక్కుకున్న మనిషి స్వీయ అస్తిత్వాన్ని కూడా కోల్పోతాడు. అప్పటివరకు తన జీవితంలో భాగమైన ప్రతీది నెమ్మదిగా దూరం అవుతుంటాయి. అలా దూరం అవుతున్న వాటిల్లో కళలు ప్రధానమైన అంశం. కళలు అంత రిస్తున్నాయన్నా, కళల స్వరూప స్వభావాల్లో విపరీతమైన మార్పులు వస్తున్నాయన్నా అవి మనిషి మనుగడను, మానవ పరిణామ క్రమంలోని వివిధ దశలను కోల్పోతాడని అర్థం. మొత్తానికి మనిషి జీవితం, సామాజిక జీవనం డబ్బా పాలు తాగి పెరిగిన పిల్లల జీవితంగా మారుతుంది. మనిషి ఇలా జీవన మాధుర్యాన్ని కోల్పోతాడు అనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రాచీన కాలం నుండే జానపద సాహిత్యాన్ని శిష్ట, అగ్రవర్ణాలు ఈసడించుకున్నాయి. ప్రాచీన జానపదకళలకు అంటరానితనాన్ని అంటించారు. అది నేటికి కొనసాగుతున్నది. కళలు ప్రజాకళలుగా మారడానికి మనువాదం సృష్టించిన కులవ్యవస్థ, అసలు కళలే లేకుండా చేసే ప్రపంచీకరణ అడ్డుతగిలాయి. వీటిని ఎదుర్కొనే సందర్భంలోనే కళలను సామూహిక కళలుగా మార్చిన ఘనత వామపక్ష భావాజాలాలకు, వాటి నాయకత్వానికి దక్కుతుంది.

సామ్యవాద సిద్ధాంతాల వల్ల ఈ కళా రూపాలు మరొక్క సారి ప్రజల కోసం ఒక కొత్త శక్తితో పని చేయడం ప్రారంభించాయి. బుర్రకథ, గొల్ల సుద్దులు, వస్తువు ప్రదర్శన రూపాలలో సామాజిక ప్రయోజనం దృష్ట్యా మార్పు చేసుకున్నాయి. ఒకప్పుడు కులదేవతలు, కుల కథలు గానం చేసిన కళా రూపాలు సైతం సామాజిక వస్తువుని స్వీకరించి ప్రజలను సమూహింగా మార్చే ప్రక్రియను ప్రారంభించాయి.

ప్రజా ఉద్యమాలలో కళలు ఉన్నతమైన పాత్రను పోషించాయి. ఉద్యమించాయి. ప్రజా కళలు అప్పటివరకు లేని కొత్త ఇతివృత్తాలను తీసుకొని, కొత్త రూపాలతో ప్రదర్శనలు ఇచ్చాయి. ఈ పద్ధతుల వల్ల తమ స్వీయ కళల అస్తిత్వాన్ని కోల్పోతున్నాయన్న స్పృహ కలిగినప్పటికీ కళలకు అంతిమ

ప్రయోజనం ప్రజలను చైతన్యపరచడమే అని నిర్ణయించు కున్నాయి. ముందుకు నడిచాయి. మార్పును అంగీకరించాయి.

కళలు ప్రజా కళలుగా రూపొందిన తర్వాత కుల, మత, ప్రాంత విభేదాలను తొలగించుకుని ప్రజలను చైతన్యవంతం చేసాయి. కానీ క్షేత్ర స్థాయిలో ఇటువంటి పరిస్థితిని అంచనావేయడంలో ప్రగతిశీల, విప్లవ భావజాలాలు కొన్ని ఆటుపోట్లకు గురైన మాట వాస్తవమైనప్పటికీ, ఆ లోటును భర్తీ చేసేందుకు కృషి చేసింది మళ్లీ వీళ్లే.

## ప్రజా కళలు - నేటి సవాళ్లు, పరిరక్షణ:

నేటి ఆధునిక యుగంలో సామ్రాజ్యవాద భావనలు పెరిగిపోయి, ప్రపంచీకరణ ప్రభావం ప్రజ్వరిల్లిన తరుణంలో కళలు తమ పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయి. వాటి నిర్మాణంలో, సామాజిక వైవిధ్యాలలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటువంటి సందర్భంలో బద్ధిజీవులుగా మన పాత్రను పునః సమీక్షించుకోవాల్సిన సందర్భం ఇది.

ప్రతి సమాజం అభివృద్ధి చెందాలి. ఆధునీకరించబడాలి. కానీ, ఆ అభివృద్ధి, ఆధునికత ఎలా అర్థం చేసుకోవాలి అన్న అంశంపై మనకు స్పష్టమైన అవగాహన ఉండాలి. సమాజంలో మార్పులు వస్తే అవి సాహిత్య, కళా రంగాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఇప్పుడు సమాజంలో సంభవించే అనేక పరిస్థితులు కళల్లోని ఉపరితల అంశాలను కాకుండా పునాది విషయాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. భూస్వామ్య సమాజం క్రమంగా పెట్టుబడిదారి సమాజంలోకి ప్రవేశించింది. ఇది నేటి సమాజాన్ని దాని మూలాలను కబలిస్తున్నాయి. అభివృద్ధి ముసుగులో ప్రవేశించిన అనేక ప్రజా వ్యతిరేక విధానాలకు (వాళ్లకు ప్రస్తుతం తెలియకపోయినా, మార్పులు ప్రస్తుత జీవనానికి ఆటంకం కలిగించకపోయినా మానవ సంబంధాల విధ్వంసం ద్వారా అనుభవంలోకి వస్తాయి) ఇక్కడి ప్రభుత్వాలు, రాజ్యాంగం, స్వపరిపాలన వ్యవస్థ, న్యాయ వ్యవస్థలు దాసోహం అయ్యాయి. అభివృద్ధి పేరుతో సమూల వినాశనాన్ని ఆహ్వానిస్తున్నాం. ఇలాగే జరిగితే మన కళలను, సంస్కృతినీ, మానవ సంబంధాలను కోల్పోవడానికి మనందరం సిద్ధంగా ఉండాల్సి వస్తుంది. ఈ వినాశనాన్ని గర్తించిన మేధావులు, ప్రతిఘటనా శక్తులు కొద్దిమేర పని చేస్తున్నా, లోతైన విశ్లేషణ చేయడంలో, ప్రజలకు సిద్ధాంతపరమైన అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారని చెప్పవచ్చు.

గ్రామీణ వాతావరణంలో నిర్దిష్ట సందర్భంలో , నిర్దిష్ట శ్రోతల కోసం మాత్రమే ప్రదర్శించే కళలు, చెప్పే కథలు ఉంటాయి. వీటిని ఆయా సందర్భాలలో, ప్రాంతాలలో ప్రదర్శించినప్పుడు వాటి పేరు అదే ఉన్నా దాని స్వభావంలో, రూపంలో, కథలో మార్పులు చోటుచేసుకుంటాయి. కళల్లో మౌఖికమైన సంప్రదాయం ఎక్కువగా ఉండటం వల్ల చాలా తొందరగా తన మూల స్వభావాన్ని కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంది.

కనుక ఇకనైనా బద్ధిజీవులు ఈ సమస్యలను చాలా స్పష్టంగా సమాజానికి తెలియపరచాలి. వాటి బారి నుండి ప్రజా కళలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నది.

## ఉపయుక్త గ్రంథసూచి:


1. కుటుంబరావు, కొడవటిగంటి. "సంస్కృతి వ్యాసాలు". హైదరాబాద్: విప్లవ రచయితల సంఘం,1999.

2. తిరుమలరావు, జయధీర్(సం.క). "తెలంగాణ పోరాట పాటలు". హైదరాబాద్: సాహితీ సర్కిల్,1990.

3. తిరుమలరావు, జయధీర్., గూడూరు మనోజ. "మూలధ్వని". హైదరాబాద్: తెలంగాణ రచయితల వేదిక, 2019.

4. తిరుమలరావు, జయధీర్. "జానపద సంస్కృతి కళలు-గతం, వర్తమానం". (అముద్రితం).

5. దండెం, ఎస్.ఎం.(సంపా) "శబ్దం"(మాస పత్రిక). హైదరాబాద్: ప్రజా కళామండలి పబ్లికేషన్స్, సెప్టెంబర్ ప్రత్యేక సంచిక, 2018.

6. వెంకటేశ్వరరావు, కానూరి. "కళలు-సంస్కృతి". ఆంధ్రప్రదేశ్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, 2005.

7. సంజీవ్‌దేవ్, సూర్యదేవర., చిమకుర్తి శేషగిరిరావు. "లలిత కళల సమీక్ష- వికాస చరిత్ర". హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

8. సత్యనారాయణ. చింతపల్లి. "ప్రజానాట్యమండలి - ప్రజా కళారూపాలు". విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2007.


★ రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు

నివేదిక

# నిర్బంధం నీడలో పోడు భూముల పోరాటం

మెంచు రమేష్

తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆదివాసులు, గిరిజనులు ,పేదలు సాగుచేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, నిజామాబాద్ కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం జిల్లాలో సదస్సులు, ధర్నాలు జరిగాయి. వీటి కొనసాగింపుగా హనుమకొండలో సెప్టెంబర్ 16న అమరవీరుల స్థూపం నుంచి ఏకశిలా పార్కు వరకు ర్యాలీ, ఏకశిలా పార్కు వద్ద భారీ ధర్నా నిర్వహించాలని అనుకున్నాము. అనుమతి కోసం ఆగస్టు 26న స్థానిక సిఐ, ఏ సి పి, డి సి పి, సెంట్రల్ జోన్ డిసిపిని కలిసాము. చివరకు కమిషనర్ దగ్గరికి వెళ్లాలని చెప్పారు అనుమతి లెటర్‌ను కమిషనర్‌కు ఇవ్వగా ఎంక్వయిరీ చేసి అనుమతి ఇస్తానని చెప్పారు. నాటి నుండి సెప్టెంబర్ 13 వరకు ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా ప్రతిరోజు తిరగవలసి వచ్చింది. చివరకు సెప్టెంబర్ 13 సాయంత్రం అనుమతిని ఇవ్వడం లేదని, ధర్నా జరుపుకోవడానికి అవకాశం లేదని, అనుమతి నిరాకరణ లెటర్‌ను చేతికి ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి మళ్లీ తీసుకోన్నారు. పోలీసులు అనుమతి ఇవ్వక పోవడంతో ప్రెస్ మీట్ పెట్టి ధర్నాను తాత్కాలిక వాయిదా వేస్తున్నామని తెలియజేశాము. కోర్టు ద్వారా అనుమతి వచ్చాక ధర్నా నిర్వహిస్తామని తెలిపి తదనంతరం కోర్టుకు వెళ్లాం.

సెప్టెంబర్ 14న కోర్టులో కేసు ఫైల్ చేసాము. సెప్టెంబర్ 16న విచారణ ఉంటుందని న్యాయమూర్తి తెలిపారు. 16న విచారణ జరగకుండా, 17న విచారణ జరిగింది. 17న, జరిగిన కోర్టు విచారణ ప్రకారం తిరిగి తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 25న హనుమకొండ ఏకశిలా పార్క్ వద్ద ధర్నా జరుపుకోవడానికి వారు అనుమతి కోసం లెటర్ పెట్టుకుంటారు. పోలీస్‌లు దానికి అనుమతి ఇవ్వాలని కోర్టు చెప్పింది. కోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 18న, తిరిగి కమిషనర్ అనుమతి కోసం లెటర్ పెట్టుకోవడం జరిగింది. కోర్టు ఆదేశాలు జారీ చేసింది కాబట్టి ఎలాగో అనుమతి వస్తుందనే ఉద్దేశంతో, మేము ధర్నా ఏర్పాట్లను పూర్తి చేసుకున్నాము. 18 నుండి సెప్టెంబర్ 24 వరకు అనుమతి కోసం కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరగవలసి వచ్చింది. అయినా ప్రయోజనం లేకుండా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి, పోలీస్ కమిషనర్ విశ్వనాథ్ రవీందర్ సెప్టెంబర్ 24 ఉదయం 11 గంటలకు మీకు అనుమతి ఇవ్వడం లేదని అనుమతి నిరాకరిస్తున్నామని లెటర్‌ను ఇచ్చారు.

హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 25న ధర్నా జరుపుకోవడానికి ఏర్పాట్లను పూర్తి చేసుకున్న తర్వాత 24న హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ పోలీస్ కమిషనర్ అనుమతి నిరాకరించారు. హాల్‌లో కనీసం సదస్సు జరుపుకోవాలనే ఉద్దేశంతో హన్మకొండలోని, వడ్డేపల్లి నందుగల విద్యుత్ భవన్‌ను ఆ రోజు రాత్రి 8 గంటలకు దాని అనుమతి తీసుకొని, ఫీజు చెల్లించి హాలు దగ్గర నుండి ఒక కిలోమీటరు వెళ్ళకముందే, అక్కడ ఉన్నటువంటి స్థానిక సీఐ సదయ్య హాలు వద్దకు వెళ్లి తెలంగాణ ప్రజాఫ్రంట్ వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లో హాల్ ఇవ్వరాదని బెదిరించి ఒకవేళ మీరు ఇచ్చినచో మీ మీద కేసులు పెట్టవలసి వస్తుందని భయభ్రాంతులకు గురి చేసాడు. ఆ రాత్రికి రాత్రి ఏం చేయలేని స్థితిలో 25న ఉదయం కనీసం ప్రెస్ మీట్ పెట్టి జరిగిన విషయము చెప్పాలని అనుకున్నాము. 9 గంటలకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌ను బుక్ చేసుకున్నాము. ఉదయం10 గంటలకు ప్రెస్ మీట్ ఉంటుందని తెలియ చేసాం.

ఉదయం 7 గంటలకే విద్యుత్ భవన్ నందు మూడు వాహనాలు 50 మంది పోలీసు బలగాలు హాలు మొత్తం కూడా చుట్టుముట్టారు. అదేవిధంగా 10 గంటలకు ప్రెస్ క్లబ్‌ను కూడా సివిల్ డ్రెస్‌లో ఉన్నటువంటి పోలీసులు మొత్తం చుట్టు ముట్టారు. 10 గంటల వరకు వివిధ జిల్లాల నుండి వస్తున్న ఆదివాసులు, గిరిజనులు, పేదలు వివిధ సంఘాల నాయకత్వాన్ని ప్రెస్ క్లబ్ చేరుకునే సమయానికి వారినందరిని అక్రమంగా అరెస్టు చేసి వివిధ స్టేషన్లలో నిర్బంధించారు. పోలీసు బలగాలను ఛేదించుకొన్న ప్రధాన నాయకత్వం ప్రెస్‌హాల్ చేరుకొని ప్రెస్ మీట్ పెట్టిన అనంతరం గేటు వద్దకు వచ్చి మరొక్కసారి ప్రెస్‌తో మాట్లాడి అక్రమంగా అరెస్టు చేసినటువంటి వారినందరినీ విడుదల చేయాలని కోరుతూ, పోలీస్ కమిషనర్‌ను కలవడానికి వెళుతున్నామని చెప్పింది. గేటు నుండి నాలుగు అడుగులు ముందుకు వేసి ప్రెస్ క్లబ్ నుండి కమిషనర్ కార్యాలయం వరకు ఆటోలు మాట్లాడుకుని ఎక్కి కూర్చుని కనీసం ఐదు

మీటర్లు వెళ్ళకముందే వందమంది పోలీసు బలగాలు వెంటాడి చుట్టుముట్టి, ప్రెస్ మొత్తం చూస్తుండగానే బూతులు తిడుతూ మహిళలని చూడకుండా నెట్టివేస్తూ అక్రమంగా అరెస్టు చేసి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు.

ఇది ఇలా ఉండగా ఉదయం 6 గంటలు కాకముందే వేలేరు మండలంలోని కన్నారం గ్రామంలో 22 మంది కార్యకర్తలను బెదిరించి వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. అదేవిధంగా భీమదేవరపల్లి మండలంలోని కన్‌పర్తి, మాణిక్యపూర్ గ్రామాలలో ఉన్నటువంటి కార్యకర్తలను నిద్ర లేవకముందే పోలీసులు వచ్చి తీసుకెళ్లి స్టేషన్‌లో పెట్టారు. సెప్టెంబరు 25న కోర్టు ఆదేశాలను పోలీసులు ఉల్లంఘించడమే కాకుండా కనీసం హాలు సదస్సుకు అనుమతి ఇవ్వలేదు. కమిషనర్‌ను కలవడానికి కూడా అవకాశం ఇవ్వకుండా అరెస్ట్ చేసారు. వివిధ జిల్లాల నుండి , గ్రామాల నుండి వస్తున్నటువంటి ప్రజలను, సంఘాల నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టు చేసి కాజీపేట, హనుమకొండ, సుబేదారి, కాకతీయ యూనివర్సిటీ, హసన్ పర్తి, వేలేరు, భీమదేవరపల్లి స్టేషన్లలో నిర్బంధించి వారి అందరిపైనా కేసులు పెట్టి సాయంత్రం 6 గంటలకు వ్యక్తిగత పూచికత్తుపైన పంపించారు.

హైదరాబాద్ నుండి సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్‌కు బయలుదేరినటువంటి తెలంగాణ విద్యార్థి వేదిక నాయకులను కాజీపేట రైల్వే స్టేషన్లలో దిగడంతోనే అక్కడి ప్రజలు అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా మూకుమ్మడిగా సివిల్ డ్రెస్‌లో ఉన్నటువంటి పోలీసులు నలుగురు విద్యార్థులను అరెస్టు చేసి వెంటనే వారి ఫోన్లు తీసుకుని కాజీపేట పోలీస్ స్టేషన్లో సమాచారం ఎవరికీ తెలియ కుండా నిర్బంధించారు. నిర్బంధించిన విద్యార్థులను స్పెషల్ బ్రాంచ్, క్రైమ్, సివిల్ పోలీసులు వివిధ రకాలుగా ఇంటరాగేషన్ చేస్తూ మానసిక ఒత్తిడికి గురి చేశారు. వారి ఫోన్‌లో ఉన్నటువంటి సమాచారం మొత్తం కూడా కాపీ చేసుకుని మీ దగ్గర నిషేధిత సాహిత్యం ఉన్నదంటూ అక్రమంగా కేసులు పెట్టారు. సమాచారం తెలుసుకుని నాయకత్వం అంతా అక్కడికి వెళ్ళిన తర్వాత కానీ వారిని విడుదల చేయలేదు. అదేవిధంగా అమరుల బంధుమిత్రుల సంఘం ఉపాధ్యక్షురాలు శాంత ఈ మధ్యకాలంలో పక్షవాతం వచ్చి సరిగ్గా మాట్లాడలేని పరిస్థితి. వేరే మనిషి సహకారం లేకుండా నడవలేని పరిస్థితి. అయినప్పటికీ ఆమెను 25న ఉదయం పగిడిపల్లి ఇంటికి వెళ్లి అక్రమంగా జీపులో ఎక్కించుకుని కాకతీయ యూనివర్సిటీ స్టేషన్లో నిర్బంధించారు. ఇది ఫ్రెండ్లీ పోలీసింగ్ అని మాట్లాడే తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటు.

## పోడు, కౌలు రైతులకు పెట్టుబడి మద్దతు కోసం కలెక్టరేట్ల ముందు ధర్నా

తెలంగాణ రైతాంగ సమితి ఆధ్వర్యంలో వాస్తవ సాగుదారులకు(పోడు, కౌలు, దేవాదాయ, వక్ఫ్, సాదానామ భూములు సాగుచేసుకుంటున్న వారు) పెట్టుబడి మద్దతు (రైతుబంధు, బ్యాంకు లోన్లు, పంట బీమా, సబ్సిడీలు, రైతు బీమా మొదలైనవి) వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కార్యాలయాల ముందు ధర్నాలు జరిగాయి.

ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో గద్వాల, వనపర్తి, సూర్యాపేట, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, సిద్దాపేట, కామారెడ్డిలలో ఈ ధర్నాలు జరిగాయి. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆసిఫాబాద్‌లో 1500 మందితో, ఉట్నూర్‌లో 500 మందితో ధర్నాలు జరిగాయి. కాగజ్‌నగర్‌లో సదస్సు జరిగింది. ఈ సభలో తొలకరి పత్రిక సంపాదకులు కన్నెగంటి రవి ప్రసంగించారు. కామారెడ్డి జిల్లా సదాశివ్‌నగర్ మండలంలో, యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో అటవీ భూముల రక్షణ కోసం పోరాడుతున్న గిరిజనులకు మద్దతు తెలిపాము. సభలు ఏర్పాటు చేసి పోరాటాలు ఆపకుండా భూములు కాపాడు కోవాలని రైతాంగ సమితి పిలుపునిచ్చింది. వివిధ జిల్లాల్లోని రైతు సమస్యలపై పోరాటాలతో పాటు అధికారులకు వినతిపత్రాలు సమర్పించింది.

**–జక్కుల వెంకటయ్య**

తెలంగాణ రాష్ట్ర సమితి ఎన్నికల ముందు ఆరు నెలల్లో సాగుచేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టాలు ఇవ్వకపోగా, కనీసం నిరసన తెలిపే స్వేచ్ఛ లేకుండా, సభలు పెట్టుకునే స్వేచ్ఛ లేకుండా, భావ ప్రకటన స్వేచ్ఛను హరించి వేస్తూ ప్రశ్నించే గొంతుకలను ఉక్కుపాదంతో అణిచి వేస్తున్నది. చట్టాలను, కోర్టు ఆదేశాలను ఉల్లంగించడంలో ఈ ప్రభుత్వం ముందు వరుసలో ఉంది. దశాబ్దాల తరబడి సాగుచేసుకుంటున్న అటవీ భూములను హరితహారం అనే అభివృద్ధి ముసుగులో పేదల పై ఉక్కుపాదం మోపి అక్రమ కేసులు బనాయిస్తూ వారి భూములను గుంజుకుంటున్నది. ఆదివాసీ చట్టాలను అమలు చేస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఆదివాసులకు, గిరిజనులకు, పేదలకు సాగుచేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ విజ్ఞప్తి చేస్తుంది.

★ రచయిత: ప్రధాన కార్యదర్శి, టీపీఎఫ్

# డా॥వినోదినికి మా మద్దతు

కడపజిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు, పరిశోధకురాలు, దళిత బహుజన మైనారిటీ యాక్టివిస్ట్, రచయిత అయిన డాక్టర్ ఎం.ఎం. వినోదిని గారికి దళిత, బహుజన, స్త్రీవాద, హక్కుల కార్యకర్తలు, ఉద్యమ కారులు, రచయితలు, జర్నలిస్టుల సంఘీభావ, మద్దతు ప్రకటన

మిత్రులారా! డా.వినోదిని ఆరు సంవత్సరాల క్రితం 'వేగుచుక్కలు:అన్నమయ్య, వేమన, పోతులూరి వీరబ్రహ్మంల సామాజిక దృక్పథం' అనే పరిశోధనాత్మక పుస్తకం రాశారు. ఈ పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 2014లో ప్రచురించింది. ఇప్పుడు ప్రజాశక్తి బుక్ హౌస్ విజయవాడ వారు 'బహుముఖ దార్శినికుడు, బహుజన తాత్వికుడు పోతులూరి వీరబ్రహ్మం' అనే పేరు మీద 37 పేజీల వ్యాసాన్ని విడిగా చిన్న పుస్తకంగా ప్రచురించారు. దానిలో ఆయన శూద్రకులంలో పుట్టాడన్న ఒక వాక్యాన్ని ఎత్తిచూపుతూ ఆమె మీద విశ్వ బ్రాహ్మణ సమూహానికి చెందిన కొంతమంది చెప్పరాని బూతులతో దాడికి దిగటమే కాక వివిధ జిల్లాల కలెక్టర్లకు, గవర్నర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. ఫోన్ కాల్స్ ద్వారా బాగా బెదిరిస్తూ, భయోత్పాతం కలిగించే హెచ్చరికలు వాట్సాప్‌లో పంపుతున్నారు.

కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా వున్న డా.వినోదినిపై గత కొంత కాలంగా జరుపబడుతున్న ఈ బ్రాహ్మణీయ కుల పితృస్వామ్య విషపు దాడులను ఖండించవలసిందిగా కోరుచున్నాము. ఈ దాడులు చేస్తున్నవారు విశ్వబ్రాహ్మణులమని చెప్పుకుంటూ, వీర బ్రహ్మేంద్ర స్వామిని, వినోదిని తన పుస్తకంలో 'శూద్రుడు' అని పేర్కొనడం వీరికి తీవ్రమైన అభ్యంతరం ఉందంటున్నారు. అయితే 'శూద్ర' అనే పదాన్ని వినోదిని మాత్రమే సృష్టించి వాడలేదని, అంతకు ముందే చాలా మంది ప్రముఖ చరిత్రకారులు, తత్వవేత్తలు, రచయితలు విశ్వకర్మ కులాన్ని, కంసాలి, వడ్రంగి, కమ్మరి మొదలైన వృత్తులు చేసే వారిని 'శూద్ర'కులంగానే ప్రస్తావించారు అనేది వీరు పూర్తిగా విస్మరిస్తున్నారు. వినోదిని గారి మీదనే పగపట్టి అమానవీయ రీతిలో మానసికపరమైన దాడి చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. డా.వినోదిని దళిత సమూహానికి చెందిన ప్రొఫెసర్ కాబట్టే ఆమెపై కుల, మత దురహంకారంతో ఈ మానసిక దాడి, అవమానం చేస్తున్నారనేది స్పష్టమే. వీరు ఒక విషయాన్ని గమనించాలి. వీరు విమర్శ చేయాలనుకుంటే రాజకీయ చర్చ చేయాలి. అది రాత ద్వారా కావచ్చు, వ్యాఖ్యానం ద్వారా కావచ్చు. ఒక ఆరోగ్యకరమైన చర్చ జరిగినట్లయితే కొన్ని ముఖ్యమైన అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం వుంటుంది. అవి 1. సమాజంలోని ప్రజాశ్రేణులకు సంబంధించిన పదాలు, నామకరణాల వాడుకలు ఆయా కాలాలలోని ఉద్యమాలు, సిద్ధాంతాల ఆధారంగా రూపొందుతాయి, అవి చరిత్ర కారుల, సాహితీవేత్తల రచనల ద్వారా ప్రజల వాడుకలోకి వస్తాయి. 2.ముఖ్య విషయం ఏమంటే శూద్రులు అనే పదం చాతుర్వర్ణ ధర్మం, నిచ్చన మెట్ల కులవ్యవస్థ వల్ల ఉనికిలోకి వచ్చింది. అంతే కాక బ్రాహ్మణ వాదాన్ని వర్ణాశ్రమ చాతుర్వర్ణ ధర్మాన్ని పోతులూరి వీరబ్రహ్మం తీవ్రంగా వ్యతిరేకిస్తూ పద్యాలూ రాశారు. ఈ పుస్తకంతో పాటు విడుదలయిన మరికొన్ని పుస్తకాలలో కూడా కొంతమంది ఆ సమూహానికే చెందిన రచయితలు బ్రహ్మంగారు 'శూద్రుడు' అనే రాశారు. ఈ అంశాలను పక్కన పెట్టి కేవలం వినోదిని గారిపై సోషల్ మీడియాలో, వాట్సప్, మెసేజుల్లో మానసికమైన దాడి చేయటంలో వీరి ఆంతర్యమేమిటి? ఇది కుల, పురుష దురహంకారం తప్ప ఇంకోటి కాదు.

– డా. వినోదినికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దుండగుల నుండి రక్షణ కల్పించాలి.

– ఆమెపై దాడికి పాల్పడుతున్న ఉన్మాదులపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలి

– డా.వినోదినిపై జరుగుతున్న దాడిని ఖండించి మద్దతు తెలిపిన కారణంగా బహుజన ఉద్యమకారులు, రచయిత అయిన దాసోజు లలితగారిపై కూడా ఈ శక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీరిద్దరిపై జరుగుతున్నదాడిని మేమంతా ముక్త కంఠంతో ఖండిస్తున్నాము. ఒక ఆరోగ్యకరమైన చర్చ ద్వారా భిన్నాభిప్రాయాలను కలబోసుకునే ప్రజాస్వామిక వాతావరణాన్ని అందరం కోరుకోవాలి తప్పించి ఉన్మాద ప్రకటనలు, అసభ్యకరమైన పోస్టులు, బెదిరింపు ధోరణులు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకారయోగ్యం కాదు. వినోదినికి, దాసోజు లలితకు సంఘీభావంగా మీరూ మాతో గొంతు కలుపుతారని ఆశిస్తున్నాము.

T

# అసమ్మతిని వినిపిస్తున్నందుకే అణచివేత

## రచయితలు, ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులను ఖండించండి

విరసం కార్యవర్గసభ్యుడు సి.కాశీం, వీక్షణం మాసపత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, తెలంగాణ ప్రజాఫ్రంట్ కార్యదర్శి మెంచు రమేష్, ఉపాధ్యక్షులు నలమాస కృష్ణపై తెలంగాణ ప్రజా భద్రతా చట్టం, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యుఎపిఏ), రాజద్రోహ నేరం మొదలైన కేసులు పెట్టారు. ఈ నెల 12వ తేదీ హైదరాబాదులో విప్లవ రచయితలు బి.అనూరాధ, రవిశర్మల ఇంటి మీద పోలీసులు దాడి చేసి 14 గంటలు సోదాలు చేశారు. ఆ తర్వాత వాళ్లపైన అనేక అక్రమ ఆరోపణలు చేస్తూ అరెస్టు చేశారు. అయోధ్యలోని బాబ్రీ మసీదు–రామ జన్మభూమి వివాదంపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ 12వ తేదీ హిందుత్వ ఫాసిస్టు దాడి వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో వాళ్లు పాత్రికేయ సమావేశం నిర్వహించవలసి ఉండింది. అయితే ఆ రోజు ఉదయమే పోలీసులు వాళ్ల ఇంటి మీద దాడి చేసి అరెస్టు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌లో కాశీం, వేణుగోపాల్, రమేష్, కృష్ణ పేర్లు కూడా చేర్చారు. పైగా వీరందరూ పరారీలో ఉన్నారని మరో తప్పుడు ఆరోపణ చేశారు.

సి.కాశీం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. గత పదేళ్లకు పైగా విప్లవ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడిగా పని చేస్తున్నాడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థిగా, రచయితగా క్రియాశీలంగా పని చేశాడు. విప్లవ రచయితగా, కవిగా, వక్తగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితమైన వ్యక్తి. సామాజిక, సాహిత్య, రాజకీయ వ్యాసాలు ఎన్నో రాశాడు. ఆయన కవితా సంపుటం, సాహిత్య వ్యాస సంపుటం, పాలమూరు, తెలంగాణ విశ్లేషణ వ్యాసాలు పుస్తకాలుగా వెలుబడ్డాయి. రిజర్వేషన్లపై రాసిన పుస్తకం విస్తృత ప్రాచుర్యం పొందింది. ఆయన ఎడిటర్‌గా నడుస్తున్న తెలంగాణ మాస పత్రికకు ప్రత్యామ్నాయ పత్రికల్లో ఎంతో గుర్తింపు ఉంది. నిత్యం ప్రజా సమస్యలపై ఆందోళనల్లో పాల్గొంటూ బహిరంగ జీవితం గడుపుతున్న వ్యక్తి మీద అనేక అక్రమ ఆరోపణలతో ఉపా, రాజద్రోహం వంటి అక్రమకేసులు పెట్టారు. ఇటీవల తెలంగాణలో ప్రజాసంఘాల కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులన్నిటిలో కాశీం పేరు చేర్చుతున్నారు. ఇప్పటికి ఐదు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యుఎపిఏ) కేసులు పెట్టారు. కవిగా, మేధావిగా, అధ్యాపకుడిగా, పత్రికా సంపాదకుడిగా ఆయన భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోడానికే ఇలా కేసులు పెడుతున్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ ప్రచారాన్ని అడ్డుకోడానికే ఈ నిర్బంధాన్ని ప్రభుత్వం తీసుకొస్తోంది.

ఎన్. వేణుగోపాల్ ముప్పై ఏళ్లకు పైగా విప్లవ రచయితగా, మార్క్సిస్టు మేధావిగా సాహిత్య రంగంలో పని చేస్తున్నాడు. కవిత్వం, సాహిత్య విమర్శ, రాజకీయార్థిక విశ్లేషణ, చరిత్ర పరిశోధన వంటి ఎన్నో రంగాల్లో కృషి చేస్తున్నాడు. అనువాదాలతో వివిధ ప్రక్రియల్లో ఎన్నో పుస్తకాలు ఆయనవి విడుదలయ్యాయి. వీక్షణం రాజకీయార్థిక మాస పత్రిక ఎడిటర్‌గా, వక్తగా నిత్యం ప్రజా జీవితం గడిపే బాధ్యతాయుత ఆలోచనాపరుడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలకు తన రచనలు, ఉపన్యాసాల ద్వారా విస్తృత ప్రాచుర్యం కలిగించాడు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలపై ప్రజాపక్షం వహించి భిన్నాభిప్రాయాలను వినిపిస్తున్న ఆయన గొంతు నొక్కేసేందుకే ఈ అక్రమ కేసు పెట్టారు.

మెంచ్ రమేష్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకాలంలో ఏర్పడ్డ తెలంగాణ ప్రజాఫ్రంట్‌లో మొదటి నుంచి నాయకత్వం బాధ్యతలు వహిస్తున్నాడు. భౌగోళిక తెలంగాణ వల్ల ప్రజా ఆకాంక్షలు నెరవేరవనీ, ప్రజాస్వామిక తెలంగాణతోనే సమస్యలు పరిష్కారమవుతాయనే అవగాహనతో ఈ సంస్థ పని చేస్తోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కాలంలో అనేక పోరాటాలు నడిచాయి. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటాల్లో వ్యక్తిగా, తెలంగాణ ప్రజా ఫ్రంట్ బాధ్యుడిగా ప్రజా ఉద్యమ నిర్మాణం చేస్తున్నాడు. తెలంగాణలో కనీస హక్కుల కోసం ఉద్యమిస్తున్నందుకే రమేష్ మీద దుర్మార్గమైన నేరారోపణలు చేస్తూ కేసులు పెట్టారు.

కేంద్రంలోని బీజేపీ కనుసన్నల్లో తెలంగాణ పోలీసులు రాష్ట్రంలోని ప్రజాస్వామికశక్తులను అణచివేయడానికే ఇలాంటి కేసులు పెడుతున్నారు. రచయితలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులను ప్రజల పక్షాన మాట్లాడకుండా చేయడానికే ఇట్లా కేసులు పెడుతున్నారు. ఈ నిర్బంధ విధానాలను ఖండించాలని విరసం కోరుతోంది. కాశీం, వేణుగోపాల్, రమేష్, నలమాస కృష్ణ మీద అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తోంది. ఇదే కేసులో జెయిల్లో ఉన్న అనూరాధ, రవిశర్మలను విడుదల చేయాలని కోరుతోంది.

## తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నలమాస కృష్ణ తో పాటు విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

# ప్రజా ఉద్యమాలపై, ఆర్టీసీ సమ్మెపై బీజేపీ, టీఆర్ఎస్ అణిచివేత నిర్బంధ విధానాలను ఖండించండి.

*ప్రియమైన ప్రజలారా....*

తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులపై, ప్రజా ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తూ అక్రమకేసులను బనాయిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కష్టపడి కోస్తాంధ్ర పాలకవర్గాల కర్కశ నిర్బంధాన్ని ఎదిరించి పోరాడిన నిజమైన తెలంగాణ నాయకత్వంపై టీఆర్ఎస్ మొదటి నుండి అణిచివేత విధానాలను కొనసాగిస్తుంది. రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై అణిచివేత కొనసాగిస్తూ కార్పొరేటు విధానాలను అమలు చేస్తున్నాయి. ఆర్టీసీ కార్మికులు తమ హక్కులకోసం 50 రోజుల నుండి రాజీలేకుండా పోరాడుతున్నారు. 49 వేల మంది కార్మికుల డిమాండ్లను పరిశీలించకుండా కాలయాపన చేస్తూ, టీఆర్ఎస్ మొండి వైఖరి వలన అనేకమంది కార్మికులు అత్మహత్యలకు పాల్పడ్డారు. వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ స్థితిలో కార్మికుల పట్ల మానవీయ దృష్టితో కూడా చూడకుండా వారు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అణిచివేత చర్యలు కొనసాగిస్తున్నారు. సమ్మెకు మద్దతుగా నిలిచిన విద్యార్థి, ప్రజాసంఘాలపై తీవ్రమైన బెదిరింపులు, అక్రమకేసులు, అరెస్టులు కొనసాగిస్తూన్నారు. ఆర్టీసీ కార్మికులపై మరియు సమ్మెకు మద్దతుగా నిలిచిన విద్యార్థి, ప్రజాసంఘాలపై బేషరతుగా నిర్బంధాన్ని ఎత్తివేయాలని కోరుతున్న పౌరహక్కుల సంఘాల నాయకులపై ఉపా లాంటి కఠినమైన దుర్మార్గపు కేసులు బనాయించడం కన్నా అన్యాయం మరొకటిలేదు.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ప్రజా, కుల సంఘాలు ఇతర ప్రజాస్వామిక సంస్థలు, వేలాదిమంది తెలంగాణ వాదులు, సాంస్కృతికవాదులు ఎందరో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పనిచేయగలిగిన ప్రజాసంఘాలను తమ త్యాగలతో ఊపిరిలూదిన, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పని చేయవద్దని అనేక రకాల నిర్బంధాలను రాజ్యం ప్రయోగిస్తుంది. నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక తెలంగాణ నినాదాన్ని అందుకుని తెలంగాణ ప్రజాఫ్రంట్‌తో సహా అనేక సంఘాలు అలుపెరగకుండా రాజీలేని పోరాటం చేస్తున్నాయి. విద్యార్థి, నిరుద్యోగ, కార్మిక, కర్షక, మహిళ మొదలైన వర్గాల సమస్యల పట్ల టీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది.

ఈ నేపథ్యంలోనే ఆర్టీసీ కార్మికులు సమ్మెబాట పట్టారు. సమ్మెకు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. గతంలో మున్సిపాల్, ఆశావర్కర్ల సమ్మెను ఇతర పోరాటాలను అణిచివేసినట్లుగా తేలికగా దీనిని కూడా అణిచివేయాలని ప్రభుత్వం భావించింది. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ సమ్మెకు సంఘీభావంగా ఉద్యమానికి సిద్ధమైన విద్యార్థి, ప్రజాసంఘాలపై మావోయిస్టు ముద్రతో ప్రభుత్వం విరుచుకుపడింది. మావోయిస్టు బూచి చూపి అన్ని వర్గాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, సమ్మె చేస్తున్న కార్మికులకు ఎటువంటి మద్దతులేకుండా చేయాలన్నదే ప్రభుత్వం ఎత్తుగడ.

అక్టోబర్ 4న మహబూబ్‌నగర్ నుండి గద్వాలకు వెళ్తున్న టీవివి జిల్లా కన్వీనర్ నాగరాజును అదుపులోకి

తీసుకొని తీవ్రంగా కొట్టి అయనపై ఉపా కేసు పెట్టారు. అదే కేసులో బలరాంను జైలు ముందే అరెస్టు చేశారు. మరి కొందరిని ఈ కేసులో పెట్టారు. సెప్టెంబర్ 8న టీవీవీ అధ్యక్షులు మద్దిలేటి ఇంటిపై పోలీసులు దాడిచేసి నల్లకుంట పీఎస్‌లో మరో కేసు నమోదు చేశారు. అక్టోబర్ 10న స్టూడెంట్ మార్చ్ ఎడిటర్ జగన్‌ను అరెస్టు చేసి ఇంటిని సోదా చేశారు. ఇదే కేసులో అక్టోబర్ 15న ఉదయం టీఫిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నలమాసకృష్ణ, టీవీవీ రాష్ట్ర అధ్యక్షులు మద్దిలేటిని హైదరాబాద్‌లోని టీఫిఎఫ్ రాష్ట్రకార్యాలయంలో ఉన్నటువంటి వారిని అక్రమంగా అరెస్టు చేశారు. అక్టోబర్ 17న కొత్తగూడెం జిల్లా లక్ష్మిదేవిపల్లి పిఎస్‌లో మరో తప్పుడు కేసులో నలమాస కృష్ణను ఇరికించారు. మరో 24 గంటలు గడవక ముందే చర్ల పీఎస్‌లో మరో కేసును కృష్ణ, మద్దిలేటిపై పెట్టారు. వీరు జైళ్ళో ఉండగానే అక్టోబర్ 19న చర్ల పిఎస్‌లో మరో తప్పుడు ఉపా కేసులో ఇరికించారు. ఇదే కేసులో మొదట యువ న్యాయవాది అనిల్, సురేష్‌లను అరెస్టు చూపించారు.

ఈ కేసులో మొత్తం 34 మంది, 12 ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులను యుఎపిఎ కేసులో ఇరికించారు. వీరంతా అనేక దశాబ్దాలుగా తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం వివిధ రంగాల్లో కృషి చేస్తున్నవారు. విద్యార్థులుగా, పరిశోధకులుగా, వివిధ వృత్తులు చేసుకుంటూ తమ శక్తి మేరకు ప్రజా సమస్యలపై రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్న వారు. చర్ల కేసులో పేర్లు ప్రకటించడంకంటే ముందు హైదరాబాద్‌లో సీపీ అంజన్‌కుమార్ 23 ప్రజాసంఘాల పేర్లు మీడియాముఖంగా ప్రకటిస్తూ వాటిని ప్రభుత్వం నిషేధించిందని తప్పుడు ప్రకటన చేశారు. ఆ తర్వాత వరుసగా అరెస్టుల పరంపర మొదలైంది. నవంబర్ 12న హైదరాబాద్‌లో రవిశర్మ, అనురాధలను ఇంట్లో సోదాలు చేసి వారిపై అక్రమంగా కేసులు పెట్టి జైల్లో నిర్బంధించారు. అంతేకాకుండా ఆ కేసులో వారితో పాటు వేణుగోపాల్, కాశీం, నలమాస కృష్ణ, మెంచు రమేష్ పై కూడా ఉపా కేసు నమోదు చేసి పరారీలో ఉన్నారని పేర్లు ప్రకటించారు. జైల్లో ఉన్నటువంటి నలమాస కృష్ణను కూడా పరారీలో ఉన్నారని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది.

ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతున్న తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకత్వంపై, వివిధ ప్రజాసంఘాల నాయకత్వంపై కేసులు బనాయిస్తున్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంతో మొదలైన కేసులు పరంపర రోజురోజుకి ఎక్కువైతుంది. నవంబర్ 9 న ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా జరిగిన మిలియన్‌మార్చ్‌లో మావోయిస్టులు పాల్గొన్నారని హైదరాబాద్ సీపీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెపై కొనసాగుతున్న నిర్బంధానికి వ్యతిరేకంగా, సమ్మెకు మద్దతుగా నిలిచిన వివిధ ప్రజా, విద్యార్థి సంఘాలపై కొనసాగుతున్న నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్రకమిటీ పిలుపునిస్తుంది.

## తెలంగాణ ప్రజా ఫ్రంట్ (TPF)

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు**

**ఫేస్‌బుక్ పేజి:** www.facebook.com/pages/Nadustunna-Telangana





వామపక్ష, విప్లవ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో

అక్టోబర్ 23న హైదరాబాద్ – సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన

నిర్బంధ వ్యతిరేకసభలో ప్రసంగిస్తున్న వక్తలు,

సభకు హాజరైన ప్రజా సంఘాల కార్యకర్తలు

RNI Number : APTEL /2011/37247
ISSN 2349 - 2376
Publishing Date : 25 - 11 -2019




ఈ పత్రికను చదివాక మీ అభిప్రాయాలు రాయడం మర్చిపోవద్దు.

మీ సూచనలే మా తొవ్వకు వెలుగు.

**To**

Printed Matter **BOOK-POST**

Stamp

చందాదారులుగా చేరండి - చేర్పించండి
సంవత్సర చందా200/- రూ.

*From :*
ఎడిటర్, నడుస్తున్న తెలంగాణ
క్వార్టర్ నెం. ఆర్-9, ఉస్మానియా క్వార్టర్స్, ఓయూ,
హైదరాబాద్- 500 007, ఫోన్ నెం. 9290745490

నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్:
62254225854, ఎస్‌బీహెచ్,
రాంకోఠి బ్రాంచ్ (20350), హైదరాబాద్

**Printed, Published and Owned by** M.SNEHA LATHA Printed at: TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No. 6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Published at : TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Editor :Dr.C.KASEEM. RNI No. APTEL/2011/37247